www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 3-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 334
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చవితి సా.6.02 తదుపరి పంచమి, నక్షత్రం: రేవతి ఉ.6.39, అశ్విని తె.4.29 వరకు, వర్జ్యం: రా.12.51-2.18, అమృతఘడియలు: రా.9.56-11.24, దుర్ముహూర్తం: మ.12.50-1.37, మ.3.11-3.58, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 6.18
వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అభయారణ్యంలో శ్రీశైలానికి సాఫీగా..



- ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం అనుమతి
- రూ.7,700 కోట్ల అంచనా వ్యయం
- బ్రాహ్మణపల్లి నుంచి దోమలపెంట వరకు..
- 30 అడుగుల ఎత్తులో 62 కి.మీ. నిర్మాణం
- పూర్తయితే.. 24 గంటలూ రోడ్డుపై వాహన రాకపోకలకు అనుమతి

12

జాబిల్లిపై 'బ్లూ ఘోస్ట్'

2

చంద్రుడిపై దిగిన రెండో ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర

- జనవరి 15న ప్రయోగించిన అమెరికన్ ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'
- 15 రోజులపాటు చంద్రుడిపై పరిశోధనలు
- గురువారం దిగనున్న మరో ల్యాండర్.. ఎథెనా!
- మరో 3 నెలల్లో జపనీస్ ల్యాండర్ కూడా..



చంద్రుడిపై దిగిన బ్లూ ఘోస్ట్. చిత్రంలో జాబిల్లి ఉపరితలాన్ని, దూరంగా భూమిని చూడవచ్చు.

సెబీ మాజీ చీఫ్ మాధవి పురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

2



- మరో ముగ్గురు సెబీ డైరెక్టర్లు, బీఎస్ఈ ఎండీ, సీఈవోపై కూడా..
- 30 రోజుల్లో కేసు నివేదిక సమర్పించాలి
- ఏసీబీకి ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆదేశం



కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు పోకిరీల వేధింపులు

- అనుచితంగా ప్రవర్తిస్తూ వీడియోలు తీసిన దుండగులు 2
- గత నెల 28న మహారాష్ట్రలోని సంత్ ముక్తాయ్ యాత్రలో ఘటన
- ఠాణాలో మంత్రి ఫిర్యాదు.. 2 గంటలు కూర్చోబెట్టిన పోలీసులు
- అమ్మాయి విషయం కావడంతో పునరాలోచించుకోవాలని సూచన
- కేంద్ర మంత్రి కుమార్తెకే రక్షణ లేకపోతే ఎలా అని రక్షా ఖడ్సే ఆవేదన

కేటీఆర్‌కు అహంకారం..
కిషన్‌రెడ్డికి కుళ్లు

ఆయన కన్నా జూనియర్‌గా ఉన్న నేను ఎదిగానని అసూయ

- రాష్ట్రానికి మంచి చేయాలని మోదీకి ఉన్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నారు
- ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారు
- రాకపోతే రేవంత్ ఏం చేయలేదంటున్నారు
- ఎయిర్‌పోర్టు తెచ్చింది ఆయనే ఐతే.. మూసీ, ఆర్ఆర్ఆర్, మెట్రోలను అడ్డుకున్నదెవరు?
- కేంద్రం వద్ద ఈడీ, సీబీఐ ఉన్నాయని ఎంత కాలం బెదిరిస్తారు? చావు ఓ సారే వస్తుంది
- కృష్ణాలో ఎక్కువ నీటిని ఏపీకి ఇస్తూ కేసీఆర్ పెట్టిన సంతకం రాష్ట్రానికి యమపాశమైంది
- ఏడాది కాకముందే దిగిపోవాలంటున్నారు.. ఈ పాలమూరు బిడ్డపై పగ ఎందుకు?
- వనపర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలు ప్రారంభం
- **కృష్ణా జలాల అక్రమ వినియోగంపై ఏపీ మీద ఫిర్యాదుకు సిద్ధం**
- నేడు ఢిల్లీకి సీఎం.. జలశక్తి మంత్రితో భేటీ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, జూపల్లి తదితరులు

బీఆర్ఎస్ వల్లే టన్నెల్ ప్రమాదం!

- పదేళ్లు వాళ్లు పట్టించుకోలేదు
- ప్రమాదం జరిగాక అబుదాబిలో హరీశ్ జల్సాలు 13
- ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నిబద్ధతను నిరూపించుకుంటాం: రేవంత్
- టన్నెల్ లోనికెళ్లి సీఎం పరిశీలన

మహబూబ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నారని, నిత్యం అసూయతో రగిలి పోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు అహంకారం ఉంటే.. కిషన్‌రెడ్డికి కుళ్లు ఉందని అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.879.80 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రానికి నిధులిచ్చి మంచి చేయాలని ప్రధాని మోదీ చూస్తున్నా.. కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. తాము కేంద్ర మంత్రుల వద్దకు, ప్రధాన మంత్రి వద్దకు పలుమార్లు వెళ్లి ఏదైనా సాధిస్తే.. కిషన్ రెడ్డి తానే తెచ్చానంటూ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. వస్తే తన ఖాతా లోకి, రాకపోతే రేవంత్‌రెడ్డి ఏమీ చేయడంలేదని ఆరోపించడం ఆయనకు

మిగతా 13వ పేజీలో...

రెండో వారంలో బడ్జెట్ సమావేశాలు

- 6న క్యాబినెట్ భేటీలో ఖరారు
- తొలుత ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లులకు అసెంబ్లీలో ఆమోదం
- తర్వాత వారంపాటు విరామం
- అనంతరం ఢిల్లీకి అఖిలపక్షం
- బీసీలకు 42% కోటా కోసం రాజ్యాంగ సవరణ చేయాలంటూ కేంద్రంపై ఒత్తిడి
- విరామం తర్వాత బడ్జెట్
- ఏప్రిల్ 3 దాకా సమావేశాలు
- అసెంబ్లీని ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ ఉత్తర్వులు 14

లభించని ఆచూకీ!

- టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు 13
- నీటి ఊటతో అవాంతరాలు
- 7 మీటర్లు తవ్వినా కానరాని జాడ.. నేడు కొలిక్కి!



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

సీఎం రేవంత్.. కన్ఫ్యూజన్‌లో!

- విమానాశ్రయాలు నిర్మించేది కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రం కాదు
- మామునూరు ఎయిర్‌పోర్టును ఎవరు తెచ్చారో ప్రజలకు తెలుసు
- మిగులు ఉన్న తెలంగాణ.. కాంగ్రెస్ వచ్చాక అప్పులపాలు ఎలా అయ్యింది?
- విమానాశ్రయానికి భూ సేకరణ ఎంత త్వరగా చేస్తారో చూద్దాం!
- భూమి ఇస్తే రెండున్నరేళ్లలోనే పూర్తి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- రామప్పకు గుర్తింపు వచ్చినప్పుడే మోదీ ఎయిర్‌పోర్టు హామీ ఇచ్చారు
- విమానాశ్రయంతో వరంగల్‌లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయాలను నిర్మించేది ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం భూ సేకరణ మాత్రమే చేస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టును రాజకీయం చేయొద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం వల్లే మామునూరు విమానాశ్రయం ఆలస్యమైందని రామ్మోహన్ ఆరోపించారు. ఆదివారం కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. 'మామునూరు ఎయిర్‌పోర్టును ఎవరు తీసుకొచ్చారో ప్రజలకు తెలుసు. అందుకే దీన్ని వారికే వదిలేద్దాం' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. అప్పులపాలు ఎలా అయ్యిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను ముందు అమలు చేయండి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. మేం మాట ఇచ్చాం. అందుకు అనుగుణంగా వరంగల్ ఎయిర్‌పోర్టును ఇస్తున్నాం. దానికి ఎంత తొందరగా భూసేకరణ చేస్తారో చూద్దాం' అని రామ్మోహన్ అన్నారు. మామునూరు

మిగతా 14వ పేజీలో...

ఉమ్మడిగా ఎదుర్కొందాం

- తరానికొకసారి వచ్చే సమస్య ఇది
- శాంతిచర్చల్లో ఉక్రెయిన్‌ను బలంగా ఉంచాలంటే మన సాయం అవసరం
- అమెరికా పాత్రనూ విస్మరించలేం
- యూకే ప్రధాని కీర్ స్టార్మర్
- ఈయూ దేశాల భేటీ తర్వాత వ్యాఖ్యలు
- అమెరికాతో సంబంధం లేకుండా యూరప్ దేశాలు బలోపేతం కావాలి
- యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా
- **ఉక్రెయిన్‌కు యూకే రుణం రూ.24,855 కోట్లు!**
- 2 ఆయుధాల తయారీకి ఊతం
- జెలెన్‌స్కీకి కీర్ స్టార్మర్ సాదర స్వాగతం
- అన్నివిధాలా అండగా ఉంటామని హామీ



లండన్‌లో జరిగిన యూరప్ దేశాల భేటీలో మేక్రాన్, స్టార్మర్, జెలెన్‌స్కీ

లండన్, మార్చి 2: ఉక్రెయిన్ విషయంలో అమెరికాను నమ్మరాని మిత్రుడిగా తాను భావించట్లేదని.. ఆ దేశం తమకు ఎప్పటికీ ముఖ్యమైన మిత్రుడేనని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. కానీ, శాంతి చర్చల సమయంలో ఉక్రెయిన్‌ను బలమైన స్థానంలో ఉంచాలంటే యూరప్ నుంచి ఆ దేశానికి ఆర్థిక సాయం అందాల్సిందేనని ఆయన

మిగతా 2వ పేజీలో...

అక్రమ వలసలకు కళ్లెం వేశా!

2

- ఫిబ్రవరిలో 8,326 కేసులే
- దేశ చరిత్రలోనే అతి తక్కువ
- ఇకపై ఇంగ్లిష్ అధికార భాష
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇంగ్లిష్‌కు పట్టం.. వైవిధ్యానికి గొడ్డలిపెట్టంటూ నిరసనలు

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- పట్టభద్రుల నియోజకవర్గం ఫలితం వెల్లడికి 2 రోజులు పట్టే అవకాశం
- **ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నేడే** 13



సంగారెడ్డి జిల్లా బొమ్మారెడ్డిగూడెంలో మృతి చెందిన కోళ్లు

8,000 కోళ్ల మృతి

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం 3

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం ట్రాఫిక్‌పై మళ్లీ సర్వే!



- డీపీఆర్‌లో సమగ్ర వివరాలు లేవన్న కేంద్రం
- రీ సర్వేకు నిర్ణయం.. ఆ తరువాతే ఆమోదం!
- కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రీ సర్వే
- ఆ మార్గంలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయ్?
- ప్రయాణించే వారి అభిప్రాయాలు ఏమిటి?
- తదితర సమగ్ర వివరాల సేకరణ
- త్వరితగతిన ముగించాలని సర్కారు నిర్ణయం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం నిర్మాణానికి కేంద్రం ఆమోదం విషయంలో మరోసారి బ్రేక్ పడింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత దానిపై ఎన్ని వాహనాలు తిరుగుతాయి? ఏడాదికి ఎన్ని వాహనాలు పెరుగుతాయి? వాటి వల్ల వచ్చే ఆదాయం ఎంత? అన్నది తేలిన తర్వాతే ఆమోదం తెలపాలని కేంద్రం యోచిస్తోంది. ఇందుకోసం ఈ రోడ్డుపై తిరిగే వాహనాలు, ట్రాఫిక్ రద్దీపై

మిగతా 12వ పేజీలో...

స్నానానికి కూడా పనికిరాని గంగా నీరు!

- బిహార్‌లో అనేక చోట్ల కలుషితం
- అధిక స్థాయిలో కోలిఫాం బ్యాక్టీరియా
- రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి 2

ఫిబ్రవరిలో 17 అవినీతి కేసులు

- పట్టుబడ్డ వారిలో పోలీసులే ఎక్కువ
- ఏసీబీ డీజీ విజయకుమార్ వెల్లడి 12

ఒక డాలరుకు 10 లక్షల రియాల్స్!

» దారుణంగా దిగజారిన ఇరాన్ కరెన్సీ విలువ

» ఆర్థిక మంత్రిని తొలగించిన పార్లమెంటు

టెహ్రాన్, మార్చి 2: ఇరాన్ కరెన్సీ అయిన 'రియాల్' విలువ దారుణంగా పడిపోవడంతో, ఇందుకు బాధ్యుడిని చేస్తూ దేశ ఆర్థిక మంత్రిని పార్లమెంటు తొలగించింది. ఆర్థిక మంత్రి అబ్దోల్ నస్సెర్ హెమ్మతిని అభిశంసిస్తూ ఆదివారం తీర్మానం చేసింది. ఒక అమెరికా డాలరు పొందడానికి 9,30,000 రియాల్స్ చెల్లించాల్సి వచ్చేలా కరెన్సీ విలువ పతనమయింది. 2015లో డాలరుతో మారకం విలువ 32,000 రియాల్స్‌గా ఉండేది. గత ఏడాది జులైలో అధ్యక్షుడిగా మసౌద్ పెజెష్కియాన్ బాధ్యతలు చేపట్టేనాటికి దాని విలువ 5,84,000 రియాల్స్‌కు పడిపోయింది. గత ఆరు నెలలుగా ఆర్థిక వ్యవహారాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రియాల్ విలువ దారుణంగా దిగజారింది. ఇప్పుడు ఒక్క డాలరు కోసం దాదాపు 10 లక్షల రియాల్స్ చెల్లించాల్సిన పరిస్థితి రావడంతో పార్లమెంటు ఆర్థిక మంత్రిపై చర్యలు తీసుకొంది. 2015లో అణు ఒప్పందం నుంచి అమెరికా తప్పుకోవడం, పశ్చిమ దేశాలు ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించడంతో పరిస్థితులు ఘోరంగా మారాయి. ఆంక్షల యుద్ధంలో చిక్కుకున్నామని, అందరూ సహకరించాలని అధ్యక్షుడు పెజెష్కియన్ కోరినప్పటికీ పార్లమెంటు మాత్రం ఆర్థిక మంత్రిని తొలగించింది. కాగా, ప్రపంచంలో అతి తక్కువ విలువ ఉన్న కరెన్సీల్లో ఇరాన్ రియాల్ మూడో స్థానంలో ఉందని అమెరికాలోని జాన్ హాప్కిన్స్ వర్సిటీ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ స్టీవ్ హంకే తెలిపారు.


అక్రమ వలసలకు కళ్లెం వేశా: డొనాల్డ్ ట్రంప్



» ఇంగ్లిష్‌ను అధికార భాషగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, మార్చి 2: రెండోసారి తాను అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత.. దేశంలోకి వచ్చే అక్రమ వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించానని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'అధ్యక్ష పదవిలో.. గడిచిన ఫిబ్రవరితో ఒక పూర్తి నెల పూర్తయ్యింది. ఆ నెలలో అమెరికా-మెక్సికో సరిహద్దు వద్ద 8,326 మంది మాత్రమే అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించటానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. ఇది దేశ చరిత్రలోనే అతి తక్కువ. వారందరినీ మన దేశం నుంచి బయటకు పంపించాం. అవసరమైతే కొందరి మీద క్రిమినల్ కేసులు కూడా పెట్టాం' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇంగ్లిష్‌ను అమెరికా అధికార భాషగా ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఆదేశాల మీద సంతకం చేశారు. దీనిపై నిరసన వ్యక్తమవుతోంది. 'యునైటెడ్ లాటిన్ అమెరికన్ సిటిజన్స్ లీగ్' అనే సంస్థ.. అమెరికా వ్యవస్థాపకులు రాజ్యాంగంలో ఏ ఒక్క భాషకూ పట్టం కట్టకుండా, భావప్రకటన స్వేచ్ఛకు తొట్టతొలి ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేసింది. ఆలోచనలు, సంస్కృతి, వ్యక్తీకరణల్లో వైవిధ్యం వర్ధిల్లితేనే దేశం సుదృఢంగా ఉంటుందని వారు భావించారని, ఇంగ్లిష్‌ను అధికారభాషగా ప్రకటించటం ఆ ఆశయాలకు గొడ్డలిపెట్టని పేర్కొంది.

లోకం తీరు



చదువు.. అర్థమయ్యే భాషలో ఉండట్లేదు

» ప్రపంచ జనాభాలో 40% మంది పరిస్థితి ఇదే: యునెస్కో

న్యూఢిల్లీ, మార్చి 2: ప్రపంచ జనాభాలో 40శాతం మందికి వారు మాట్లాడే లేదా అర్థం చేసుకొనే భాషలో విద్య అందుబాటులో లేదని యునెస్కోకు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (జీఈఎం) బృందం తెలిపింది. కొన్ని అల్పాదాయ, మధ్య ఆదాయ దేశాల్లో వీరి సంఖ్య 90శాతం వరకూ ఉందని పేర్కొంది. స్థానిక భాష ప్రాధాన్యంపై పలు దేశాల్లో అవగాహన పెరుగుతున్నప్పటికీ ఉపాధ్యాయుల సామర్థ్యం పరిమితంగా ఉండటం, తగినంత మెటీరియల్ అందుబాటులో లేకపోవడం, సమాజంలో వ్యతిరేకత తదితర సవాళ్లతో విధానపరమైన అమలు పరిమితంగానే ఉందని వెల్లడించింది. దీనివల్ల 25కోట్ల మందికిపైగా విద్యార్థులు ప్రభావితమయ్యారని వివరించింది. అందువల్ల విద్యార్థులందరికీ ప్రయోజనం చేకూరే విధంగా అన్ని దేశాల్లోనూ బహు భాషా విధానాలను అమలు చేయాలని సిఫారసు చేసింది. బహు భాషా విధానాన్ని సమర్థించే నూతన విద్యా విధానాన్ని(ఎన్ఈపీ) భారత్‌లో అమలు చేస్తున్న సమయంలో ఈ నివేదిక వెలువడింది.

ప్రభుత్వాన్ని అడుక్కోవడం ప్రజలకు అలవాటైంది

» మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వ్యాఖ్య

రాజ్‌గఢ్, మార్చి 2: ప్రభుత్వాన్ని అడుక్కోవడం ప్రజలకు అలవాటుగా మారిందని మధ్యప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ అన్నారు. ప్రజాప్రతినిధులు ఎవరైనా ప్రజల్లోకి వస్తే.. మొదట దండ వేస్తారని, ఆ తర్వాత వెంటనే వినతి పత్రాన్ని ఇచ్చి తమకు కావాల్సిన వాటిని ఏకరువు పెడతారని చెప్పారు. ఈ తరహా మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్‌గఢ్ జిల్లాలో రాణి అవంతీబాయి విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. "ముష్టివాళ్ల సైన్యం సమాజానికి బలం కాదు.. బలహీనత. ప్రజలు ఎప్పుడూ తీసుకోవడం గురించే కాకుండా ఇవ్వడం గురించి కూడా ఆలోచించాలి. దేశం కోసం ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. వాళ్లను స్ఫూర్తిగా తీసుకుంటే మన జీవితాలు విజయవంతం అవుతాయి. సమాజానికి ఏదైనా చేయాలన్న ఆలోచన పుడుతుంది" అని ప్రహ్లాద్‌సింగ్ అన్నారు.

బస్తర్‌లో ఇంకా 400మంది నక్సలైట్లు: బస్తర్ ఐజీ

న్యూఢిల్లీ, మార్చి 2: 2024 జనవరి నుంచి 310 మంది మావోయిస్టులను విజయవంతంగా అంతమొందించామని, బస్తర్ డివిజన్‌లో ఇక సుమారు 400 మంది సాయుధ క్యాడర్ మాత్రమే మిగిలి ఉన్నారని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ చెప్పారు. వీరికి మద్దతుగా మిలీషియా సభ్యులతోపాటు చేతన నాట్య మంచ్, దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్(డీఏకేఎంఎస్) వంటి సాంస్కృతిక సంస్థల సభ్యులు 700 నుంచి 800 మంది ఉన్నారని తెలిపారు. హింసను వీడి లొంగిపోవాలా? లేక తుది పోరులో భద్రతా దళాలతో తలపడాలా? అనేది ఈ 1200 మంది నిర్ణయించుకోవాలని తేల్చిచెప్పారు. మావోయిస్టు కేంద్ర కమిటీ కూడా గణనీయంగా బలహీనపడిందని, కమాండర్లు 12 నుంచి 14 మంది మాత్రమే మిగిలి ఉన్నారని చెప్పారు. కాగా, మార్చి-2026 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని అంతమొందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన సంగతి తెలిసిందే.

బీఎస్పీ నుంచి మాయావతి మేనల్లుడు ఔట్

లఖ్‌నవూ, మార్చి 2: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి సంచలన ప్రకటన చేశారు. "తాను బతికున్నంత కాలం వారసులను ప్రకటించబోనని" ఆమె వెల్లడించారు. గతంలో తన రాజకీయ వారసుడిగా ప్రకటించిన మేనల్లుడు ఆకాశ్‌ను పార్టీలో అన్ని బాధ్యతల నుంచి తొలగించారు. అలాగే తన సోదరులు ఆనంద్ కుమార్, రామ్‌జీ గౌతమ్‌లను పార్టీ జాతీయ సమన్వయకర్తలుగా ఆమె నియమించారు. తాజాగా లఖ్‌నవూలో జరిగిన పార్టీ ఉన్నతస్థాయి సమావేశంలో మాయావతి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా ఆకాశ్ మామయ్య అశోక్ సిద్ధార్‌ను పార్టీ నుంచి బహిష్కరించానని ఆమె చెప్పారు. ఆయన ఆకాశ్‌ను కూడా ప్రభావితం చేస్తున్నారని, అందుకే ఆకాశ్‌ను అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

సినిమా వాళ్లు తిట్టినా పర్లేదు.. నిజమే చెప్పా: డీకే

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చలన చిత్రోత్సవం వేళ తాను చేసిన వ్యాఖ్యలను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమర్థించుకున్నారు. ఉడుపిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమా రంగానికి చెందినవారు ఏమైనా దూషించనీ... తాను మాత్రం వాస్తవాలే మాట్లాడానన్నారు. రెండ్రోజుల క్రితం అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో డీకే శివకుమార్ మాట్లాడుతూ.. 'నమ్మ నీరు-నమ్మ హక్కు పోరాటానికి సినిమావాళ్లెవ్వరూ రాలేదు. నీరు, నేల విషయంలో పార్టీలకు అతీతంగా పోరాటం చేశాం. మేకెదాటు యాత్ర చేసినపుడు సినిమా వాళ్లు ఎందుకు రాలేదు. సినిమా రంగానికి చెందిన వారికి నట్టు బోల్టు టైట్ చేయాల్సి ఉంది' అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై డీకే స్పందిస్తూ.. బీజేపీకి ప్రతీదాన్ని వివాదం చేయడమే పని అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీరంగం బాగు కోసమే చిత్రోత్సవం నిర్వహించామన్నారు.

టూత్‌పేస్ట్‌తో హానికర బ్యాక్టీరియాకు చెక్..!

న్యూఢిల్లీ, మార్చి 2: తాజా శ్వాస కోసం, నోటిలోని చెడు బ్యాక్టీరియాను వదిలించుకోవడం కోసం మనం రోజూ టూత్‌పేస్ట్‌తో పళ్లు తోముకుంటాం. అయితే టూత్‌పేస్ట్ మన నోటిలో ఉన్న హానికర బ్యాక్టీరియాను పూర్తిగా చంపుతుందా..? దాంతోపాటు మంచి బ్యాక్టీరియాను కూడా నాశనం చేస్తుందా.. అంటే.. టూత్‌పేస్ట్ ప్రధాన పని బ్యాక్టీరియాను పూర్తిగా చంపడం కాదని పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవల చేసిన పరిశోధనల్లో నోటిలోని మంచి బ్యాక్టీరియా హానికరమైన బ్యాక్టీరియాను నియంత్రించడంలో సహాయపడుతుందని, జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని, అలాగే మన చిగుళ్లను సంరక్షిస్తుందని గుర్తించామని చెప్పారు. బ్యాక్టీరియల్ బయోఫిల్మ్‌లను విచ్ఛిన్నం చేయడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడడంలో టూత్‌పేస్ట్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

ఉమ్మడిగా ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. అందుకే.. ఉక్రెయిన్‌కు తాము చేసే ఆర్థిక సాయంలో 2 బిలియన్ డాలర్లతో (దాదాపు రూ.17,500 కోట్లు) 5000 ఎయిర్ డిఫెన్స్ మిసైళ్ల కొనుగోళ్లకు వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ విషయంలో యూరప్ ఇతోధికంగా కష్టపడాలని.. ఖండంలో శాంతి సాధనకు కృషి చేయాలని, ఈ శ్రమ ఫలించాలంటే అమెరికా అండ అవసరమని పేర్కొన్నారు. ఇటీవల శ్వేతసౌధంలో ట్రంప్-జెలెన్‌స్కీ మధ్య జరిగిన వాగ్వాదం గురించి ప్రస్తావించిన ఆయన.. చర్చలు ఆ విధంగా చెడిపోవాలని ఎవ్వరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ఆ ఘటన నేపథ్యంలో.. ఆదివారం ఇక్కడ లండన్‌లోని 200 ఏళ్ల పురాతన లాంకస్టర్ హౌస్‌లో యూరప్ దేశాల అధినేతలు స్టార్మర్ నేతృత్వంలో సమావేశమై చర్చించారు. వారితోపాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని ట్రూడో, టర్కీ విదేశాంగ మంత్రి, నాటో చీఫ్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌కు అమెరికా అండ లేదన్న కఠోర వాస్తవాన్ని అంగీకరించాల్సిందేనని.. ఎప్పుడో తరానికి ఒకసారి వచ్చే ఇలాంటి సందర్భాలను ప్రపంచ దేశాల నాయకులంతా కలిసి ఎదుర్కోవాలని ఈ భేటీ సందర్భంగా వ్యాఖ్యానించిన స్టార్మర్.. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాత్రం అమెరికాను తమకు అత్యంత ముఖ్యమైన మిత్రుడుగా పేర్కొనడం గమనార్హం. "అమెరికా యూకేకు ఎన్నో ఎన్నో దశాబ్దాలుగా మిత్ర దేశం. ఇకపైనా అలాగే కొనసాగుతుంది. మా రెండు దేశాలు ఉన్నంత సన్నిహితంగా మరే ఇతర దేశాలూ లేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు.. తాను ఉక్రెయిన్‌లో శాంతి దిశగా రచిస్తున్న ప్రణాళికల్లో అమెరికా అండ కూడా ముఖ్యమేనని ప్రకటించారు. అలాగే.. యుద్ధం ముగించడానికి చేసుకునే ఒప్పందంలో రష్యా కూడా భాగం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకుముందు.. 'సెక్యూరింగ్ అవర్ ఫ్యూచర్' పేరిట నిర్వహించిన సమావేశంలో స్టార్మర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉక్రెయిన్ విషయంలో సానుకూల ఫలితాన్ని రాబట్టడం ఇక్కడున్న ప్రతిదేశానికి, ఇతరులకు సైతం ముఖ్యమైన విషయమే" అని ఆయన స్పష్టం చేశారు. "యూరోపియన్ భద్రతను రక్షించుకునేందుకు, మనందరి సమష్టి భవిష్యత్తునూ కాపాడుకునేందుకు.. అందరం కలిసి దీన్ని ఎదుర్కోవాలి" అని పిలుపునిచ్చారు.



యూరోపియన్ యూనియన్ దేశాధినేతలతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

అమెరికాతో సంబంధం లేకుండా

తాజా పరిస్థితుల నేపథ్యంలో యూరప్ దేశాలు ఆయుధపరంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఈ భేటీలో అభిప్రాయపడ్డారు. 2022 నుంచి రష్యా ఆక్రమించుకున్న ఏ భూభాగాన్నీ రష్యాలో భాగంగా యూరోపియన్ యూనియన్ అంగీకరించకూడదని పేర్కొన్నారు. అమెరికాపై ఎంతమాత్రం ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్ పూర్తిస్థాయిలో ఒక ఆర్మీని ఏర్పరచుకోవాలనే ప్రతిపాదనను ఉర్సులా చాలాకాలంగా చేస్తున్నారు. ఇక.. ఈ సమావేశం అనంతరం జెలెన్‌స్కీ కింగ్ చార్లె్స్‌తో భేటీ అయ్యారు.

ఉక్రెయిన్‌కు యూకే రూ.24,855 కోట్ల రుణం

లండన్, మార్చి 2: యుద్ధం దెబ్బకు అసలే అతలాకుతలమైన ఉక్రెయిన్‌కు సాయం చేయడానికి అమెరికా ససేమిరా అంటున్నా.. యూరప్ దేశాలు అండగా నిలుస్తున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌కు 2.26 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.24,855 కోట్లు) రుణం ఇవ్వడానికి యూకే సిద్ధమైంది. ఈమేరకు రుణ ఒప్పందంపై ఇరు దేశాల ఆర్థిక మంత్రులూ సంతకాలు చేశారు. ఈ రుణానికి సంబంధించి తొలి విడత నిధులు ఉక్రెయిన్‌కు వచ్చేవారం అందుతాయి. ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇస్తామని జీ7 దేశాలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో ఇది బ్రిటన్ వాటా. తమదేశంలో స్తంభింపజేసిన రష్యా ఆస్తుల నుంచి యూకే ఈ మొత్తాన్ని ఇస్తోంది. ఆ డబ్బును ఆయుధాల తయారీకి వినియోగించనున్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. కాగా.. అమెరికాలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల తీరుతో తీవ్ర అవమాన భారాన్ని ఎదుర్కొన్న జెలెన్‌స్కీకి.. యూకేలో అందుకు భిన్నంగా సాదర స్వాగతం లభించింది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ లండన్‌లోని 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ఉన్న తన నివాసం వద్దకు చేరుకున్న జెలెన్‌స్కీని ఆత్మీయ ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. "ఎంతకాలమైనా సరే మేం మీకు మద్దతుగా నిలుస్తాం" అని హామీ ఇచ్చారు. దీనికి జెలెన్‌స్కీ ఎంతగానో హర్షం వ్యక్తం చేశారు. "మీలాంటి స్నేహితులున్నందుకు ఉక్రెయిన్ సంతోషంగా ఉంది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ మాకు అండగా నిలిచిన యూకే ప్రజలకు నా కృతజ్ఞతలు." అని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆహ్వానం.. విద్యార్థులకు తిరస్కారం

మారిన కెనడా వలస విధానం

న్యూఢిల్లీ, మార్చి 2: కెనడాలో ఉద్యోగం, నివాసం కోరుకుంటున్న భారతీయ ఉపాధ్యాయులకు శుభవార్త. ఐఆర్‌సీసీ(కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వం)లో తాజాగా మార్పులు అలాంటివారికి శాశ్వత నివాసం కల్పించనున్నాయి. విద్యా వ్యవస్థలో ఖాళీల భర్తీ కోసం మరింత మంది టీచర్లు, సహాయక సిబ్బందిని దేశంలోకి రప్పించాలని కెనడా భావిస్తోంది. నిపుణులను దేశంలోకి ఆహ్వానించే ప్రాధాన్యతా వృత్తుల జాబితాను గత గురువారం నవీకరించింది. ఇందులో కొత్తగా టీచర్లు, సహాయక సిబ్బంది, వంటవారిని చేర్చింది. రవాణా రంగాన్ని మొత్తంగా, స్టెమ్ సంబంధిత పలు ఉద్యోగాలను జాబితా నుంచి తొలగించింది. కెనడా విద్యారంగంలో ప్రీ ప్రైమరీ, ప్రాథమిక, సెకండరీ టీచర్లు, సహాయకులు, చిన్నారులకు బోధించేవారు, ప్రత్యేక అవసరాలు గలవారి ఇన్‌స్ట్రక్టర్లను చేర్చారు. అలాగే, మరిన్ని సామాజిక సేవలు, వివిధ టెక్నాలజిస్టులు, టెక్నీషియన్ ఉద్యోగాలతో ఆరోగ్య రంగాన్ని విస్తరించారు. స్టెమ్ కేటగిరీ నుంచి ఆర్కిటెక్ట్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్ట్‌లు, కంప్యూటర్ సిస్టమ్స్ మేనేజర్లు తదితరులను తొలగించి బీమా ఏజెంట్లు, బ్రోకర్లను చేర్చారు. వాణిజ్య కేటగిరిలో వంటవారిని చేర్చారు. రవాణా రంగాన్ని ప్రాధాన్యతా ఎంపికల నుంచి తొలగించారు. అంటే ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టం కింద ఇకపై ట్రక్ డ్రైవర్లు, భారీ పరికరాల ఆపరేటర్లు, విమానయాన పైలట్లను తీసుకోబోరు. మరోవైపు, కెనడాలో ఉన్న 4.23 లక్షల మంది భారతీయుల్లో ఇప్పటికే వేలాదిమంది ముఖ్యంగా విద్యార్థులు నూతన నిబంధనల పట్ల గందరగోళానికి గురవుతున్నారు. డాక్యుమెంటేషన్‌లో స్వల్ప లోపాలతో విద్యాభ్యాసం మధ్యలోనే అనేకమంది విద్యార్థుల స్టడీ పర్మిట్లు రద్దవుతున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కన్సల్టెన్సీలు చెబుతున్నాయి.

సెబీ మాజీ చీఫ్ మాధవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఏసీబీకి ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశం

ముంబై, మార్చి 2: పదవీ విరమణ పొందిన రోజు నుంచే సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌కు కొత్త కష్టాలు మొదలయ్యాయి. స్టాక్ మార్కెట్ కుంభకోణానికి సంబంధించిన ఒక కేసులో ఆమెతోపాటు ప్రస్తుతం సెబీ డైరెక్టర్లుగా ఉన్న అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్షణిలపైనా ఎఫ్ఐర్‌లు నమోదు చేయాలని ముంబై వర్లీ ప్రాంతంలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు.. ఏసీబీని ఆదేశించింది. వీరితో పాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి, మాజీ ఛైర్మన్, పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్‌పైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించింది. న్యాయమూర్తి శశికాంత్ ఏకనాథ్ రావు బంగర్ శనివారం ఈ ఆదేశాలు జారీ చేశారు. తమ పర్యవేక్షణలో జరిగే ఈ కేసు దర్యాప్తును నెల రోజుల్లో స్థాయి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు. సపన్ శ్రీవాస్తవ అనే జర్నలిస్టు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 1994లో ఒక కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా తన షేర్లను లిస్ట్ చేసి, ఆ తర్వాత పెద్దఎత్తున అక్రమంగా తన షేర్ల ధర పెంచుకుని మదుపరుల నెత్తిన టోపీ పెట్టిందని ఆయన ఆరోపించారు. దీనిపై సెబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. 'ఈ కేసులో నిందితులు నిబంధనలు తుంగలో తొక్కి కుమ్మక్కయ్యారు. అందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి' అన్న జడ్జి.. ఎఫ్ఐఆర్‌ల నమోదుకు ఆదేశించారు.

స్నానానికి పనికిరాని గంగ నీరు!

» బిహార్‌లో అనేక చోట్ల కలుషితం

» రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

పాట్నా, మార్చి 2: కాలుష్యం కారణంగా బిహార్‌లోని అనేక చోట్ల గంగా నది నీరు స్నానానికి పనికి రాదని రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2024-25 వెల్లడించింది. నీటిలో అధిక స్థాయిలో బ్యాక్టీరియాలు (టోటల్ కోలిఫాం, ఫీకల్ కోలిఫాం) ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు బిహార్ కాలుష్య నియంత్రణ మండలి(బీఎస్‌పీసీబీ) రాష్ట్రంలోని 34 చోట్ల పక్షం రోజులకోసారి చేసిన గంగా నది నీటి నాణ్యత పరిశీలనలో వెల్లడైందని అధికారులు తెలిపారు. గంగా నది, దాని ఉపనదుల ఒడ్డున ఉండే పట్టణాల నుంచి మురుగునీరు, ఇళ్ల నుంచి వచ్చి కలిసే వ్యర్థ నీటి కారణంగా బ్యాక్టీరియా అధిక మొత్తంలో చేరిందని సర్వే పేర్కొంది. ఇదే సమయంలో గంగా, దాని ఉపనదుల్లో పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్, బయో-కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ) వంటి ఇతర పారామితులు పరిమితి స్థాయిలో ఉన్నాయని, ఈ నీరు జల జీవరాశులకు, చేపల పెంపకానికి, వ్యవసాయానికి సరిపోతుందని తెలిపింది. బీఎస్‌పీసీబీ ఛైర్మన్ శుక్లా మాట్లాడుతూ.. మలంలో ఈ ఫీకల్ కోలిఫాం బ్యాక్టీరియా ఉంటుందని చెప్పారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా గంగా నదిలో చాలా చోట్ల ఫీకల్ కోలిఫాం పరివిుతి మించిపోయిందని, దీంతో ఆ నీరు స్నానానికి పనికిరాదని పేర్కొన్నారు. నదిలోకి వచ్చే నీటి శుద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డూప్లికేట్ ఎపిక్ నంబర్లు ఉంటే.. నకిలీ ఓటర్లు ఉన్నట్లు కాదు!

» వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే విధమైన సంఖ్యలు కొన్ని ఉండొచ్చు.. మమత ఆరోపణలపై ఈసీ

» ఇకపై యూనిక్ నంబర్లు ఇస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగాల్ ఓటర్ల జాబితాల్లో హరియాణా, గుజరాత్‌లకు చెందిన నకిలీ ఓటర్లను బీజేపీ చేర్చుతోందని.. ఇందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) సహకరిస్తోందని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఓటరు కార్డు(ఎపిక్) నంబర్లు ఒకేలా ఉన్నంత మాత్రాన నకిలీ లేదా డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు కాదని ఆదివారం స్పష్టం చేసింది. మమత పేరు ప్రస్తావించకుండా.. రెండు రాష్ట్రాల ఓటర్లకు ఒకేరకమైన ఎపిక్ నంబర్లు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టులను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. కొందరు ఓటర్ల ఎపిక్ నంబర్లు ఒకే విధంగా ఉన్నా.. రాష్ట్రాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటాయి. ఎపిక్ నంబర్‌తో సంబంధం లేకుండా.. తమ సొంత రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలోని నియోజకవర్గంలో, పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదుచేసుకున్న ఏ ఓటరైనా ఓటేయవచ్చు' అని తేల్చిచెప్పింది. ఈసీకి సంబంధించిన ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ (ఎరోనెట్) ప్లాట్‌ఫాంకు ఓటర్ల సమాచారం పంపే ముందు రెండు విభిన్న రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు ఒకేవిధమైన అల్ఫాన్యూమరిక్ సిరీస్‌ను ఉపయోగించడం వల్ల తాజా సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ ఓటర్లందరికీ ఇకపై యూనిక్ ఎపిక్ నంబర్లు కేటాయించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సహకరించేందుకు ఎరోనెట్ 2.0 ప్లాట్‌ఫాంను ఆధునికీకరిస్తామని తెలిపింది. మమత ఆరోపణలను బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కూడా తోసిపుచ్చారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల జాబితాల నవీకరణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), రిటర్నింగ్ అధికారులు(ఈఆర్‌వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఈఆర్‌వోలు), జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవోలు), రాష్ట్రాల సీఈవోలు పాలుపంచుకుంటారని.. రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీల పాత్ర పోషిస్తారని ఆదివారం ఓ ప్రకటనలో గుర్తుచేశారు. ఓటర్ల నమోదు, జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే వీరి ముందు ఉంచాలని.. వాటిపై తక్షణమే దృష్టి సారిస్తున్నామని.. దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక.. అక్కడ 5 నెలల వ్యవధిలోనే 48 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోందని.. కానీ ఈ వ్యవహారంలో సీఈవో కార్యాలయానికి ఒక్క ఫిర్యాదు మాత్రమే చేసిందని ఈసీ వర్గాలు తెలిపాయి.



మమత అబద్ధం బట్టబయలు: బీజేపీ

మమత చెప్పిన మరో అబద్ధం బట్టబయలైందని బీజేపీ ఐటీ ఇన్‌చార్జి, బెంగాల్ బీజేపీ సహ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తేలిపోవడంతో ఆమె దుష్ప్రచారానికి ఒడిగట్టారని, ఎన్నికల వ్యవస్థపై ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. బెంగాల్లో ఓటర్ల ప్రక్షాళన జరపాలని ఈసీని కోరారు. అక్రమ బంగ్లాదేశీయులను, రోహింగ్యాలను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

చందమామపై 'బ్లూ ఘోస్ట్'

» చంద్రుడిపై దిగిన రెండో ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర


» జనవరి 15న ప్రయోగించిన అమెరికన్ ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'



న్యూయార్క్, మార్చి 2: చందమామపై దాదాపు ఏడాది వ్యవధిలోనే రెండో ప్రైవేటు ల్యాండర్ దిగింది! అమెరికాకు చెందిన ఫైర్ ఫ్లై ఏరోస్పేస్ అనే ప్రైవేటు అంతరిక్ష సంస్థకు చెందిన 'బ్లూ ఘోస్ట్' ల్యాండర్.. నాసాకు చెందిన 10 శాస్త్ర, సాంకేతిక పరికరాలతో ఆదివారం విజయవంతంగా ల్యాండయింది. దాదాపు 6.6 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పున ఉండే ఈ ల్యాండర్‌ను జనవరి 15న కేప్‌కెనవరాల్ (ఫ్లోరిడా)లోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించారు. చందమామపై నిర్దేశిత ల్యాండింగ్ సైట్‌కు 328 అడుగుల పరిధిలోనే ఇది ల్యాండ్ అయినట్టు ఫైర్‌ఫ్లై సంస్థ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. చంద్రుడిపై దిగిన అరగంట తర్వాత.. బ్లూ ఘోస్ట్ అక్కడి చిత్రాలు తీసి భూమికి పంపడం ప్రారంభించింది. బ్లూఘోస్ట్ ద్వారా చంద్రుడిపైకి 10 పరికరాలను పంపడానికి నాసా 101 మిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.883.45 కోట్లు).. ఆ పరికరాల తయారీకి 44 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.385 కోట్లు) ఖర్చు చేసింది. ఆ పరికరాలతో చందమామపై బ్లూ ఘోస్ట్ రెండువారాల పాటు (చంద్రుడిపై 15 రోజులు పగలు ఉంటుంది) పరిశోధనలు చేయనుంది. కాగా.. అమెరికాకే చెందిన 'ఇంట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ ప్రయోగించిన మరో ల్యాండర్ 'ఏథెనా'.. నిర్దేశిత షెడ్యూలు ప్రకారం గురువారం చంద్రుడిపై ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, అది చంద్రుడి దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల పరిధిలో ల్యాండ్ కానుంది. ఆ సంస్థ గత ఏడాది ఫిబ్రవరి 22న.. 'ఒడిసస్' అనే ల్యాండర్‌ను చందమామపై దించి, ఆ ఘనత సాధించిన తొలి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థగా చరిత్ర సృష్టించింది. అయితే, ల్యాండింగ్ సమయంలో ఒడిసస్ రేంజింగ్ లేజర్ల పనితీరు దెబ్బతిని, దాని కాళ్లలో ఒకటి విరిగి, సమతౌల్యం తప్పి కిందపడిపోయింది. అయినప్పటికీ బలహీనంగానైనా సంకేతాలను భూమికి పంపింది. దాంతో పోలిస్తే బ్లూఘోస్ట్ ఎలాంటి సమస్యలూ లేకుండా చక్కగా ల్యాండయింది. అందుకే.. సాంకేతికంగా దీన్నే చంద్రుడిపై సజావుగా ల్యాండయిన తొలి ప్రైవేటు ల్యాండర్‌గా భావించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక, ఈ రెండు ల్యాండర్లతోపాటు.. జపాన్‌కు చెందిన 'ఐస్పేస్' అనే కంపెనీ బ్లూఘోస్ట్‌తోపాటు కేప్ కెనవరాల్ నుంచి జనవరి 15న ఒక ల్యాండర్‌ను ప్రయోగించింది. అది కొంచెం సుదీర్ఘకాలంపాటు ప్రయాణించి మరో మూడు నెలల తర్వాత చందమామపై దిగనుంది. 2023లో ఆ సంస్థ చంద్రుడిపైకి పంపిన తొలి ల్యాండర్ క్రాష్ అయింది. ఇది ఆ సంస్థ ప్రయోగించిన రెండో ల్యాండర్.

కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు వేధింపులు

స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన మంత్రి



రక్షా ఖడ్సే

ముంబై, మార్చి 2: కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెను పోకిరీలు వేధించారు. దీనిపై రక్షా ఖడ్సే స్వయంగా ముక్తాయ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేంద్ర మంత్రినైన తన కుమార్తెకే రక్షణ లేకపోతే సామాన్యులకు ఎలా అని ఆమె వాపోయారు. మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లాలోని ముక్తాయ్‌నగర్‌లో గత నెల 28న మహాశివరాత్రి సందర్భంగా సంత్‌ముక్తాయ్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొంటానని కుమార్తె కోరడంతో గుజరాత్ పర్యటనలో ఉన్న తాను సెక్యూరిటీనిచ్చి పంపినట్లు రక్షా ఖడ్సే తెలిపారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా ఆకతాయిలు లెక్కచేయలేదు. రక్షా ఖడ్సే కుమార్తెను, ఆమె స్నేహితులను ఏడుగురు పోకిరీలు వెంబడించి వేధించారు. అనుచితంగా ప్రవర్తిస్తూ ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ యువకులే గత నెల 24న కూడా తనను వేధించారని కుమార్తె చెప్పడంతో కేంద్ర మంత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు 2 గంటలపాటు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టిన పోలీసులు.. అమ్మాయిల విషయం కావడంతో కేసు పెట్టే విషయంలో పునరాలోచించుకోవాలని సూచించినట్లు రక్షా ఖడ్సే మామ ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు. నిందితులపై గతంలోనూ అనేక ఫిర్యాదులు వచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎట్టకేలకు పోలీసులు నిందితులపై పోక్సో, ఐటీ చట్టాల కింద కేసు నమోదు చేసి సోహమ్ అనే ఆకతాయిని అరెస్ట్ చేశారు.

బెజవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం

- ఇక విజయవాడ వేదికగా కూడా సేవా కార్యక్రమాల నిర్వహణ
- 6న శంకుస్థాపన చేయనున్న భువనేశ్వరి



భవనం నమూనా

విజయవాడ, మార్చి 2, (ఆంధ్రజ్యోతి): బెజవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ ఏర్పాటు కానుంది. 16వ జాతీయ రహదారి వెంబడి ఎల్‌ఈపీఎల్ మాల్ పక్కన, సాయిబాబా టెంపుల్ రోడ్డు జంక్షన్‌లో జీప్లస్5 విధానంలో అధునాతనంగా ఈ భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభంకానున్నాయి. దాదాపు 600 గజాల స్థలాన్ని కొద్దికాలం కిందట ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కొనుగోలు చేసింది. ఇప్పటికే హైదరాబాద్ నుంచి ట్రస్టు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇకపై, ఆంధ్రప్రదేశ్‌లో కూడా సేవా కార్యక్రమాలను చేపట్టడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భవనం పూర్తయితే ట్రస్ట్ కార్యకలాపాలన్నీ ఇక్కడి నుంచే జరుగుతాయి. ముఖ్యంగా విద్య, వైద్య సంబంధిత కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతాయి. హైదరాబాద్ మెమోరియల్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న కొంతమంది ఇక్కడికి బదిలీ కానున్నారు. అవసరాన్ని బట్టి స్థానికంగా కూడా నియమాకాలు ఉంటాయి. కాగా, భవన నిర్మాణానికి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 6న శంకుస్థాపన చేయనున్నారు.

నాలుగు నిమిషాల్లో ఏటీఎంలో రూ. 29 లక్షల చోరీ

- సీసీ కెమెరాలకు స్ప్రే కొట్టి దొంగతనం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఘటన

ఆదిభట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున ఓ ఏటీఎంను పగలగొట్టి రూ.29.60 లక్షలతో ఉడాయించారు దుండగులు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు కారులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. ముందుగా సీసీ కెమెరాలకు స్ప్రే కొట్టి ఎమర్జెన్సీ సైరన్ మోగకుండా సెన్సార్ వైర్లను కట్ చేశారు. తర్వాత కట్టర్, ఇనుపరాడ్ల సహాయంతో ఏటీఎంను పగులకొట్టి నాలుగు నిమిషాల్లోనే రూ.29.69 లక్షలు తీసుకొని పారిపోయారు. దొంగతనం జరిగిన విషయం హైదరాబాద్‌లోని ఐబీఐఎస్ స్విచ్ సెంటర్ నుంచి బ్యాంక్ మేనేజర్‌కు సమాచారం వెళ్లింది. దీంతో మేనేజర్ ఆదిభట్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి డీసీపీ సునితారెడ్డి చేరుకొని పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

కోర్సు తెలియని నర్సులు

సూది వేయలేరు.. కట్టు కట్టలేరు.. మిథ్యగా ప్రైవేటు నర్సింగ్ విద్య

- అధ్యాపకులుండరు, వసతులూ కరువే
- పరీక్షలు, ప్రాక్టికల్స్ తూతూ మంత్రం
- ప్రైవేటు నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే కొన్ని సంస్థలు



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి):అది ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఓ నర్సింగ్ కాలేజీ. ఆ కళాశాలలో విద్యార్థులు కేవలం అడ్మిషన్ల సమయంలోనే కనిపిస్తారు. మళ్లీ పరీక్షల నాటికి వచ్చి కాలేజీలో వాలిపోతారు. ఇలా పరీక్ష రాసి.. అలా వెళ్లిపోతారు. ఆ కాలేజీలో ఉన్న విద్యార్థులకు అర్హత లేని వారితోనే చదువులు చెప్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని మెహదీపట్నం పరిసర ప్రాంతంలో ఉండే ఓ నర్సింగ్ కాలేజీ తీరు మరీ దారుణం. అక్కడి పరిస్థితులు, వసూలు చేస్తున్న ఫీజులపై నర్సింగ్ విద్యార్థులంతా వెళ్లి గతేడాది డీఎంఈ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల ప్రాంగణ భవనంలో రెండు కాలేజీలు నడుస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం అక్కడ ఒకటే కాలేజీ ఉండాలి. మరో కాలేజీ ఆర్మూర్‌లో ఉండాలి. వైద్య ఆరోగ్యశాఖ వివరాల్లో రెండు కాలేజీలు వేర్వేరుగా ఉన్నట్లు చిరునామాలున్నాయి.

రాష్ట్రంలో ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో విద్య.. విఎథ్యగా మారింది. అక్కడ చదివితే కనీసం సూది వేయలేరు. బీపీ చూడలేరు. కట్టు కట్టలేరు. కాలేజీలో అధ్యాపకులుండరు. ఉన్నవాళ్లకు అర్హత ఉండదు. మౌలిక సదుపాయాలుండవు. ఈ కళాశాలలపై పర్యవేక్షణ ఉండదు. మరోవైపు రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ తనిఖీల పేరుతో కాసులు వేటలో మునిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి ఎంఎస్సీ నర్సింగ్ కాలేజీలు 21, నర్సింగ్ కాలేజీలు 87, నర్సింగ్ స్కూళ్లు 161, ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు 112 ఉన్నాయి. అన్ని రకాల కాలేజీలు కలిపి మొత్తం 391 ఉన్నాయి. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న కాలేజీలు మినహా మిగిలిన వాటిలో మెజారిటీ కళాశాలల్లో నాణ్యమైన విద్య లేదు. నర్సింగ్ విద్యలో ఎమ్మెస్సీ, బీఎస్సీ, ఆక్సిలరీ నర్స్ మిడ్‌వైఫరీ(ఏఎన్‌ఎమ్), జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎమ్) కోర్సులుంటాయి. బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సు. ఏఎన్‌ఎమ్ రెండేళ్లు, జీఎన్‌ఎమ్ మూడేళ్ల కోర్సులు. ఏఎన్‌ఎమ్ కోర్సులో చేరాలంటే పదో తరగతి పాస్ అవ్వాలి. జీఎన్‌ఎమ్‌కు ఇంటర్.. బీఎస్సీ నర్సింగ్‌కు నీట్ లేదా ఎంసెట్‌లో అర్హత సాధించాలి. మెజారిటీ నర్సింగ్ కాలేజీల్లో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) నిబంధనల మేరకు అధ్యాపకులు ఉండటం లేదు. ఐఎన్‌సీ మార్గదర్శకాల మేరకు ఏఎన్‌ఎమ్, జీఎన్‌ఎమ్ కాలేజీలకు అనుబంధ ఆస్పత్రులుండాలి. చాలా కాలేజీలకు అనుబంధ ఆస్పత్రులే లేవు. జీఎన్‌ఎమ్ కోర్సులకు 9-12 మంది ఫ్యాకల్టీ ఉండాలి. వారంతా బీఎస్సీ, ఎమ్మెస్సీ చేసినవారై ఉండాలి. ఇక బీఎస్సీ నర్సింగ్ కోర్సులకైతే ఎమ్మెస్సీ నర్సింగ్ చేసిన వారు అధ్యాపకులుగా ఉండాలి. కనీసం 12-15 మంది అవసరం. అలాగే 5-8 ఏళ్ల అనుభవం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఐఎన్‌సీ మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు నర్సింగ్ కాలేజీలు, నర్సింగ్ స్కూళ్లలో అధ్యాపకులుండటం లేదు. కొన్ని కాలేజీలైతే ఇద్దరు ముగ్గురితోనే నెట్టుకొస్తున్నాయి. ఇక మెజారిటీ బీఎస్సీ నర్సింగ్ కాలేజీల్లో ఎమ్మెస్సీ చేసిన ఫ్యాకల్టీ ఒకరిని పెట్టి.. బీఎస్సీ నర్సింగ్ చదివిన వాళ్లతో క్లాసులు చెప్పిస్తున్నారు.

విద్యార్థుల శ్రమ దోపిడీ

ప్రైవేటు నర్సింగ్ కాలేజీలు ప్రాక్టికల్స్ కోసం విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పంపాలి. అవి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులై ఉండాలి. అయితే కొన్ని కాలేజీలు ప్రైవేటు ఆస్పత్రులకు విద్యార్థులను పంపుతున్నాయి. ఆ ఆస్పత్రులతో యాజమాన్యాలు ముందుగానే మాట్లాడుకుంటాయి. ఒక్కో విద్యార్థికి నెలకు సగటున రూ.10-12 వేల వరకు ప్రైవేటు ఆస్పత్రులు వేతనాల రూపంలో ఇస్తాయి. అయితే ఆ మొత్తాన్ని ప్రైవేటు కాలేజీలు విద్యార్థులకు ఇవ్వకుండా దోచుకుంటున్నాయి. అలాగే స్కాలర్‌షిప్‌లు వచ్చాక విద్యార్థులకే ఇస్తామంటూ అడ్మిషన్ల సమయంలోనే మొత్తం ఫీజులు బలవంతంగా వసూలు చేస్తున్నాయి. కొన్ని కాలేజీలైతే కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పూర్తికాని సిలబస్.. పరీక్షలు తూతూమంత్రం

నర్సింగ్ విద్యలో 12 సబ్జెక్టులుంటే ప్రతీ ఆరు నెలలకు ఒక సెమిస్టర్ చొప్పున పరీక్షలు నిర్వహించాలి. కనీసం సిలబస్ కూడా పూర్తిచేయడం లేదని, విద్యార్థులు వాపోతున్నారు. కొంతమంది అడ్మిషన్ల సమయంలోనే కాలేజీలకు వస్తారని.. మళ్లీ పరీక్షల సమయంలోనే కనిపిస్తారని చెబుతున్నారు. యాజమాన్యాలతో మాట్లాడుకుని హాజరు శాతాన్ని మేనేజ్ చేస్తున్నారని అంటున్నారు. కాగా, ప్రాక్టికల్స్‌లో అందర్నీ పాస్ చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు పైసలిచ్చి తమ విద్యార్థులు చూసిరాసి పాసయ్యేలా ప్రైవేటు కాలేజీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

ధ్వజారోహణం, దేవతాహ్వానం

- గుట్ట బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ఆధ్యాత్మిక సంరంభం

యాదాద్రి, మార్చి2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి సన్నిధిలో ఆధ్యాత్మిక ఉత్సవ సంరంభం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ ఆగమశాస్త్రం ప్రకారం సంప్రదాయ రీతిలో నిర్వహించారు. తిరుకల్యాణ వేడుకలకు ముక్కోటి దేవతలను శ్రీమహావిష్ణువు వాహనమైన గరుత్మంతుడిని ఆవాహన చేసి, ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ముక్కోటి దేవతలను అర్చించి గరుత్మంతుడి చిత్రపటాన్ని శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించి ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేశారు. గరుత్మంతుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దలను నివేదించారు. ఇంద్ర, యమ, వరుణ, కుబేరాది గణాలను ఆవాహన చేసి గరుడ మూలమంత్ర పారాయణాలు చేస్తూ గరుడ ప్రసాదాన్ని పైకి విసిరే కార్యక్రమం శాస్త్రోక్తంగా సాగింది. అంతకు ముందు యాగశాలలో హవనం కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన లక్ష్మీనృసింహుడు

8,000 కోళ్లు మృతి

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం

పుల్‌కల్, కొల్చారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటమే ఇందుకు కారణం. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం సమీపంలోని ఓ పౌల్ట్రీఫాంలో మూడు రోజుల వ్యవధిలో ఏడు వేల కోళ్లు మరణించాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్‌లోని ఓ కోళ్ల ఫామ్‌లో శుక్ర, శనివారాల్లో కలిపి వెయ్యికి పైగా కోళ్లు వింత వ్యాధితో చనిపోయాయి. దీంతో బర్డ్‌ఫ్లూ వల్లే ఈ కోళ్లు చనిపోయాయనే చర్చ జరుగుతోంది. తన పౌల్ట్రీ ఫాంలో మూడు రోజుల వ్యవధిలో ఏడు వేల కోళ్లు మరణించడంతో బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాకు చెందిన జదావత్ ప్రవీణ్‌కు పశువైద్యాధికారులను సంప్రదించాడు. ఆ పౌల్ట్రీఫాంను ఆదివారం సందర్శించిన వైద్యాధికారి.. మృతి చెందిన కోళ్లను పరిశీలించి.. కొన్నింటిని పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అయితే, కోళ్ల మృతికి స్పష్టమైన కారణాన్ని వెల్లడించలేదు. కాగా, ఫిబ్రవరి 23న చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి శివారులోని ఓ పౌల్ట్రీఫాంలో 900 కోళ్లు వైరస్ బారినపడి మరణించడం గమనార్హం. ఇక, మెదక్ జిల్లా జలాల్పూర్‌లో సతీష్‌గౌడ్‌కు చెందిన ఫామ్‌లో రెండ్రోజుల వ్యవధిలో వెయ్యి కోళ్లు మరణించగా పశువైద్యాధికారులు సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించనున్నారు.


నెంబర్ ప్లేట్లు మారుస్తూ గంజాయి స్మగ్లింగ్

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద స్మగ్లర్ అరెస్టు
- రూ.51లక్షల విలువైన 102 కిలోల గంజాయి స్వాధీనం

చౌటుప్పల్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీ అనకాపల్లి నుంచి మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.51లక్షల విలువ గల 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర బీడ్ పట్టణానికి చెందిన నకుల్ కైలాష్ గైక్వాడ్ (36) ఐదు సంవత్సరాలుగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన సేతుతో కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. పోలీసుల తనిఖీలను తప్పించుకుని గంజాయిని గమ్యస్థానానికి చేర్చడంలో ఇతడు దిట్ట. ఈ క్రమంలో ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి సరఫరాదారుడు వీరబాబు వద్ద గత నెల 28న 102 కిలోల గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు బయలుదేరాడు. పోలీసులకు అనుమానం రాకుండా ఏ రాష్ట్రం గుండా కారు వెళ్తుందో ఆ రాష్ట్ర నెంబర్ ప్లేటును మార్చాడు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు ఆదివారం పంతంగి టోల్‌ప్లాజా వద్ద కారును తనిఖీ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 102 కిలోల గంజాయిని, కారు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.2వేల నగదును, నకిలీ నెంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకుని.. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇతని వ్యాపార భాగస్వాములైన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తెలుగుజాతి కీర్తిని చాటేందుకు కమ్మ జాతి కృషి చేయాలి: మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పేందుకు కమ్మ జాతి కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం స్వర్ణభారతి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఖమ్మం కమ్మ మహాజన సంఘం పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. పిల్లల చదువుల అవసరాలకు హాస్టల్ అందుబాటులో ఉండాలనే సంకల్పంతో పూర్వీకులు తొలి కమ్మ హాస్టల్ ఖమ్మంలో ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, భారతీయం వ్యవస్థాపకురాలు గొట్టిపాటి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



బుద్వేల్ లేఅవుట్‌కు డబుల్‌డెక్కర్ ఫ్లైఓవర్ నమూనా

ఔటర్‌కు డబుల్ డెక్కర్ ఇంటర్‌చేంజ్

- బుద్వేల్ లేఅవుట్‌కు కనెక్టివిటీగా ప్రణాళిక
- రూ.90కోట్లతో నిర్మిస్తున్న హెచ్‌ఎండీఏ
- ఏడాదిలో అందుబాటులో వచ్చే అవకాశం

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)కు డబుల్ డెక్కర్ ఇంటర్‌చేంజ్ రానుంది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ నిర్మాణం చేపట్టింది. రూ.90కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా డబుల్‌డెక్కర్ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. బుద్వేల్‌లో హెచ్‌ఎండీఏ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన భారీ లేఅవుట్ నుంచి.. ఓఆర్ఆర్‌పైకి రాకపోకలు సాగించేందుకు ఈ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ దోహదపడేవిధంగా ప్రణాళికలు రూపొందించారు. ఓఆర్ఆర్ వెంట రాజేంద్రనగర్ ఎగ్జిట్ దాటిన తర్వాత బుద్వేల్ లేఅవుట్‌ను వంద ఎకరాల్లో హెచ్‌ఎండీఏ రూపొందించింది. 14 ల్యాండ్ పార్సిల్స్‌ను ఏడాదిన్నర క్రితం ఆన్‌లైన్‌లో వేలం వేయగా.. ప్రభుత్వానికి రూ.3,625కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఆ లేఅవుట్ అభివృద్ధి ఇటీవల సుమారు రూ.300కోట్లతో హెచ్‌ఎండీఏ పనులను ప్రారంభించింది. ఈ లేఅవుట్‌లోని ప్రధాన రోడ్డును ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేస్తామని బుద్వేల్‌లో ప్లాట్ల విక్రయం సందర్భంలో సర్కారు ప్రకటించింది. ఇప్పుడు ఆ మేరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు సిద్ధమైంది.

ఔటర్‌లోకి నాలుగు కారిడార్లు

బుద్వేల్ లేఅవుట్ నుంచి ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఉండే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఆద్యంతం ప్రత్యేకతలతో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు ప్రారంభమై.. ఔటర్‌పైకి చేరేసరికి నాలుగు కారిడార్లుగా మారుతుంది. ఓ వైపు పటాన్‌చెరు మార్గానికి, మరో వైపు శంషాబాద్ మార్గానికి రెండేసి లేన్లలో రెండు ఎంట్రీ-ఎగ్జిట్లుగా అనుసంధానం అవుతుంది. ఈ ఫ్లైఓవర్ నాలుగు కారిడార్లు 2.8 కిలోమీటర్ల మేర ఉంటాయి. సుమారు 400 మీటర్ల వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఉంటుంది. ఇప్పటికే మొత్తం 42 పిల్లర్లకు గాను.. ఔటర్ వెలుపల 10 పునాదులు పూర్తయ్యాయి.

కనకగిరి గుట్టల్లో ఎకో టూరిజం

అటవీ, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి.. కొండల వరుసలతో విస్తరించిన అటవీ ప్రాంతం

- పర్యాటకుల కోసం సిద్ధమవుతున్న మౌలిక వసతులు

ఖమ్మం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఊటీ, కొడైకెనాల్, కూనూరు మాదిరి ఎత్తైన కొండలు.. చిరుత పులులు, ఎలుగు బంట్లు, జింకలు, అడవిదున్నలతో పాటు అరుదైన పక్షి సంపదకు నిలయమైన దట్టమైన అటవీ ప్రాంతం.. మధ్య మధ్యలో కొండలపై వెలసిన చారిత్రక ఆలయాలు.. ఆహ్లాదాన్ని పంచే పచ్చని అందాలతో కనువిందు చేస్తోంది కనకగిరి రిజర్వు ఫారెస్టు. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో సుమారు 20వేల హెక్టార్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టల్లో అటవీ, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ-ఆంధ్రాకు సరిహద్దున ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను అనుసంధానిస్తూ తల్లాడ, పెనుబల్లి, కల్లూరు, ఏన్కూరు, చండ్రుగొండ, జూలూరుపాడు తదితర మండలాల్లో 20వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రిజర్వు ఫారెస్టులో ఎత్తైన కొండలున్నాయి. ఈ కొండ ల్లో చిరుతలు, ఎలుగుబంట్లతో పాటు వేల సంఖ్యలో దుప్పులు, జింకలు, అడవిగొర్రెలు, అడవిదున్నలు, అడవి పిల్లులు.. ఇలా పలు రకాల జంతువులతో పాట కనువిందుచేసే పక్షిజాతులు ఉన్నాయి. బంగారాన్ని మరిపించేలా వెదురు విస్తరించి ఉండటంతో ఈ కొండలకు కనకగిరి కొండలుగా గుర్తింపు ఉంది. మొత్తం 50 కొండలతో విస్తరించి ఉన్న కొండల్లో ప్రతి కొండకూ ఓ ప్రత్యేకత ఉంది. కింద కొండలోని పాలకోయ లొద్ది వద్ద 18 హస్తాలు, 18 అస్త్రాలతో ఉన్న వీరన్నస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. దీనిని కాకతీయుల కాలంలో నిర్మించారు. పులిగుండాల రిజర్వు ఫారెస్టు వద్ద శివాలయాన్నీ కాకతీయులే కట్టారు.



కనకగిరి గుట్టల ప్రాంతం



కొండలపై కొలువుదీరిన హస్తాల వీరన్నస్వామి

ఎలా వెళ్లాలి..

ఏటా వర్షాకాలం నుంచి ఫిబ్రవరి వరకు ఈ కొండలను తిలకించవచ్చు. ఖమ్మం జిల్లా తల్లాడ, సత్తుపల్లి రహదారిలోని కల్లూరు మండలం రామకృష్ణాపురం నుంచి పులిగుండాల వరకు 12 కి.మీ వెళితే కనకగిరి అటవీ ప్రాం తాన్ని చేరుకోవచ్చు. అక్కడి నుంచి పులిగుండాల రిజర్వాయర్‌కు వెళ్లవచ్చు. ప్రస్తుతం అక్కడ బోటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ నుంచి 3కి.మీ దూరంలో 'పులిగుండం'వద్ద జలపాతం ఉంది. ఇక్కడ ఫిబ్రవరి వరకే నీరు ఉంటుంది. ఈ 3 కి.మీ. నడిచి వెళ్లాలి. అక్కడి నుంచి సఫారీ వాహనాల ద్వారా కనకగిరి గుట్టల శిఖరానికి(570మీటర్ల ఎత్తు) వెళ్లాలి. అయితే ప్రస్తుతం అటవీశాఖ వాహనాల్లోనే పర్యాటకులను తీసుకెళ్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు కొనుగోలు చేయబోతున్నారు. కనకగిరిపై కాకతీయుల కాలంలోనే చుట్టూ గోడ నిర్మించారు. ఈ ఎత్తైన కొండ నుంచి శత్రువుల రాకను పసిగట్టేవారు. ఇక్కడ ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో శివరాత్రి రోజున కల్యాణం జరుగుతుంది. కొండలపైకి ఎక్కి వీరభద్రస్వామి దర్శనంతో పాటు కొండలను తిలకించేందుకు జంగిల్ వ్యూ ఏర్పాటు చేశారు. కాకతీయుల కాలంలో ఇక్కడ బండరాళ్లలోనే తవ్విన బావిలో వేసవిలోనూ నీరుంటుంది. ఏనుగులు, గుర్రాలు, సైనికులు ఈ కొండల పైనే ఉండేవారని చరిత్రకారులు చెబుతున్నారు.

వానాకాలం నాటికి పనులు పూర్తవుతాయి..

కనకగిరిగుట్టల్లో తెలుగు రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షించేలా ఎకో, టెంపుల్ టూరిజం కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే వానాకాలం నాటికి పనులు పూర్తవుతాయి. పులిగుండాల రిజర్వాయర్‌లో బోటింగ్ కోసం బోట్లు కొనుగోలు చేస్తున్నాం. కొండలు ఎక్కేందుకు, జంతువులు, పక్షులను తిలకించేందుకు సఫారీ వాహనాలను త్వరలో ఏర్పాటు చేస్తాం. అటవీ ఉత్పత్తులు, ఔషధ మొక్కల గురించి పర్యాట కు లకు తెలియజేయడంతో పాటు అటవీ ఉత్పత్తులతో ఆహారం అందించేందుకు ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నాం.



- సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి

బస్సు, లారీ మధ్య కారు నుజ్జు

- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి గాయాలు
- నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదం

చిట్యాలరూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద శనివారం అర్ధరాత్రి తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కంటెయినర్ లారీ, బస్సు మధ్య నలిగి కారు నుజ్జయిన ఘటనలో ఇద్దరు యువకులు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం. నల్లగొండ, మాన్యంచెల్కకు చెందిన సయ్యద్ నవాజ్ (28), మహ్మద్ జుబేర్ (20), సల్మాన్, షోయబ్ వెల్డింగ్ పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన ఈ నలుగురు శనివారం రాత్రి కారులో స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, శనివారం అర్ధరాత్రి తర్వాత పెద్దకాపర్తి శివారులోని కావేరి కాటన్ జిన్నింగ్ మిల్ సమీపంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఆ కారు ముందు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సుకు చెందిన డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేసి వాహనాన్ని ఆపాడు. గమనించిన కారు డ్రైవర్ వాహన వేగాన్ని తగ్గించాడు. కానీ, వెనక ఉన్న కంటెయినర్ లారీ.. కారును ఢీకొట్టగా.. అది బస్సు కిందకు దూసుకెళ్లిపోయింది. దీంతో కారు నుజ్జునుజ్జు అవ్వగా సయ్యద్ నవాజ్ (28), మహ్మద్ జుబేర్ (20) అక్కడికక్కడే మరణించగా.. సల్మాన్, షోయబ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గాజాపై అమెరికా చొరవ.. కాల్పుల విరమణ కొనసాగింపు

- ఇజ్రాయెల్ అంగీకారం

టెల్అవీవ్, మార్చి 3: రంజాన్ నేపథ్యంలో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు ఇజ్రాయెల్ అంగీకరించింది. నిజానికి శనివారంతో మొదటి దశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. తొలుత ఇజ్రాయెల్ కాల్పుల విరమణను కొనసాగించాలని హమాస్‌కు ప్రతిపాదిస్తూ.. బందీలను విడుదల చేయాలని సూచించింది. దీనికి హమాస్ అంగీకరించకపోవడంతో.. ఆదివారం ఉదయం నుంచి గాజాకు మానవతాసాయాన్ని అడ్డుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు ప్రధాని నెతన్యాహు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే అమలు చేసింది. అమెరికాకు కూడా ఈ విషయాన్ని వివరించింది. బందీలను విడుదల చేస్తేనే.. తదుపరి కాల్పుల విరమణ ఉంటుందని కైరోలో జరుగుతున్న చర్చల వేదికగా ఈజిప్ట్, ఖతార్‌కు తేల్చిచెప్పింది. అయితే.. ఆదివారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఏప్రిల్ 20 వరకు కాల్పుల విరమణను పాటించాలని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ విజ్ఞప్తి చేశారు. దానికి ససేమిరా ఒప్పుకోని ఇజ్రాయెల్.. ఆదివారం సాయంత్రానికి కాల్పుల విరమణను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. కాగా.. ఆరు వారాల పాటు కొనసాగిన తొలి దశ కాల్పుల విరమణ సందర్భంగా హమాస్ 25 మంది బందీలను, 8 మంది మృతదేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించింది. అందుకు ప్రతిగా ఇజ్రాయెల్ తమ దేశ జైళ్లలో ఉన్న 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను హమాస్‌కు అప్పగించింది. ఇంకా హమాస్ చెరలో 59 మంది బందీలున్నట్లు.. వారిలో 32 మంది చనిపోయి ఉంటారని ఇజ్రాయెల్ భావిస్తోంది.

హైసెక్యూరిటీ ప్లేట్లు లేకుండానే రోడ్లపైకి వాహనాలు

- మహారాష్ట్రలోనే 10 లక్షల కొత్త బళ్లు.. ప్రభుత్వ వాహనాలే అధికం

ముంబయి, మార్చి 2: వాహనాలకు తప్పనిసరిగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్‌ఎస్‌పీఆర్) అమర్చాలన్న నిబంధన సక్రమంగా అమలు కావడం లేదు. సాధారణ పరిభాషలో వీటినే 'ఇండియా', 'ఐఎన్‌డీ' నెంబరు ప్లేట్లుగా వ్యవహరిస్తుంటారు. 2019 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వీటి ఏర్పాటును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. కానీ ఒక్క మహారాష్ట్రలోనే ప్రస్తుతం సుమారు 10 లక్షల వాహనాలు హెచ్‌ఎస్ఆర్‌పీ నెంబరు ప్లేట్లు లేకుండానే తిరుగుతున్నట్టు అధికారుల సమీక్షలో తేలింది. 2019 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత ఇంతవరకు ఈ అయిదేళ్ల కాలంలో మొత్తం 1.15 కోట్ల వాహనాలను విక్రయించారు. అందులో 1.05 కోట్ల వాహనాలకు మాత్రమే హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు ఉన్నాయి. మిగతా 9.98 లక్షల వాహనాలు ఈ ప్లేట్లు లేకుండానే నడుస్తున్నాయి. వీటిలో ప్రభుత్వ వాహనాలే అధికం కావడం విశేషం. 2019 ఏప్రిల్ ఒకటో తేదీ ముందు విక్రయించిన 2.10 కోట్ల పాత వాహనాలకు కూడా ఈ ప్లేట్లను అమర్చాలంటూ ఇచ్చిన ఆదేశాలు కూడా పూర్తిగా అమలు కాలేదు. దాంతో హైసెక్యూరిటీ ప్లేట్లను అమర్చడానికి ప్రభుత్వం ఏప్రిల్ 30 తేదీ వరకు గడువు పెంచింది. మరోవైపు ప్లేట్లను అమర్చడం కూడా సక్రమంగా లేదని సమీక్షలో తేలింది. హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు లేకుండా వాహనాలను వినియోగదారులకు అప్పగించకూడదన్న నిబంధనను కూడా అధికారులు ఉల్లంఘిస్తూ ఆర్‌.సి.లు అందజేస్తున్నారు. అన్ని వాహనాల ఫొటోలను 'వాహన్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్న నిబంధనను అమలు చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

రాస్తున్న క్రమంలోనే నవల రూపం దాల్చుతుంది



ఓల్గా ఒక ఫెమినిస్ట్ ఆల్కెమీ. ఆమె పేరే సంకెళ్లు తెగుతున్న సంగీతమై మధుర మంజులంగా మనని ఆవహిస్తుంది. ఓల్గా నామవాచకం కాదు, సర్వనామం. ఆమె కోరుకున్న స్వేచ్ఛ ఆమెకు మాత్రమే పరిమితమైంది కాదు, స్త్రీలందరికీ సంబంధించింది. వేల సంవత్సరాలుగా అంగీకృతమైపోయిన స్త్రీల అణచివేతనీ, దోపిడీనీ, బానిసత్వపు పద్ధతులనీ ప్రతిఘటించి ఎదుర్కొనే చైతన్యాన్ని ఇస్తూ, స్త్రీలకు తమ చరిత్రను తాము అర్థం చేసుకునే సదవకాశాన్ని కలిగించిందామె సాహిత్యం. స్త్రీలను బుద్ధిజీవులుగా నిలబెట్టడమే ఆమె సాహిత్యోద్యమం సాధించిన విజయం. ఓల్గా రాసిన తొమ్మిది నవలలూ మనందరి హృదయాల మీద ముద్రించుకుపోయినవే. ఇది 'నవలా శిల్పం' శీర్షికన ఆమెతో చేసి సంభాషణ.

ఇంటర్వ్యూ ■ వి. ప్రతిమ

మీరు నాన్‌ఫిక్షన్, ఫిక్షన్ రెండూ విస్తృతంగా రాశారు. వ్యాస ప్రక్రియలో ఒక భావజాలాన్ని, ఒక సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడం సులువే. కానీ నవలా ప్రక్రియలో మీరు నమ్మిన సిద్ధాంతాన్ని అర్థం చేయించడం, ఆ భావాలని ఒప్పుదలగా పంచడం కష్టం కాలేదా?

నేను ఒక సిద్ధాంతాన్ని, భావజాలాన్ని నవలల్లో రాశానని, లేదా వాటిని చెప్పటం కోసం నవలలు రాశాననీ అందరూ అనుకుంటారు, అంటారు. చివరకు నేనూ నిజమే అనుకునేంతగా ఆ మాట స్థిరపడింది. దీని గురించి విపులంగా ఆలోచిస్తే- సిద్ధాంతం గానీ, భావజాలం గానీ ఎలా పుడతాయి? సిద్ధాంత కర్తలు ఒక సిద్ధాంత నిర్మాణాన్ని ఎలా చేస్తారు. సమాజంలో మానవుల బాధలను, వేదనలను, దుఃఖాన్ని, వాటికి కారణమైన దోపిడిని, అణచివేతను అర్థం చేసుకునే ప్రయత్నం చేసేటపుడు, వారు కనుగొన్న కారణాలను ఒక పద్ధతిలో చెప్పినప్పుడు అది సిద్ధాంతమవుతుంది గదా! అంటే సామాజిక మానవ జీవితం గురించిన లోతైన అవగాహనే సిద్ధాంతం. ఆ జీవితం గురించి ఒక చిన్న పరిధిలో, కొందరు వ్యక్తులను మాత్రమే తీసుకుని, వాస్తవికతతో పాటు కాల్పనికతనూ కొంత జోడించి, సూటిగా, రసవంతంగా రాస్తే అది సాహిత్యమవుతుంది. వాస్తవికత, కాల్పనికతల మేళవింపు ఎంత చిక్కగా, అందంగా రాయగలిగాడనేదే రచయిత వ్యక్తిగత శైలి, శిల్పం అవుతుంది. సిద్ధాంతంపై గట్టి పట్టు ఉండటం వల్ల మానవ జీవితాన్ని అర్థం చేసుకునే వీలు కలిగి రాయాలనుకున్న విషయంపై స్పష్టత వచ్చి, రచయిత శైలి మెరుగుపడుతుంది. అందువల్ల ఎలాంటి వ్యాసాలు రాసినా నవలలు రాయటానికి ఏ ఇబ్బందీ రాదు. వ్యాసాలు రాయటం వల్ల నవలల్లో ఒక సరళత, సూటిదనం వస్తుంది. రెండింటికీ మంచే జరుగుతుంది. కొ.కు., చలం వీళ్ళంతా ఈ మార్గం వేశారు.

> స్త్రీలు గృహిణి పాత్రలో ఉంటూ, అది అనుమతించిన మేరకే సామాజిక జీవితంలోకి రావాలని చాలామంది అనుకుంటారు. కుటుంబాలు నిలబడవు అంటారు. స్త్రీల జీవితాలను తొక్కేస్తూ కుటుంబాలు నిలబడాలా? కుటుంబం నిలబడటానికి, పడిపోవటానికి స్త్రీలు మాత్రమే కారణమా? ఇలా అనేక విషయాల మీద కథలు, నవలలు రాయటానికి నాకు 'స్వేచ్ఛ' నవల మీద జరిగిన దాడి ఉపయోగపడింది.

ఒక నవలకు మీ మనసులో మొదటి విత్తు పడటం, రాయటానికి ఉపక్రమించటం... ఈ రెండు దశల మధ్య మీ ఆలోచనా ప్రయాణం ఎలా ఉంటుంది?

నవల కోసం ఇతివృత్తం అనుకున్న తర్వాత చాలా రోజులు రాయకుండా ఉంటాను. దాని గురించి ఆలోచన కూడా సబ్ కాన్షస్ మైండ్‌లో జరుగుతుంది. పనిగట్టుకుని ఆలోచించను. నోట్స్ రాసుకోను. కొన్నాళ్ళ తర్వాత ఆ నవల రాసుకుంటూ వెళ్తాను. రాస్తున్న క్రమంలోనే నవల రూపం దాల్చుతుంది. మొదటి నవలలు, అంటే 'గులాబీలు' (1992) వరకూ, ఫెయిర్ చేసేటపుడు చిన్న చిన్న మార్పులు జరిగేవి. ఆ తర్వాత ఒకే సారి ఫెయిర్ రాయటం మొదలైంది. రాసి కుటుంబరావుకి చదవమని ఇవ్వటం, అతను బాగుందనటం, అంతే- ఆ తర్వాత ఇక దానిని మళ్ళీ చదివే పని పెట్టుకోను. అచ్చయిన తర్వాత కూడా చదవను. ఇక ఆ రచన నాది కాదు. పాఠకులది. దానితో నా రిలేషన్ పూర్తవుతుంది. దానిని గౌరవించుకుంటాను. అదే సమయంలో దానితో కొంత దూరాన్ని పాటిస్తాను. మళ్ళీ మళ్ళీ దానితో జోక్యం చేసుకోను.

మీ మొదటి నవల రాసే క్రమంలో రచనా పరంగా ఎదుర్కొన్న సవాళ్ళూ, ఇబ్బందులు?

మొదటి నవల 'సహజ'. నలుగురు స్నేహితురాళ్ళ కథ. పెళ్ళికి ముందు వారి జీవితాలలో, పెళ్ళయ్యాక వారి జీవితాలలో ఎలాంటి మార్పు వచ్చింది, ఆ మార్పు వల్ల ఊపిరాడని ఇద్దరు స్త్రీలు తమ జీవితాలను మార్చుకోవటానికి ఎలా సాహసించారు. ఆ సాహసానికి వారిని ప్రేరేపించిన స్నేహితురాలి జీవితం ఎందుకు, ఎలా భిన్నంగా ఉంది? - ఈ విషయాన్ని చాలా తక్కువ పేజీలలో రాయాలి. 'చతుర' మాస పత్రికలో ఒక నవలంతా వచ్చేది. దానికి పేజీల పరిమితి ఉండేది. అందువల్ల ఇన్ని విషయాలను సూటిగా, స్పష్టంగా, అర్థవంతంగా, చదివించే గుణం ఉండేలా రాయటం ఒక సవాలే. ఈ పరిమితులున్నాయి, ఈ లక్ష్యం ఉంది అనేది బాగా అర్థం

నవలా శిల్పం

ఓల్గా

చేసుకున్న తర్వాత అది కష్టం కాలేదు. సులువగానే రాసేశాను. పైగా నా గురువులని చెప్పుకోగలిగిన చలం, కొ.కు.లు రాసినవి కూడా చిన్న నవలలే. చెప్పినవి లోతైన విషయాలు. విపరీతమైన రీడబిలిటి. వారి బాటలో ప్రయాణం చేశాను.

మీరు నాలుగు దశాబ్దాల క్రితమే రాసిన 'మానవి' నవలలో అస్తిత్వవాదాల వెలుతురు లోంచి స్త్రీల జీవితాలని- ముఖ్యంగా వైవాహిక, కుటుంబ వ్యవస్థలను- లోతులకు వెళ్లి విశ్లేషించారు. పితృస్వామ్య నియంత్రణల కుట్రని ఏ క్రమంలో అర్థం చేసుకుని, ఏ పరికరాలను ఉపయోగించి 'మానవి' నవల రచనకు మొగ్గారు?

పితృస్వామ్యం కేవలం కుట్ర కాదు. అది ఒక సామాజిక వ్యవస్థ. అది ఎప్పటికప్పుడు రూపం మార్చుకుని స్త్రీలను నియంత్రిస్తుంది. ఒకప్పటి భూస్వామ్య పితృస్వామ్యం, ఇప్పటి పితృస్వామ్యం రెండింటి రూపాలు వేరు. సారాంశం మాత్రం అణచివేతే. పితృస్వామ్యం దానికి అవసరమైన ఆధిపత్య హింసా రూపాలను ఎప్పటికప్పుడు తయారు చేసుకుంటుంది. దీనితో పోరాటం వర్గపోరాటం కంటే కష్టం. శత్రువులు మనవాళ్ళే, ఆయుధాలు చేతిలోంచి సులువుగా జారిపోతాయి. ఐతే స్త్రీలు తమ జీవితాలు తమ చేతుల్లోకి తీసుకోవాలి. తప్పయినా, ఒప్పయినా తమ నిర్ణయాలకు తామే బాధ్యత వహించాలి. ఈ పనులు చేయాలంటే సమాజం విధించిన పాత్రల నుండి (భార్య, తల్లి, కూతురు మొదలైనవి) బైటపడి ముందు మనిషిగా, మానవిగా మారాలి. దాని కోసం స్త్రీలు తమ జీవిత పోరాటాలను చేయాలి అనేది అర్థం చేయించటం కోసం 'మానవి' నవల రాశాను.

మీ నవలల్లో 'స్వేచ్ఛ' తెలుగు నేలపై స్త్రీవాదానికి సంబంధించి అత్యంత మౌలికమైన రచన. ఆ నవల తీవ్ర వివాదాలకు, దాడులకు కారణమైంది. అప్పటి స్థితి నేపథ్యంలో ఆ నవల గురించి కొత్త తరం పాఠకుల కోసం చెప్పగలరా?

'స్వేచ్ఛ' నవల 1987 ఫిబ్రవరిలో విడుదలయింది. మార్చి నుంచీ నా వ్యక్తిగత జీవితం మీద దాడి, నా వ్యక్తిగత జీవితానికి, నా రచనకు ముడిపెట్టి ఇంకోవైపు దాడి మొదలైంది. ఆ నవలలో నేను ప్రతిపాదించిన లేక చర్చకు పెట్టిన గృహిణీత్వానికి, పౌరసత్వానికి మధ్య ఉన్న వైరుధ్యం, దాని పరిష్కారానికి జరిగే ఘర్షణ, ఆ ఘర్షణకు కావలసిన స్వేచ్ఛాకాంక్ష, స్వేచ్ఛ- వీటిని ఒక మామూలు మధ్యతరగతి యువతి జీవితంలో చూపే ప్రయత్నం చేశాను. అలాగే వివాహంలో బందీ కావటం, దాని వల్ల జీవితాశయాలకు దూరమవటం కంటే సహజీవనం మెరుగేమోననే ప్రతిపాదన చేశాను. ఈ రెండూ ఉద్యమకారులకు నచ్చలేదు. స్త్రీలు గృహిణి పాత్రలో ఉంటూ, అది అనుమతించిన మేరకే సామాజిక జీవితంలోకి రావాలని చాలామంది అనుకుంటారు. కుటుంబాలు నిలబడవు అంటారు. స్త్రీల జీవితాలను తొక్కేస్తూ కుటుంబాలు నిలబడాలా? కుటుంబం నిలబడటానికి, పడిపోవటానికి స్త్రీలు మాత్రమే కారణమా? ఇలా అనేక విషయాల మీద కథలు, నవలలు రాయటానికి నాకు 'స్వేచ్ఛ' నవల మీద జరిగిన దాడి ఉపయోగపడింది. వ్యక్తిగతంగా జరిగిన దాడి నేను మరింత బలంగా, మానవీయంగా, క్షమాగుణం పెంచుకునేలా, మొరటువారిని, మూర్ఖులను చూసి నవ్వుకునే శక్తిగల దానిగా తయారు చేసింది.

దళిత సమస్యనీ, స్త్రీల సమస్యనీ ఏకకాలంలో చిత్రించిన నవల 'ఆకాశంలో సగం'. ఆ ఇతివృత్తం మిమ్మల్ని ఎందుకు ఆకర్షించింది? జసింత వంటి యోధ ఐన పాత్ర సృష్టి ఎలా జరిగింది?

'ఆకాశంలో సగం' పూర్తి కల్పితం కాదు. ఒక గ్రామంలో రెండు పార్టీల మధ్య పంచాయితీ ఆఫీసు ఎక్కడ కట్టాలనే చిన్న విషయం మీద పెద్ద తగాదాలు, ఘర్షణలు జరిగాయి. బహుశా అనేక గ్రామాల్లో జరుగుతాయి. వాటిలో స్త్రీల ప్రమేయం ఉండదు. స్త్రీలకు ఆ ఘర్షణలు ఇష్టం లేకపోయినా భర్తల కోసం భరిస్తారు. తమ వారికి దూరమవుతారు. దీనిని ఎవరు ఎదుర్కోగలరు? ఒక దళిత యువతి, చదువుకున్న చైతన్యవంతమైన యువతి మాత్రమే ఎదుర్కోగలదని నాకు అనిపించింది. ఉద్యమాలలో అలాంటి యువతులను నేను చూశాను. కానీ వారికి నాయకత్వ లక్షణాలు ఎంత ఉన్నతంగా ఉన్నా, నాయకత్వంలోకి రానివ్వని పరిస్థితులనూ చూశాను. ఒక దళిత యువతికి ఆ పోరాట పటిమ, వ్యూహ రచన, నలుగురిని కూడగట్టగల చొరవ ఉండటం నాకు తెలుసు. ఆ యువతికి నిజ జీవితంలో దొరకని నాయకత్వాన్ని నా నవలలో నేను ఇచ్చాను. 'జసింత' పాత్ర రూపుదిద్దుకుంది. నిజంగా స్త్రీలు నాయకత్వం వహిస్తే, పురుషులు వారి వెనక నడిస్తే ఉద్యమాలు విజయవంతమవుతాయని నమ్ముతాను. ■

'కవిత 2024'కు ఆహ్వానం

విజయవాడ 'సాహితీమిత్రులు' వెలువరిస్తున్న 'కవిత 2024' కోసం జనవరి 2024 నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురితమైన కవితలను మార్చి 15 లోగా editor.kavitha2024@gmail.comకు పంపాలి. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో పెట్టిన కవితలు అర్హమైనవి కాదు. పత్రికలలో ప్రచురితమైన కవితల ఇమేజ్/ పిడిఎఫ్‌లు మాత్రమే పంపాలి.

విశ్వేశ్వరరావు

కవిసంధ్య కవితల పోటీ ఫలితాలు

కవి సంధ్య, యానాం - చిన్ని నారాయణ రావు ఫౌండేషన్, నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా- జడా సుబ్బారావు (నూజివీడు), పర్కపల్లి యాదగిరి (సిద్దిపేట), ఐలేని గిరి (దుబ్బాక) ఎంపికయ్యారు. ప్రోత్సాహక బహుమతులకు ఎంపికైనవారు: వినోద్ గుత్తుల, మోకా రత్నరాజు, జె.డి. వరలక్ష్మి, కళా గోపాల్, బి. వేణు గోపాలరెడ్డి, పొనుగు మట్ల అశోక్ కుమార్, బి.వి. శివప్రసాద్, పిన్నంశెట్టి కిషన్, తుమ్మల దేవ్ రావ్, ఉదారి నారాయణ. మార్చి 23న బహుమతి ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

ఉమ్మడిశెట్టి అవార్డులు

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, అనంతపురం ప్రకటించిన ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు - 2024 కోసం 'రెండు ప్రపంచాల మధ్య' కవితా సంపుటికి గాను కవయిత్రి వైష్ణవిశ్రీ ఎంపికయ్యారు. ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారం - 2025 కోసం కవి నంద కిషోర్ ఎంపికయ్యారు. తర్వలో అవార్డు ప్రదానం జరుగుతుంది.

రాధేయ

సోమవారం 3 మార్చి 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



జ్ఞాపకాలై పరిమళించే బంధాల కోసం...



గరికపాటి మణీందర్ రాసిన ఈ కవిత వస్తు రూపాల మధ్య మంచి సమన్వయాన్ని సాధించింది. కవిత మొత్తం అంతర్లీనంగా ఒక సౌందర్యం పాఠకుడి హృదయాన్ని తన లోపల సంలీనం చేసుకుంటుంది. కవితలోని 'వాక్యా'లని మనుషులకు ప్రతీకలుగా తీసుకుంటే కవి దేన్ని ఉద్దేశించాడో అర్థం అవుతుంది. స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు ఎంత మంది ఉంటే మాత్రమేమి? వాళ్ళెంత పారదర్శకంగా, ఎంత ఇన్‌స్టంట్ కాఫీ పరిమళంలా వున్నా సరే, హృదయానికి దగ్గరగా వచ్చేవారు చాలా తక్కువమందే. వాళ్లు కొత్తగా కుట్టించుకున్న బట్టలకు రాసిన అత్తరు పసుపు మరకలా మనసుకు అలా కలకాలం పట్టి నిలిచిపోతారు. ఇక్కడ పసుపుకు అత్తరును అద్దటంలో ఉంది కవి చమత్కారం. మామూలుగా కొత్త బట్టలకు పసుపు రాయటం సహజం. కేవలం పసుపు మాత్రమే రాస్తే అది రాలిపోతుంది. అత్తరు అద్దటం వలన అత్తరు లోని తడిలో పసుపు సంగమించి చివరకు మరకగా మిగులుతుంది. ఆ సహజమైన పసుపుకు అత్తరు అద్ది మరకను సైతం పరిమళభరితం చేస్తున్నాడు. మనుషులు ఒకరితో ఒకరు భౌతికంగా కలిసి ఉండటం మాత్రమే కలసి ఉండటం కాదు. భౌతికమైన మనుషులను మానసికమైన బంధం ఏదో ముడి వేయాలి. ఆ బంధం అత్తరులా పరిమళాలు వెదజల్లాలి. అప్పుడు మనుషులు లేకున్నా బంధాలు జ్ఞాపకాలై పరిమళిస్తాయి.

■ వంశీకృష్ణ, 95734 27422

ప్రియ పద్యం

కొన్ని వాక్యాలు



వాక్యాలు కలగాపులగం
ఏ వాక్యం రంగు ఏమిటో
ఏ సాంధ్య వర్ణాన్నడగాలి

కొన్ని
రాళ్ళు పరచుకున్న సరస్సు లోని నీలంరంగంత
పారదర్శకంగా ఉంటాయి.

ఇంకొన్ని
హేమంతంలోని
కారు అద్దాలపై కురిసిన
తుషారంలా స్పష్టాస్పష్టంగా దోబూచులాడతాయి

మరికొన్ని
సీతాకోక రెక్కల్లాటి పెదాలు మధ్య
అమాయకత్వాన్ని ఒలకబోసే
లాలిపప్‌లా రసానందం తొణికిసలాడిస్తాయి.

వాక్యాలంతే
అలసిన సాయంత్రాలకు
దోరగా వేయించి చేసిన
ఇన్‌స్టంట్ కాఫీ పరిమళాలను ఇస్తాయి.

దినం కొలిమిలో కాలిన చేతులకు
మునిమాపుల
పూలమృదుత్వంతో సుకుమారంగా
అనురాగపు మైలేపనాలవుతాయి.

వాక్యాలు
కుప్పనూర్పిడిలో తూర్పారబట్టే
పొట్టు పొల్లులా గాలివాటంలో
తేలిపోతుంటాయి

చాలా తక్కువ వాక్యాలు మాత్రమే
కొత్తగా కుట్టించుకున్న బట్టలకు
రాసిన అత్తరు పసుపు మరకలా
మనసుకు
అలా కలకాలం పట్టి నిలిచిపోతాయి

■ గరికపాటి మణీందర్

✆ 99483 26270

ఎండమావుల్లో జమ్మిచెట్టు

నడి ఎండాకాలపు వడగాల్పుల్లో
ఒకానొక మిట్ట మధ్యాహ్నం
ఎదురుగా ఈడు బోయిన మిరప చేను
అక్కడక్కడా తెల్లని బొమికల్లా
గాలికి ఊగుతున్న తాలుగాయలు
ఎండి తలలు వాల్చేసిన దిష్టిబంతి చెట్లు
పగిలిన పత్తి గుల్లలోంచి కారుతున్న
మిగిలిపోయిన తెల్లని పత్తి
తలకొట్టేసినాక ఎదగలేక
ఎండిపోయిన పొగలొట్టలు

ఆకులు రాలిన చెట్టు కింద
బొబ్బలెక్కిన కాళ్ళకు
పూయాల్సిన లేపనం గురించి ఎదురుచూపు
పేగులకంటుకుపోయిన పొట్ట
ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఎగిరిపడుతుంది

గుల్లబారిన మట్టిపెళ్ళపై
రాలిన కన్నీటి చినుకు

సంచుల్లో మూటగట్టిన విత్తనాలు
ఎప్పటికీ మొక్కలవ్వవు
ఋతువుల పరదాలను ఎంత తొలగించినా
చిక్కని చీకటి తప్ప
చెమ్మ చేతికి తగలదు

కాటాలకెక్కిన పంట బరువు
ఎప్పుడూ రెండోవైపుకే వంగిపోతుంది
బేరన్లలో బంగారు వర్ణానికి తిరిగిన పొగాకు
బ్రోకర్ చేతుల్లో నలుపుకు తిరిగి చూర్ణమైపోతుంది.
విరిగిన వెన్నెముక ఎప్పటికీ అతకదు
స్వేద భూముల్లో మొలకెత్తే మొక్కలు
కాలిపోయి కవురుకంపు వెదజల్లుతాయి

ఎక్కడో దూరంగా ఓ జమ్మి చెట్టు
చుట్టూ ఎండమావులు
ఆశల వడగాల్పుల్లో గొంతు తడవదు
ఉండీ ఉండీ ఉత్తీత పిట్ట అరుపు
ఎలపట దాపట ఎద్దులు రెండు
జీవితాన్ని చెరోవైపూ లాక్కెళ్లిపోయాయి
వెనక
ముందు
చుట్టూ
ఎటు చూసినా
శూన్యమే శూన్యం
పూరించలేని శూన్యం

■ బండ్ల మాధవరావు

కేశవరెడ్డీ నేనూ మంచి స్నేహితులం అవుతాం అనిపిస్తుంది



చదువు ముచ్చట

మొహమ్మద్ గౌస్

రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

వివేక్ లంకమల రాసిన 'వలపటెద్దు' కథా సంపుటి బాగా నచ్చింది. మనిషి చుట్టూ ప్రకృతి అని కాకుండా ప్రకృతిలో, ప్రకృతితో కలిసి మనిషి అనే సందేశం ఈ కథల ద్వారా దొరుకుతోంది. మానవ జీవితంలో పశు పక్ష్యాదుల భాగాన్ని చాలా లోతుగా తెలుసుకొని రాసిన కథలు. రాయలసీమ గ్రామీణ జీవితం కూడా డాక్యుమెంట్ అయింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

ఇంటర్మీడియేట్లో ఉన్నప్పుడు స్నేహితుల ద్వారా కొన్ని పుస్తకాల పీడీఎఫ్‌లు దొరికాయి. అప్పటిదాకా పుస్తకాలు అలా పీడీఎఫ్‌లుగా ఉంటాయని కూడా తెలీదు. అలా దొరికిన వాటిలో 'ఒక గుండె సవ్వడి' (ముచ్చర్ల రజనీ శకుంతల), 'ఎంతో మధురమీ స్నేహం' లాంటి నవలలు చదివినట్టు గుర్తు. ఇప్పుడు ఆ కథలేవీ గుర్తులేవు.

ఒకప్పటికీ ఇప్పటికీ చదివే పద్ధతి ఎలా మారింది?

ఒకప్పుడు ఒక రచయితని ఎంచుకుని ఆ రచయిత పుస్తకాలన్నీ వరుసగా చదివేవాడిని. ఇప్పుడు ఎక్కువగా సమకాలీన రచయితలు ఏం రాస్తున్నారో తెలుసుకోవడానికి వస్తున్న పుస్తకాలన్నీ చదువుతున్నాను. ఇప్పుడు ఎక్కువగా యాసలో (అన్ని యాసలు) రాసిన పుస్తకాలు చదువుతున్నాను.

కలిసి మాట్లాడాలనిపించే గత కాలం రచయిత?

ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా డా. కేశవరెడ్డి అని చెప్తాను. ఆయన 'స్మశానం దున్నేరు', 'సిటీ బ్యూటిఫుల్' నవలల గురించి, నిజానికి ఆయన అన్ని పుస్తకాల గురించి ఆయనతో మాట్లాడాలి. నేను బీ.టెక్‌లో ఉన్నప్పుడు 'చివరి గుడిసె' నవల చదివి ఆయన గురించి వెతికితే లేరని తెలిసింది. కేశవరెడ్డి పుస్తకాల గురించి, ఆయన సృష్టించిన పాత్రల గురించి ఆయనతో మాట్లాడితే మేం మంచి స్నేహితులం అవుతాం అనిపిస్తుంది.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించే నియమం?

ఎవరు చెప్పారో, ఎప్పుడు చెప్పారో గుర్తులేదు: నేను మాత్రమే రాయగలిగిన కథలు మాత్రమే నేను రాయాలి. నేను పాటించే నియమం - కథ వెంట పరిగెత్తకుండా కథ పక్కన కూర్చొని మాట్లాడుతూ రాయాలి. ఎదురుచూడాలి. కథ ఒప్పుకున్నాకే రాయాలి. కొలతలు, లెక్కలు లేకుండా రాయాలి.

మీకు తరచుగా గుర్తొచ్చే వాక్యం/ కవితా పంక్తి?

కాఫ్కా 'మెటమార్ఫసిస్' నుండి "గ్రెగర్ జమ్జా ఒక ఉదయం కలత పెట్టే కలల నుంచి మేల్కొని చూసే సరికి తాను ఒక పెద్ద కీటకంగా మారిపోయి ఉన్నాడు" అన్న వాక్యం. ఆ మొదటి వాక్యంతోనే పాఠకుడిని "ఇప్పుడీ కథ చదవకుండా ఎలా ఉంటావో చూస్తా" అని చెప్తున్నట్టు అనిపిస్తుంది. ఆల్బర్ట్ కాము 'ది స్ట్రేంజర్' నవల నుండి "Mother died today. Or maybe yesterday, I don't know" కూడా అలాంటి వాక్యమే.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర?



కేశవరెడ్డి 'సిటీ బ్యూటిఫుల్' పుస్తకంలోని దేవీదాస్ పాత్ర. వంద శాతం అని చెప్పలేను కానీ, లాక్‌డౌన్‌లో ఆ పుస్తకం చదివేటప్పుడు చాలా విషయాల్లో ఆ పాత్రతో ఏకీభవించాను. ఆ పాత్ర తన భావాలను వ్యక్తపరిచే విధానం చాలా నవ్వు తెప్పిస్తూ, కోపాన్ని అర్థం చేయిస్తూ ఉంటుంది. ఆ ఫ్రస్ట్రేషన్ వ్యక్తపరిచే విధానం కూడా కారణం అయ్యుండొచ్చు.

(మొహమ్మద్ గౌస్ కథ, నవలా రచయిత. ఇప్పటివరకు 'గాజులసంచి' కథా సంపుటి; 'జీరో నెంబర్ 1', '826 కి.మీ' నవలలు పుస్తకాలుగా వచ్చాయి.)

పండుగ తర్వాత

పట్నం వచ్చి పండుగ చేసుకుని వెళ్లింది
పల్లె నిండా జంబో గ్లాసులు ప్లాస్టిక్ బాటిల్స్

కార్లు తిరిగి క్యూకట్టి వెళ్లినాయి
మూడు రోజుల వస్త్ర కనక ప్రదర్శన ముగింపు

నోట్ల కట్టలు గొప్ప గొప్ప మాటలు చెప్పాయి
బాగుపడాలంటే దగా బుర్ర పెట్టాలి అని
అందరూ సలహాలు మాత్రమే వదలి వెళ్లారు

అవసరం టోల్‌గేట్ దాటినాక సెల్ సైలెన్స్
మొహమాటానికి చేరిన నెంబర్లు డిలీట్
ఏ వరస ఇక అందుబాటులో వుండబోదు

మళ్ళీ పండుగ వరకు పల్లె వూసు రాదు
మూటల వేటలో మనుషులు మూస బతుకు
పచ్చని స్టేటస్లు పల్లీ కొట్టి మళ్లీ కాంక్రీట్ జంగిల్‌లో...

■ దాసరి మోహన్

✆ 99853 09080



కవితా సంకలనాలకు ఆహ్వానం

జాతీయ సాహిత్య పరిషత్, కరీంనగర్ ఆధ్వర్యంలో రజనిశ్రీ సాహిత్య పురస్కారానికి జనవరి 2022 నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ముద్రితమైన పద్య, గేయ, వచన కవితల సంకలనాలు మాత్రమే నాలుగు ప్రతులను మార్చి 20లోగా పంపాలి. ప్రశంసా పత్రం, శాలువాతో పాటు రూ.10,116/- నగదు బహుమతి ఉంటుంది. చిరునామా: గాజుల రవీందర్, ఇం.నెం.: 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ - 505001. ఫోన్: 9848255525.

జి.వి. శ్యాంప్రసాద్ లాల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 3 మార్చి 2025

నేడు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- అర్ధరాత్రి రానున్న తుది ఫలితాలు
- జయాపజయాల్లో ఓరుగల్లు ఓట్లే కీలకం

7

నల్గొండలోని స్టేట్ వేర్‌హౌస్ గోదాములో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం



కోతుల పంచాయతీ!

పల్లెల్లో తీవ్రమైన వానరాల సంచారం

- ఇళ్లు, పంటలను పీకి పందిరి వేస్తున్న వైనం
- దాడులతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- అడవుల్లో అటకెక్కిన మంకీ ఫుడ్ కోర్టులు
- ఆహారం కోసం ఊళ్లలోకి రాక
- కానరాని సంతాన నియంత్రణ ఆపరేషన్లు
- మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటునకు డిమాండ్
- 'స్థానిక' ఎన్నికల్లో కోతుల అంశమే ప్రధాన ఎజెండా



ఇతడి పేరు బత్తుల సత్యం. ఉపాధ్యాయుడిగా రిటైర్డ్ అయి వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం తను కిరాణ సరుకులు తీసుకొని ఇంటికి వస్తుండగా, కోతుల గుంపు ఒక్కసారిగా మీదపడింది. దీంతో తను కిందపడిపోగా కోతులు మూకుమ్మడిగా దాడి చేశాయి. చేతులు, కాళ్లపై రక్కాయి. స్థానికులు వాటిని కర్రలతో బెదిరించడంతో పారిపోయాయి. అనంతరం సత్యంను 108లో ఎంజీఎంకు తరలించారు.

\- ఖిలా వరంగల్, ఆంధ్రజ్యోతి



వరంగల్ శివనగర్‌లో కోతుల గుంపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అడవుల్లో ఉండాల్సిన వానరాలు.. జనావాసాల్లో తిష్ట వేశాయి. కోతి చేష్టలతో ప్రజలకు చిరాకు తెప్పిస్తున్నాయి. మందలకు మందలుగా పల్లె, పట్టణాలను ఆక్రమించుకుంటున్నాయి. ఇంటి కప్పులే కాదు.. పంట పొలాలను పీకి పందిరేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి చేతికి ఏది దొరికితే అది లాక్కెళుతున్నాయి. అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే దాడులు చేసి గాయ పరుస్తున్నాయి. ఇక కోతుల నుంచి పంటలను కాపాడుకునే క్రమంలో అన్నదాతలు తన ప్రాణాలు కోల్పోతున్నారు. వందలాది మంది గాయాలతో అస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కోతులకు సంతాన ఉత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు లేకపోవటంతో వాటి సంతతి రోజు రోజుకు పెరిగిపోతుంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానర బాధితులు లేని ఊరే లేదంటే అతిశయోక్తి కాదు. ఈ వానర కష్టాలను తరిమి వేసేందుకు పంచాయతీల్లో నిధులు కరువయ్యాయి. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'కోతుల పంచాయతీ' ప్రధాన ఎజెండా మారనుందన్న చర్చ జరుగుతోంది.

ఊళ్లు.. పంటలపై వానర సైన్యం

కోతుల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లనే కాదు పంటలను కూడా ధ్వంసం చేస్తుండటంతో.. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ వ్యవసాయ పనులకు వెళ్లే వారిని, ఇతర పనులకు బయటకు వచ్చే వారి వెంటపడి గాయపరుస్తున్నాయి. దీంతో రైతులు, కూలీలు రోజువారి పనులకు వెళ్లేవారు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కోతుల దాడుల్లో గాయాలకు గురైన వారు మూడు రోజులకు ఒకసారి టీకాలు తీసుకునేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగడంతో పాటు.. భుజాలు, ఒళ్లు నొప్పులు, వాపులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రతీ గ్రామంలో ఈ పరిస్థితి ఉంది. కోతుల బెడద వలన చాలా వరకు కూరగాయలు, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేయటం లేదు. ఇక ఊళ్లల్లో ఇంటిని పీకి పందిరి వేస్తున్నాయి. చిన్నపిల్లలతో కలిసి బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. కిరాణం షాపు నిర్వాహకులు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేసుకుని సరుకులు విక్రయించుకోవాల్సి వస్తోంది. కోతుల సమస్య ఏ ఒక్క ఊరుకో కాకుండా రాష్ట్రం మొత్తం వానర బీభత్సంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

మంకీ ఫుడ్‌కోర్టులు జాడేదీ?

అడవులు పోడు కారణంగా అంతరించి పోతున్నాయి. దండకారణ్యంలో సైతం కలప కోసం స్మగ్లర్లు భారీ వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. దీంతో అడవుల్లో తినేందుకు కోతులకు ఆహారం కొరత ఏర్పడుతోంది. ఊళ్లల్లో తిష్టవేసిన వానర సైన్యాన్ని బంధించి అడవుల్లో వదిలేసినా.. అవి తిరిగి ఊళ్లలోకే వస్తున్నాయి. దీనికి తోడు కోతుల సంతానం భారీగా పెరుగుతుండటంతో వాటికి కావల్సినంత పండ్లు అడవుల్లో దొరకటం లేదు. దీంతో కపిరాజులు జనావాసాలకే జై కొడుతున్నాయి. ఈ క్రమంలో గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో మంకీ ఫుడ్ కోర్టులను ఓరుగల్లులోని అన్ని జిల్లాలో ఏర్పాటు చేసింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ఫుడ్ కోర్టుల్లో అరటి, పనస, సంత్రా, జామ, దానిమ్మ, రేగు తదితర పండ్ల మొక్కలను పెంచారు. అయితే కొన్నాళ్లకే వాటి నిర్వహణ మరిచారు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో మంకీ ఫుడ్ కోర్టులు లేకుండా పోయాయి. దీంతో కోతులు ఆహారం కోసం మళ్లీ ఊళ్లలోకి వస్తున్నాయి. వాటి ఆహారం కోసం మనుషులపై దాడులకు కూడా వెనుకాడటం లేదు. కోతి చేష్టలతో ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి.

కరువైన నియంత్రణ!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5 లక్షలకుపైగా కోతులు ఉన్నట్లుగా

మిగతా 7వ పేజీలో...





నేటి కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి ఉంటుందని, దీనిని జిల్లా ప్రజలు గమనించాలని, సోమవారం కలెక్టరేట్‌కు ఎవరు రావొద్దని కలెక్టర్ ప్రావీణ్య ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం(నేడు) జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.





సంగీత విభావరిలో నిఖిల్ డిసౌజ

ఆకట్టుకున్న ఫ్యాషన్‌పరేడ్.. అలరించిన డీజే



ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ

- తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు
- మధురానుభూతులను మిగిల్చిన వసంతోత్సవం
- చివరి రోజు కొనసాగిన పలు ఈవెంట్లు
- నాటకానికి కొత్త అంకం దిద్దిన నుక్కడ్
- టీం స్పిరిట్‌తో విజయవంతం

7

కేరళ నృత్యం అదరహో..

- 'కుడా' గార్డెన్‌లో ప్రదర్శన
- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఏకధాటిగా రెండు గంటల పాటు సాగిన కార్యక్రమం



కేరళ కళాకారుల నృత్య ప్రదర్శన

హనుమకొండ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయి స్తంభాల ఆలయ ప్రాంగణంలోని కుడా గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి ప్రదర్శించిన కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ సమైఖ్యతను సాధించడమే లక్ష్యంగా ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాల్లో భాగంగా కేరళ కళాకారులు, తెలంగాణ కళాకారులతో కలిసి ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. కేరళ రాష్ట్ర సాంప్రదాయ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బతుకమ్మ, బోనాల విశిష్టతను తెలియజేస్తూ ఓరుగల్లు యువతులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రారంభించారు. జన్ను భరత్, భాస్కర్‌ల ఆధ్వర్యంలో డప్పు ప్రదర్శన, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బతుకమ్మ, పింగిళి మహిళ కళాశాల విద్యార్థులు బోనాల పోతురాజు, వాగ్దేవి కళాశాల విద్యార్థులు మహాశక్తి అమ్మవారి ప్రదర్శనలు, కేయూ మహిళ కళాశాల విద్యార్థులు కోలాట ప్రదర్శనలు దేనికదే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా కొనసాగిన సాంస్కృతిక ప్రదర్శనలు నగర వాసుల మదిలో చెరగని ముద్ర వేశాయి. కేయూ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, జిల్లా బాల సంక్షేమ సమితి ఛైర్మన్ వసుధ, జాతీయ యువజన అవార్డు గ్రహీత గట్టు శ్రీకాంత్ తదితరులు పాల్గొనగా ఈ కార్యక్రమానికి సహకరించిన అభయ ఆసుపత్రి ఎండీ డాక్టర్ వైద్యం గౌతమ్, డాక్టర్ కూరపాటి రమేశ్‌లు కళాకారులకు ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు.

ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ రేవంత్‌రెడ్డికి దక్కదు

- 15 ఏళ్లుగా కృషి చేసింది కేసీఆర్, కేటీఆర్
- నాలుగు విమానాలు నడిపి నడుస్తలేవని మూసివేయొద్దు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్

6



విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్

వాలీబాల్ విజేత ములుగు జట్టు

- ద్వితీయ స్థానంలో కేయూ ఫిజికల్ ఎడ్యూకేషన్ జట్టు
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జీడీసీ)ములుగు జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో కేయూ ఫిజికల్ ఎడ్యూకేషన్ జట్టు విజయం సాధించాయి. గత రెండు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత మూల వెంకట్ రెడ్డి స్మారకార్థం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు తెలంగాణ యూనివర్సిటీ (వీసీ)యాదగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎంవీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు, క్రీడా పోటీల నిర్వహకుడు, ఏసీపీ (సీఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ...తన సోదరుడు దివంగత వెంకట్ రెడ్డికి క్రీడల పట్ల ఉన్న తమ ఆసక్తితో తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఇటీవల ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ముందు ముందు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు రోజులు పాటు నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నీలో 22 జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. హోరాహోరీగా జరిగిన వాలీబాల్ సమరంలో ప్రథమ స్థానంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ములుగు, ద్వితీయ స్థానంలో ఫిజికల్ ఎడ్యూకేషన్ కాకతీయ యూనివర్సిటీ జట్టు, తృతీయ స్థానంలో జనగాం, చతుర్థ స్థానంలో కామారం జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. కాగా, ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 20వేలు, ద్వితీయ స్థానంలో రూ. 15వేలు, తృతీయ స్థానంలో రూ. 10వేలు, చతుర్థ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేల నగదు పురస్కారంతో పాటు బహుమతులను ప్రధానం చేయడం జరిగిందన్నారు. లీగ్ నౌకౌట్ పద్ధతిన నిర్వహించిన ఈ టోర్నీలో 4 జట్లు సెమీస్‌కు చేరుకోవడంతో జట్ల మధ్య నువ్వా నేనా అనే విధంగా పోరు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. దీంతో క్రీడా పోటీలను తిలకించడానికి వాలీబాల్ కోర్టుకు పెద్ద ఎత్తున ప్రేక్షలు, అభిమానులు తరలిరావడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, డీఎస్పీ (ఇంటలీజెన్స్) నరేష్‌రెడ్డి, డీఎస్పీ (ఎస్బీ) వెంకటేష్, పీడీ బొబ్బిలి వెంకట్‌రెడ్డి, నేతాజి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి విజయ్‌కుమార్, కార్యనిర్వహణ అధ్యక్షుడు మర్రి ఇంద్రాసేనారెడ్డి, సభ్యులు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మర్కాల యాదిరెడ్డి, డీఎస్ఏ వాలీబాల్ కోచ్ జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన ములుగు జట్టు ట్రోఫీని అందజేస్తున్న తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సమ్మక్క- సారలమ్మ వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టపై తల నీలాలు సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు చేరుకొని ఎత్తు బంగారం, పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించు కున్నారు. యాట మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



ట్రాక్టర్ డ్రైవర్ల లాగ్‌బుక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

డ్రైవర్లు లాగ్‌బుక్ మెయింటెన్ చేయాలి

» కమిషనర్ అశ్విని తానాజీ వాకడే » నగరంలో తనిఖీలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చెత్త తరలింపు ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు నడిపే డ్రైవర్లు తప్పకుండా లాగ్‌బుక్‌లు మెయింటెన్ చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. ఆదివారం తెల్లవారు జామున వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో కమిషనర్ సిబ్బంది హాజరుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ల లాగ్‌బుక్‌లను తనిఖీ చేశారు. శానిటేషన్ కార్మికులు నిబద్ధతతో చేస్తున్న పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా బల్దియా మూడో డివిజన్‌తో పాటు అశోక జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతాల్లో పర్యటించి రోడ్ల శుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పారిశుధ్య సిబ్బంది కేటాయించిన ప్రాంతాల్లో పని చేయాలని, క్లీన్ సిటీగా వరంగల్ నగరానికి గుర్తింపు తేవాలని అన్నారు. అంతే కాకుండా కార్మికుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో మల్లం రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పీ అనిల్‌కుమార్, నిరంజన్, జవాన్లు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు రేపటి నుంచి శిక్షణ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఎంపికై కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులకు మంగళవారం నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం. జ్ఞానేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 602 మంది ఎస్‌ఏలకు ఈ నెల 4 నుంచి 6 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ఉపాధ్యాయులు సంబంధిత పాఠ్యపుస్తకాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎస్, కరీమాబాద్‌లో తెలుగు ఎస్‌ఏ, భాషాపండితులు, ఎస్‌ఏ బయోసైన్స్‌లకు, జీహెచ్‌ఎస్, శంభునిపేటలో సోషల్, మ్యాథ్స్, హిందీ ఎస్‌ఏలతో పాటు హిందీ భాషా పండితులకు, జీహెచ్‌ఎస్, రంగశాయిపేటలో ఎస్‌ఏ ఇంగ్లిష్‌తో పాటు పీఈటీలు, పీడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

రేపు జనార్దన్‌రావు ఎండోమెంట్ లెక్చర్

హాజరు కానున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

కేయూ క్యాంపస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ నేత, దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు 23వ ఎండోమెంట్ లెక్చర్ మార్చి 4న ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు మోమెరియల్ ఫౌండేషన్ బాధ్యులు ఆదివారం తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగే లెక్చర్‌కు సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ హాజరై 'తెలంగాణ అఫ్టర్ ఎ డికాడే : ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సినారీయస్ 'అనే అంశంపై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. అందరూ హాజరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మట్టి కొనుగోలు గడువు పొడిగింపు

మిల్స్‌కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు పూడికతీతతో వస్తున్న నల్లమట్టి కొనుగోలుకు దరఖాస్తు చేయడానికి గడువును మార్చి 5 వరకు పొడిగించినట్లు నీటి పారుదల శాఖ ఈఈ ఎం. శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన గడువులో వరుసగా సెలవులు రావడంతో గడువును పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. నల్లమట్టి కావాల్సిన వారు హనుమకొండ నక్కలగుట్టలోని నీటి పారుదల శాఖ డివిజన్ నెంబర్-2 కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95154 83828, 94406 38401 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

9న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9న హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ బాలబాలికల విభాగంలో టోర్నీ నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 90595 22986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ రేవంత్‌రెడ్డికి దక్కదు

- 15 ఏళ్లుగా కృషి చేసింది కేసీఆర్, కేటీఆర్
- నాలుగు విమానాలు నడిపి నడుస్తలేవని మూసివేయొద్దు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు

హనుమకొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడిట్ వీసమెత్తు కూడా దక్కదని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. గత 15 ఏళ్లుగా బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎయిర్‌పోర్టుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి ఏడాదిలోనే ఎయిపోర్ట్ తీసుకొచ్చామని చెప్పుకోవడం తెలంగాణ ఉద్యమకారులను, ప్రజలను అవమానించడమేనని సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై విమర్శించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడారు. 2005లో ఎంపీగా గెలిచి తాను అప్పటి కేంద్ర మంత్రి ప్రఫుల్ పటేల్‌కు లేఖ రాస్తే శంషాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరంలో పెట్టొద్దని జీఎంఆర్ సంస్థకు 25 ఏళ్లు రాసిచ్చామని అందుకే మామునూరు ఎయిర్‌పోర్ట్ ఆగిపోయిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కేటీఆర్‌తో కలిసి కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్‌ను కలిసి మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ఒప్పించినట్లు తెలిపారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో బీఆర్‌ఎస్ కృషి లేదని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ బాంబేను అధిగమిస్తుందని హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ హబ్ కాబోతుందన్నారు. రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలకు మామునూరు ఎయిర్‌పోర్ట్ కీలకం కానుందన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లయింగ్, ట్రెయినింగ్ ఆర్గనైజేషన్ మామునూరుకు తీసురావాలని బోయింగ్, ఎయిర్‌బస్, ఇండిగో లాంటి అనేక విమాయాన సంస్థలు, విమానాల రిపేరింగ్ సెంటర్స్‌ను వరంగల్‌కు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. నాగ్‌పూర్, అమరావతికి ఫ్లయింగ్ ట్రెయినింగ్ ఆర్గనైషన్ తీసుకెళ్లాలని ఆ రాష్ట్రాలు పోటీపడుతున్నట్లు తెలిపారు. వాయుదూత్‌ల నాలుగు విమానాలు నడిపి ఇక్కడ నడుస్తలేవని మూసివేయొద్దన్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు.

చేయని పనికి స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు : వినయ్ భాస్కర్

మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు చేయని పనికి స్వీట్లు పంచుకుంటున్నారని విమర్శించారు. విభజన చట్టంలోని వరంగల్‌కు కావల్సిన అన్ని అంశాలను కేసీఆర్ ప్రస్తావించారన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో టెక్స్‌టైల్ పార్కు, మామునూరు ఎయిర్‌పోర్ట్ భూసేకరణ కోసం ఎంతో కృషి చేశామని తెలిపారు. ఆ కృషి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అన్నారు. మామునూరు చుట్టు పక్కల భూములు ఎకరం రూ. 4 నుంచి రూ. 5 కోట్ల వరకు పలుకుతున్నాయని, భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నస్తూరుపల్లి అడవుల్లోకి పెద్దపులి



అడవుల్లో పులి ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



పులి పాదముద్ర

కాటారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కాటారం, మహదేవపూర్ రేంజ్ అడవుల్లో పెద్దపులి ఇంకా సంచరిస్తూనే ఉందని తెలుస్తోంది. గత నెల 10న నస్తూరుపల్లి అడవుల్లో పులి సంచరించినట్లు ఆనవాళ్లు దొరకగా 21 రోజులుగా డివిజన్ పరిధి లోని అడవుల్లో తిరిగిందనే ఆనవాలు కనిపించాయి. మళ్లీ నస్తూరుపల్లి అడవుల్లోకి వచ్చినట్లు అటవీ అధికారులు వెల్లడించారు. శనివారం ప్రతాపగిరి అడవుల్లోని పులితోగు వాగు నుంచి పలుచోట్ల పెద్దపులి పాదముద్రల ఆనవాళ్లు కనిపించగా ఆదివారం అటవీ అధికారులు, సిబ్బంది దాని జాడ కోసం అడవులను జల్లెడ పట్టారు. అటవీశాఖ కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లోని బాటలు, వాగులను పరిశీలిస్తూ వెళ్లారు. మర్రిపల్లి అడవుల మీదుగా కాటారం రేంజ్ అడవుల నుంచి నస్తూరుపల్లి అడవుల్లోకి పులి వెళ్లినట్లు పాదముద్రల ద్వారా గుర్తించారు.

అడవుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లొద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. 21 రోజులుగా పెద్దపులి డివిజన్ అడవులను కలియతిరిగి మొదట ఆనవాలు కనిపించినా నస్తూరుపల్లి అడవుల్లోకి రావడంతో తన స్థావరం కోసం హద్దులను నిర్ణయించుకుని ఉండొచ్చని ట్రాకర్స్ అభిప్రాయపడుతున్నారు. పులి ఏ ప్రాంతం నుంచి వచ్చిందో త్వరలో అక్కడికే తిరిగి వెళ్లొచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అడవు లోకి వెళ్లొద్దని, దానికి హాని చేసే చర్యలు చేపట్టొద్దని అధికారులు అంటున్నారు. అడవులను గాలిస్తున్న బృందాల్లో ఫారెస్టు అధికారులు చంద్రశేఖర్, రాజేందర్, మొయినొద్దీన్, మోనా కౌసర్, జయలక్ష్మి, సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్‌క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వివేకానంద స్కాలర్స్ హాస్టల్ జేడీగా సాంబశివరావు

కేయూ క్యాంపస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ వివేకనంద రిసెర్చ్ స్కాలర్స్ కొత్త జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎ.సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సాంబశివరావును జేడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తర్వులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు సాంబశివరావుకు అందచేశారు. సాంబశివరావు కేయూ ఎకానమిక్స్ విభాగంలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును కేయూ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

యమ డేంజర్.. ట్రాన్స్‌ఫార్మర్



విస్సంపల్లి నుంచి ఉగ్గంపల్లి వెళ్లే రోడ్డులో కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

చిన్నగూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలు, మూగజీవాలు సంచరించే ప్రదేశాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు భయపెడుతున్నాయి. ఎత్తులో బిగించాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు నేలపై, గజం ఎత్తులో ఫ్యూజ్ బాక్స్ వైర్లు చేతికి అందే విధంగా ఏర్పాటు చేయడంతో మండలంలో కొన్నిచోట్ల డేంజర్‌గా మారాయి. విస్సంపల్లి, ఉగ్గంపల్లి రహదారిలో రోడ్డు పక్కన చేతికందే విధంగా ఉండడమే కాకుండా కంచె కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు, గ్రామాల్లో మూగ జీవులు నిత్యం వందలాదిగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచే రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో పరిసర ప్రజలు భయాందోళన చెందుతుండగా, ఏమైనా జరిగితేనే అధికారులు పట్టించుకుంటారా.. అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జ్వరంతో శిశువు మృతి



పాప మృతదేహం

వాజేడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జ్వరం, జలుబుతో బాధపడుతూ 54 రోజుల శిశువు మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రుపట్లకు చెందిన గోగు బాలకృష్ణ, భారతి దంపతులు ఏడాది కాలంగా మండల కేంద్రంలోని గుడిసెల పోరాట కేంద్రం వద్ద నివాసం ఉంటున్నారు. వీరికి మూడో సంతానంగా 54 రోజుల క్రితం పాప జన్మించింది. మూడు రోజుల క్రితం ఆ శిశువుకు జ్వరం, జలుబు బారినపడింది. దీంతో వాజేడు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచిండటంతో శనివారం శిశువును అక్కడికి తరలించి చికిత్సను అందించారు. జలుబు ఎక్కువగా ఉండటంతో నిమ్ము ఎక్కువగా ఉందని, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఏటూరునాగారం వైద్యులు సూచించారు. అయితే.. ప్రయాణ ఖర్చులకు ఆర్థిక స్తోమత లేకపోవంతో వరంగల్ వెళ్లతకుండా వాజేడులో మండలంలోని చెరుకూరులో ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున పాపలో కదలికలు లేకపోవడంతో 108 అంబులెన్స్‌లో వాజేడుకు వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆ శిశువు మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు.

వ్యాక్సిన్ వేయకపోవడం వల్లేనా ?

పాపకు 45వ రోజు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా వైద్యశాలకు వెళ్లగా అది అందుబాటులో లేదని చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో మరోసారి వెళ్లినా అదే సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేయాల్సిన వ్యాక్సిన్ వేస్తే పాప బతికేదని అంటున్నారు. దీనిపై వాజేడు వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ పాప మరణానికి, వ్యాక్సిన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. జ్వరం, జలుబుతో ఉన్న పాపను మూడు రోజుల క్రితం తీసుకురాగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించామని ఆయన తెలిపారు. జ్వరం ఉంటే వ్యాక్సిన్ వేయటం కుదరదని, పాప మృతికి వ్యాక్సిన్ వేయక పోవడం కారణం కాదని చెప్పారు.

మామునూరు విమానాశ్రయానికి కాకతీయుల పేరు పెట్టాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మామునూరు విమానాశ్రయానికి కాకతీయుల పేరు పెట్టాలని, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌గా అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓరుగల్లు ప్రాంతాన్ని 400 ఏళ్ల పాలించి అభివృద్ధిలో ప్రజలపై చెరగని ముద్ర వేసిన కాకతీయుల పాలన ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. దశాబ్దాల నిరీక్షణ తర్వాత మామునూరు విమానాశ్రయం ముందుకు కదలడం శుభ పరిణామమని తెలిపారు. స్వాతంత్ర్యం కంటే ముందే దేశంలోనే మామునూరు విమానాశ్రయం అతి పెద్దదని ఇతర రాష్ట్రాలకు విమానాశ్రయాలు లేనప్పుడే తెలంగాణ మామునూరు విమానాశ్రయం ఉందని పేర్కొన్నారు. డొమెస్టిక్ విమానాశ్రయం కాకుండా అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చి దిద్దాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండి విమానాశ్రయానికి రాజీవ్‌గాంధీ పేరు, రాహుల్‌గాంధీ పేరు పెట్టవద్దని ప్రకటనలో కోరారు.

గణితంలో శంకర జ్యోతికి డాక్టరేట్ ప్రదానం



కేయూ క్యాంపస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ మ్యాథ్స్ విభాగం పరిశోధకురాలు శంకర జ్యోతికి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఓయూ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శంకరజ్యోతి 'ఏ స్టడీ అన్ రెగ్యులర్ డోమినేషన్ ఇన్ లీటక్స్ గ్రాఫ్స్ ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి గ్రామానికి చెందిన శంకర జ్యోతి ఖమ్మంలోని ట్రైబల్ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. శంకర జ్యోతి పలు సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని విద్యను అభ్యసించారు.

మారథాన్‌లో గండ్ర జ్యోతి ప్రతిభ



సాధించిన మెడల్‌ను చూపిస్తున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి కృష్ణ కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జపాన్ దేశ రాజధాని టోక్యో లో జరిగిన 42 కిలో మీటర్ల మారథాన్ రన్‌లోబీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదివారం పాల్గొని ప్రతిభ కనబ రిచారు. ఈ రన్‌తో ఆమె ఆరు ప్రతిష్ఠాత్మక మారథాన్లను పూర్తి చేసు కున్నారు. ప్రపంచంలో ఉన్న ఆరు ప్రతిష్ఠాత్మక మారథాన్‌లలో టోక్యో ఒకటి. ఇది వరకే చికాగో, బోస్టన్, బెర్లిన్, న్యూయార్క్, లండర్ మారథాన్లలో పాల్గొన్నారు. ఆరో మారథాన్ అయిన టోక్యోలో జరిగిన రన్‌లో గండ్ర జ్యోతి పాల్గొని ఫినిషర్ మెడ ల్‌ను తన సొంతం చేసుకున్నారు.

ఆర్చరీ జాతీయ స్థాయి పోటీలకు అనయ ఎంపిక



కాంస్య పతకంతో అనయ

కాటారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విలు విద్య(ఆర్చరీ) పోటీల్లో భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికి చెందిన రామిళ్ల అనయ జాతీయ స్థాయికి ఎంపికైంది. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించింది. అనయను కోచ్‌లు శ్రీనివాస్, అభిషేక్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ తదితరులు అభినందించారు.



ఉగ్గంపల్లి–చిన్నగూడూరు మధ్య ఎండిపోయిన ఆకేరు వాగు

వట్టిపోయిన ఆకేరు

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ప్రవహించే ఆకేరులో నీరు ఇంకిపోయి రాళ్లు తేలగా రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆకేరు ఎండిపోవడంతో ఆ ప్రాంత భూగర్భ జలాలపై ప్రభావం చూపుతోంది.

వ్యవసాయ బావుల్లో తగ్గిన నీటి మట్టమే ఇందుకు నిదర్శనం. మండలంలోని చిన్నగూడూరు, మన్నెగూడెం, జయ్యారం, విస్సంపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల రైతులు ఆకేరుపై ఆధారపడి సూమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశారు. మరో నెల వరకు వరికి సాగునీరు అందాల్సి ఉంది. ఆకేరు ఎండిపోయి వేరే ప్రత్యామ్నాయం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మండే ఎండలు ఒక్కింత రైతులను కలవరపెడుతున్నాయి. ఆకేరుకు ఎస్సారెస్పీ జలాల జాడలేదని, దీని గురించి పట్టించుకునే వారే కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ పరేడ్

అలరించిన డీజే

- మగిసిన స్ప్రింగ్ స్ప్రీ » తిరుగుముఖం పట్టిన విద్యార్థులు
- మధురానుభూతులను మిగిల్చిన వసంతోత్సవం
- చివరి రోజు కొనసాగిన పలు ఈవెంట్లు
- నాటకానికి కొత్త అంకం దిద్దిన నుక్కడ్
- టీమ్ స్పిరిట్‌తో విజయవంతం

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025) ఆదివారంతో ముగిసింది. మూడో రోజు కూడా 20కి పైగా ఈవెంట్లు జరిగాయి. వీటిలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి విజేతలుగా నిలిచారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈవెంట్లు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ ఈవెంట్లు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి రోజున పలు కొత్త ఈవెంట్లు జరిగాయి. గతంలో జరిగిన ఈవెంట్లతో పాటు ఈ సారి కొత్తగా నిర్వహించిన ఈవెంట్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజేతలకు అప్పటికప్పుడే బహుమతులను ప్రదానం చేశారు.

నుక్కడ్

చివరి రోజు కళాశాల క్యాంపస్ ఆవరణలో ఆడిటోరియం ఎదురుగా విశాలమైన స్థలంలో నిర్వహించిన నుక్కడ్ (వీధి నాటకం) ఈ వసంతోత్సవానికే హైలైట్‌గా నిలిచింది. ప్రతీ సంవత్సరంలాగే ఈ సారి కూడా చివరి రోజు సాయంత్రం బహిరంగ ప్రదేశంలో నిర్వహించిన ఈ వీధి నాటకంలో సుమారు 50 మంది విద్యార్థులు ఏకరూప దుస్తులతో నటులుగా పాల్గొన్నారు. సమకాలీన సమాజంలోని సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని వాటిపై ప్రదర్శించిన ఈ వీధి నాటకం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

వారిని ఆలోచింప చేసింది. నుక్కడ్ ఒక వీధి నాటక ప్రదర్శన. దీనికి థియేటర్లు అవసరం లేదు. బహిరంగ ప్రదేశమే రంగ స్థలం. దీనికి


నిట్ క్యాంపస్ ఆవరణలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న వీధి నాటకం (నుక్కడ్)


నాటకాన్ని రికార్డు చేస్తున్న విద్యార్థిని

ప్రేక్షకులు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. మైక్రోఫోన్లు, స్పీకర్లు కూడా అవసరం లేదు. నటులు మేకప్ వేసుకోవలసిన అవసరమూ ఉండదు. నుక్కడ్‌లో పాల్గొనే నటులు తమ సహజ స్వరూప స్వభావాలపై ఆధారపడి నటించాలి. యువతీ యువకులు, ఉత్సాహవంతులైన ప్రదర్శకులు తమ సందేశాన్ని తెలియచేయడానికి సంభాషణ, సంగీతం, నృత్యాల కలయికతో ప్రేక్షకులకు చెప్పదలుచుకున్న సందేశాన్ని సూటిగా, బలంగా చేరవేస్తారు. నుక్కడ రంగస్థల నాటకాలకు ఇది మరోరూపం. నిట్‌లో నిర్వహించిన నుక్కడ్‌ను వీక్షించేందుకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు నిర్వహించిన ఈ ఈవెంట్‌ను విద్యార్థులు తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేయడం కనిపించింది.

తళుక్కుమన్న తారలు

గ్రాండ్ ఫినాలేలో భాగంగా నిట్ ఆడిటోరియంలో రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన డిజేతో క్యాంపస్ దద్దరిల్లింది. సుప్రసిద్ధగాయకుడు నిఖిల్ డిసౌజ తన అద్భుతమైన సంగీతంతో శ్రోతలను మైమరిపించారు. డిసౌజ పాటలు విద్యార్థులను ఊర్రూతలూగించింది. పాటలకు అనుగుణంగా వారు స్టెప్పులు వేశారు. ఆనందంతో కేరింతలు కొట్టారు. కార్యక్రమం జరుగుతున్నంత సేపు స్టేడియం జిగేల్‌మనే రంగురంగుల విద్యుదీపాలతో సందడిగా మారింది. కొత్త సంగీత ప్రపంచాన్ని ఆవిష్కరించింది.

ఫ్యాషన్ షో

చివరి రోజు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్న మరో ఈవెంట్ ఫ్యాషన్ షో. అల్యూర్ పేరుతో రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన ఈ ఈవెంట్‌లో విద్యార్థులు వివిధ రకాల మోడ్రన్ దుస్తులను ధరించి ఈ షోలో పాల్గొన్నారు. యువతీ యువకులు సోలోగాను, జంటలుగానూ ఫ్యాషన్ దుస్తులతో కనువిందు చేశారు. ఒక కొత్త ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆవిష్కరించారు. 50 మందికిపైగా యువతీ యువకులు ఇందులో పాల్గొన్నారు. సరికొత్త ఫ్యాషన్స్ ఆవిష్కరించారు.

సంగీతోత్సవం

సంగీతోత్సవంలో భాగంగా నిర్వహించిన సింగింగ్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్ ఈవెంట్లలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంగీతోత్సవంలో తబలా, గిటార్, పియానో వంటి వాయిద్యాలతో విద్యార్థులు తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. సోలో ఐడల్‌లో స్ప్రింగ్ స్ప్రీ సిగ్నేచర్ ఈవెంట్‌లో భాగంగా విద్యార్థులు ర్యాప్ పాటలతో శ్రోతలను అలరించారు.





తిరుగు ముఖం

వసంతోత్సవంలో మూడు రోజుల పాటు పాల్గొన్న దేశంలోని వివిధ ఎన్ఐటీలకు చెందిన విద్యార్థులు సాయంత్రం తిరుగుముఖం పట్టారు. మూడు రోజుల పాటు జరిగిన వివిధ ఈవెంట్లలో పాల్గొన్న వీరు మధురజ్ఞాపకాలు, అనుభూతులను మూటగట్టుకొని తోటి విద్యార్థులకు వీడలేమంటూ, వీడిపోమంటూ భావోద్వేగాలతో వీడ్కోలు పలికారు. తిరిగి వెళుతున్న క్రమంలో మూడు రోజులు తమతో కలిసి ఉన్న, ఈవెంట్లతో పోటీ పడిన, ఆట పాటలతో సందడిగా గడిపిన తోటి విద్యార్థులను ఆలింగనం చేసుకొని , సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లను తీసుకున్నారు. వచ్చే సంవత్సరం మళ్లీ కలుద్దామంటూ పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు.



బ్లిట్జ్ బుల్లెట్‌లో విద్యార్థులు పోటీ

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) :వరంగల్ నిట్‌లో వసంత్సోవం ముగింపు రోజైన ఆదివారం కూడా వివిధ ఈవెంట్లు కొనసాగాయి. ఇందులో బిట్జ్ బుల్లెట్ ఈవెంట్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక విధంగా చదరంగం ఆటనే. చెస్ చాలెంజ్. మేధోబలపరీక్ష. శీఘ్ర నిర్ణయాలతో ఆటగాళ్లు ఈ చెస్ పోటీలో ప్రతిభను చూపారు. ఎవరు ఎంత త్వరగా నిర్ణయాలను తీసుకోవడం ద్వారా ప్రత్యర్థికి చెక్ పెడతారో వారే విజేత. పోలరాయిడ్ ఫోటోగ్రఫీ ఈవెంట్‌లో పాల్గొన్నవారు తక్షణమే అందించబడిన పోలరాయిడ్ ఫోటోల ద్వారా తమ జ్ఞాపకాలను సజీవంగా దాచుకునే అవకాశం పొందారు. స్ట్రీట్ ఫోటోగ్రఫీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు కేవలం 15 నిమిషాల్లో వీధి జీవితం, సంస్కృతిని గుణాత్మకంగా ఫొటోల్లో బంధించి ఫ్రేమ్ ఆఫ్ ఫ్రేమ్‌లో ప్రదర్శించారు. క్యూఫ్యాక్టర్ క్విజ్‌ను వరంగల్ ఎన్ఐటీ పూర్వ విద్యార్థి ఆబాస్ దాస్ గుప్తా నిర్వహించారు. చరిత్ర, క్రీడలు, పాప్ కల్చర్ తదితర విభాగాల్లో అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలతో ఉత్కంఠంగా సాగింది, ప్లింకో బోర్డు గేమ్ ఆఫ్ స్కిల్ అండ్ లక్ ఈవెంట్‌లో ఆటగాళ్లు గరిష్ఠ స్కోర్ కోసం ప్రయత్నించారు. వాట్స్ ఇన్ ది బాక్స్ ఈవెంట్‌లో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని స్పర్శతోనే వస్తువులను గుర్తించి నవ్వులు పూయించారు. పిక్చర్ పజిల్ ఈవెంట్‌లో వైద్యరంగానికి సంబంధించిన చిత్రాలను సరైన విధంగా అమర్చడం ద్వారా విజేతలుగా పోటీలో నిలిచారు.


బ్లిట్జ్ బుల్లెట్-చెస్ చాలెంజ్‌లో పోటీ పడుతున్న విద్యార్థులు



విభిన్న కళ.. భళా

- డిజిటల్‌కు దీటుగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్
- ఇండ్లు, గోడలపై ప్రకృతి అందాల చిత్రీకరణ
- క్రియేటీవ్ ఆర్టిస్టుగా రాణిస్తున్న సాంబమూర్తి

హనుమకొండ చౌరస్తా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 'కుక్కపిల్ల.. అగిపుల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం' అన్న చందంగా ఎంచుకున్న రంగంపై ఆసక్తికి కృషి తోడైతే రాణించే అవకాశం ఉంటుందనేది నిరూపించారు హనుమకొండకు చెందిన ఫ్యాబ్రిక్ చిత్రకారుడు ఆవునూరి సాంబమూర్తి. విభిన్న ఆలోచనలతో ప్రయోగాలు చేస్తుంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందనడానికి ఆయనే ఓ నిదర్శనం. పెరిగిన డిజిటల్ వినియోగంతో చిత్రకారులు ఆదరణ కోల్పోతున్నారు. ఒకప్పుడు ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల ప్రచారం కోసం పేర్లు, బొమ్మలను వేయడంలో బిజీగా ఉండే చిత్రకారులను ఫ్లెక్సీ, ఇతర ప్రింటింగ్‌లు తీరని విధంగా దెబ్బతీశాయి. ఈ క్రమంలో మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పడుతూ చిత్రకళా రంగంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాడు ఫ్యాబ్రిక్ చిత్రకారుడు సాంబమూర్తి. షాలివాహన (కుమ్మరి) కులానికి చెందిన ఆయన తమ కుల వృత్తిని ఎంచుకుని కుండలు చేసే సందర్భంలో తన వాళ్లలా కాకుండా ఏదైన ప్రత్యేకత చూపాలన్న సంకల్పంతో చిత్ర కళలపట్ల వచ్చిన ఆలోచనను అమల్లోకి తెచ్చారాయన. చదివింది పదో తరగతి అయినా ఏదైనా సాధించాలనే పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యన్ని చేరుకోవచ్చని, ఆర్థిక పరిస్థితుల వలన చదవును మధ్యలోనే ఆపేసి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనే నిశ్చయంతో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (మందమైన వస్త్రాలపై బొమ్మలు వేయడం)ను ఎంచుకున్నారు. పలు చిత్రాలను గీస్తూ అందరి మన్ననలు పొందుతూ చిత్రకళకు ఎప్పుడు ఆదరణ ఉందని నిరూపిస్తున్నారు. ప్రస్తుత సమాజానికి అవసరమయ్యే రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నాడు. కాలుష్యం వెదజల్లే ఫ్లెక్సీల కన్నా తాను రూపొందించిన చిత్రాలతో పర్యావరణానికి ఎలాంటి విఘాతం ఉండదని చెబుతున్నారు. పెళ్లిళ్ల, శుభకార్యాల్లో కావల్సిన అలంకరణలు, అద్భుతాలను తన చిత్రకళలతో వీక్షకులను కట్టిపడేలా రూపొందిస్తున్నారు. చిత్రకళనే వృత్తిగా మలుచుకొని పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుసున్న సాంబమూర్తి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ఫ్యాబ్రిక్స్ పెయింటింగ్‌తో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ విభిన్న కోణాల్లో తన ప్రతిభతో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్, విశ్వవ్యాప్తంగా ఉన్న జీవప్రాణిని కాపాడటం, హింస్మాతక, శాంతియుత బోధనలు, భారతదేశం అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉందనే చిత్రాలను రూపొందించారు. ఇవే కాకుండా కొబ్బరి బొండాలపై నూతన వధువరుల చిత్రాలు, రావి ఆకులపై దేవతామూర్తుల చిత్రాలను గీస్తూ కళకు జీవం పోస్తున్నారు. వివాహ శుభ కార్యాల్లోనూ థర్మకోల్ షీట్ల పై బొమ్మలు వేసి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయడం నుంచి వేదికపై రకరకాల పూల ఆకృతులను సొంతంగా తయారు చేసి అలంకరించడంలో తానకు తానే సాటిగా నిలుస్తున్నారు సాంబమూర్తి.

చిత్రకళాకారులకు ఆదరణ అంతంత మాత్రమే..

ఆవునూరి సాంబమూర్తి, ఫ్యాబ్రిక్స్ చిత్రకారుడు




కంప్యూటర్ యుగంలో చిత్రకళాకారులకు ఆదరణ అంతంత మాత్రమే అయింది. నా చిన్నతనంలో మా నాన్న కుల వృత్తిగా కుండలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్న సమయంలో నాకు ఇందులోనే ఏదైనా ప్రత్యేకత సాధించాలన్న సంకల్పం కలిగింది. అలా మొదలైన ఆలోచనే నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటూ చిత్రాలు గీస్తూ ఉపాధి పొందుతున్నా. రాష్ట్ర ప్రభుత్వం నా లాంటి చిత్రకారులను ప్రోత్సహించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టిస్తాం.

చిత్రకళలో సాంబమూర్తి ప్రస్థానం

వరంగల్‌లోని సీహెచ్ భద్రయ్య ఆర్ట్స్ సంస్థలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ పొందిన సాంబమూర్తి వాటర్ పెయింటింగ్ అకరెల్ కలర్స్‌తో బొమ్మలు వేయడంలో ఓనమాలు నేర్చుకొని రాజకీయ నాయకుల, ఎన్నికల ప్రచార పత్రాలు, గోడలపై రాతలను రాస్తూ పలువురి మన్ననలు అందుకున్నాడు. 1996లో తాను వేసిన చిత్రాలను ప్రదర్శనకు పెట్టగా అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు దివంగత డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ప్రశంసించారు. అలాగే 2012లో లలిత కళా పరిషత్ అఖిల భారత చిత్ర కళా ప్రదర్శనలో తన ప్రతిభను ప్రదర్శించారు.







సాంబమూర్తి కుంచె నుంచి జాలువారిన కళా ఖండాలు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

» నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు » అర్ధరాత్రి తేలనున్న విజేత ఫలితం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాల బావి (స్టేట్ వేర్ హౌస్ గోదాం)లోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిర్వహించనున్నారు. లెక్కింపు కేంద్రంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 25,797 ఓట్లకు గాను 24,139 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొత్తం ఓట్లలో 50 శాతానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో విజేతలను నిర్ణయించే పరిస్థితులు లేవనే చెప్పాలి. దీంతో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాతనే అభ్యర్థుల జయాపజయాలు తేలే అవకాశం ఉంది. అయితే నల్గొండ-వరంగల్-ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీ పడగా ప్రధానంగా అయిదుగురు అభ్యర్థుల మధ్యనే పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిల మధ్యనే ప్రధాన పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. కౌంటింగ్ ప్రక్రియలో 25 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. 8 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయనునట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం వరకు కొనసాగే అవకాశం ఉంది.


నల్లగొండలో టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

అభ్యర్థి భవితవ్యం తేలేది అర్ధరాత్రికే

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సాయంత్రం 6 గంటల వరకు మొదటి ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపు కొనసాగే అవకాశం ఉంది. ఇక మొదటి ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపులో భవితవ్యం తేలే పరిస్థితులు దాదాపుగా లేవనే చెప్పాలి. ఆ తర్వాత ప్రారంభమయ్యే రెండవ ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది. రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతనే విజేతను ప్రకటించే అవకాశం ఉంది. అర్ధరాత్రి తర్వాతే టీచర్స్ ఎమ్మెల్సీ విజేత ఎవరనేది తేలనుంది. ఒక వేల రెండవ ప్రాధాన్యతలో కూడా తేలకపోతే మూడవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఓరుగల్లు ఓట్లే కీలకం

ఎన్నికల ఫలితాల్లో విజేతను నిర్ణయించే ఓట్లలో ఓరుగల్లు ఓట్లే కీలకం కానున్నాయి. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజేతనే నిర్ణయించేది ఉమ్మడి వరంగల్ జిల్లా ఓట్లే అంటున్నాయి ఉపాధ్యాయ వర్గాలు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలైన 10,401 ఓట్లే కీలకం కానున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ వర్గాలతో పాటు అభ్యర్థులు అదే లెక్కల్లో మునిగితేలుతున్నారు. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ప్రధానపోటీదారులకు దాదాపుగా సమానంగా ఓట్లు పోలయ్యే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలైన ఓట్లలో మొదటి ప్రాధాన్యత, రెండవ ప్రాధాన్యత ఓట్లతో స్పష్టమైన ఆధిక్యత వచ్చే అభ్యర్థే గెలుపు తీరాలకు చేరుతారని వారు విశ్లేషిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ

ఎవరికి వారు గెలుపు ధీమాలో ఉన్న అయిదుగురు అభ్యర్థులు తెల్లవారితే తేలే వారి భవిత్యంపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వారు వారి అనుయాయులతో నల్గొండలో మకాం వేశారు. లెక్కింపు సరళిపై వారు మల్లగుల్లాలు పడుతున్నారు. రెండవ ప్రాధా న్యత ఓట్లు భారీగానే వచ్చినా, మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎలిమినేట్ అయితే పరిస్థితి ఏంటని వారు మదన పడుతున్నారు.

కోతుల పంచాయతీ!

(5వ పేజీ తరువాయి)

అంచనా. ప్రతి ఆడకోతి తన జీవితకాలంలో కనీసం పది పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. దీంతో రోజు రోజుకు కోతుల సంతతితో వాటి బెడద పెరిగి పోతుండటంతో గత ప్రభుత్వం నిర్మల్ జిల్లాల్లో 2020 డిసెంబరు 20న మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి లోబడి ఈ సెంటర్‌లో కోతులకు సంతాన ఉత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. అయితే వరంగల్ నుంచి నిర్మల్‌లోని సెంటర్‌కు కోతులను పట్టుకుని తీసుకెళ్లటం ఆర్థిక భారంగా మారింది.

ఊళ్లల్లో కోతుల భయం ఉన్నప్పటికి వాటిని పట్టుకునేందుకు పంచాయతీల వద్ద నిధుల కొరత వెంటాడుతోంది. ఒక్క కోతిని పట్టాలంటే మంకీ క్యాచర్లకు సుమారు రూ.వెయ్యి ఖర్చవుతుంది. ఇలా వంద కోతులను పట్టుకోవాలంటే రూ. లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే నిధులు లేక నీరసించి పోతున్న పంచాయతీలకు కోతుల నియంత్రణ కష్టంగా మారుతోంది. పైగా రాష్ట్రం మొత్తం మీద ఒక్క నిర్మల్ జిల్లా కేంద్రంలోనే మంకీ రెస్క్యూ సెంటర్ ఉండటంతో అక్కడి దూర ప్రాంతాల నుంచి కోతులను తీసుకెళ్లడం ఆర్థికంగా భారమవుతోంది. ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీగా అడవులతో పాటు కోతులు ఉన్నాయి.


వరంగల్‌లో మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే.. కోతుల్లో సంతానోత్పత్తి తగ్గించేందుకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేంద్రంలో ప్రతీ నెల కనీసం 500ల నుంచి 600 కోతులకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. దీంతో చాలా వరకు కోతుల సంతానోత్పత్తిని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే మంకీ ఫుడ్ కోర్టులను కూడా విరివిగా పెంచి, అడవుల్లోనే వాటికి ఆహారం, ఆశ్రయం లభించేలా ప్రభుత్వం అటవీశాఖతో కలిసి ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.


లోకల్ ఎన్నికల్లో కోతులే ప్రధాన ఎజెండా?

కోతుల సమస్యను ప్రజలు చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు, అధికారులు ఎవరు ఊరికి వెళ్లిన కోతుల సమస్యనే ప్రధానంగా ఏకరువుపెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కోతుల సమస్యనే ప్రధాన అంశంగా ప్రస్తావించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతల ఎజెండాను ప్రజలు తెరపైకి తెస్తున్నారు. 2019లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో కోతులు బెడద తీవ్రంగా ఉండేది. సర్పంచ్ ఎన్నికల ముందు గ్రామంలోని ఆర్టీసీ డ్రైవర్ దుడల సంపత్ కోతుల సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత ఆయన తన భార్య ప్రమీలను పోటీలో పెట్టగా.. ఆమెను గ్రామస్థులు 300ఓట్లకు పైగా మెజార్టీతో గెలిపించారు. సంపత్ ఉదాంతాన్నే ఉదాహరణగా తీసుకుని వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిఉన్నవారిని కోతుల సమస్యల పరిష్కరించాలనే దిశగా ప్రజల నుంచి ఒత్తిళ్ల పెరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనల్లో కొన్ని..

గతేడాది ఫిబ్రవరిలో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడురు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఆంగోతు సిరి(65), కిరణ్(35) పంట పొలాలకు కోతులు రాకుండా రక్షణగా విద్యుత్ తీగలు పెట్టారు. ప్రమాదవశాత్తు రక్షణ తీగలకే తగిలి విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన బానోతు వెంకన్న తన వ్యవసాయ భూమిలో వేసిన మొక్కజొన్నను కోతుల బెడద నుంచి కాపాడేందుకు తన భార్య సునితతో కలిసి చెను వద్దకు వెళ్లారు. కోతుల గుంపును చెను నుంచి బయటకు తరుముతున్న క్రమంలో కాలుజారి ప్రమాదవశత్తు బావిలో పడి వెంకన్న మృతి చెందాడు. ఫిబ్రవరి 12న పెద్దవంగర మండల కేంద్రంలో కోతుల బెడద నుంచి మొక్కజొన్నకు రక్షణ కల్పించేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ఇది గమనించకుండా వెళ్లిన గీతకార్మికుడు అనపురం వెంకన్న విద్యుత్ తీగకు తగిలి షాక్‌గురై మృతి చెందారు. ఫిబ్రవరి 18వ తేదీన వరంగల్ నగరంలోని 34వ డివిజన్‌లో పారిశుద్య కార్మికురాలు గన్నారాపు తేజపై కోతులు దాడి చేయగా, పరుగెత్తే క్రమంలో కింద పడటంతో తీవ్ర గాయాలతో పాటు ఎడమ చెయ్యి విరిగింది. వీటితో పాటు చిట్యాల మండలంలో ఒడితల, గోపాలపురంలో 25మందికి పైగా కోతులు దాడి చేశాయి. కొడకండ్ల మండలంలో బీసీ హాస్టల్ స్వీపర్ ఉమపై, ఐనవోలు మండలం కేంద్రానికి చెందిన అగపాటి వెంకటలక్ష్మిపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట, కేసముద్రం మండలాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది.


పంట నుంచి కోతులను తరిమే క్రమంలో బావిలో పడి మృతి చెందిన వెంకన్న (ఫైల్)


గారెపల్లిలో ఇటీవల కోతుల దాడిలో గాయపడిన చిన్నారి ఎస్‌కే నిహద్


కోతుల దాడిలో గాయపడిన ఉమ

నేడు ఎర్రగట్టు జాతర వేలం పాటలు

హసన్‌పర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి-భీమారం గ్రామాల ఉమ్మడి ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర వేలం పాటలు సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.వెంకట్రావ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పర్వదినం 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 5 రోజుల పాటు నిర్వహించే జాతర ఉత్సవాలలో టెండరు కాల పరిమితి ఉంటుందని తెలిపారు. ఈ బహిరంగ టెండర్‌లో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర, ప్రసాదాలు విక్రయించేందుకు, రంగుల రాట్నం నిర్వహించడానికి హక్కులు కల్పించేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటుకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, మిగిలినవి ఒక్కొక్కరు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొని జాతర విజయవంతానికి సహకరించాలని కార్యనిర్వహణ అధికారి తెలిపారు.

భవానీనగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాంరెడ్డి

వడ్డెపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని భవానీనగర్ అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురిజపల్లి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గుండు రాజులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ పాలక వర్గం మూడు సంవత్సరాలు పని చేస్తుందని ఎన్నికల అధికారులు ప్రొఫెసర్ రాంరెడ్డి, మంత్రి సతీష్ తెలిపారు.

టీఎన్‌జీవో అధ్యక్షుడికి సన్మానం



ఆకుల రాజేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ మినిస్టీరియల్ ఫోరం ఎన్నిక చేసిన సందర్భంగా టీఎన్‌జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యాశాఖ కేంద్రం ఫోరం హనుమకొండ జిల్లాకు ఇచ్చిన గుర్తింపును ఆయన అభినందించి, టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.హుస్సేనీ ముజీబ్‌లకు పాఠశాల విద్యాశాఖ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఆర్.రాజ్ కుమార్, ఫక్రుద్దీన్ అహ్మద్, ప్రధానకార్యదర్శి కె.పవన్, కోశాధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తోనే విద్యార్థుల్లో సేవాభావం

• సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి



రైస్ బ్యాగ్ చాలెంజ్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థినులు

హసన్‌పర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్ఎస్‌తోనే విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుందని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మహేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రైస్ బ్యాగ్ చాలెంజ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులకు సామాజిక బాధ్యతను తెలియజేసేందుకు రైస్ బ్యాగ్ చాలెంజ్‌ను తీసుకున్నామని తెలిపారు. కళాశాలలోని వివిధ విభాగాలలో చదువుతున్న విద్యార్థినుల నుంచి 5క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. సేకరించిన బియ్యాన్ని సుజాత అతిథి మెంటల్లీ డిసార్డర్ ఆర్గనైజేషన్, మల్లికాంబ మనోవికాస కేంద్రం అంధ విద్యార్థుల ట్రస్టులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.శశికుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ సభ్యులు రవికిరణ్, కోటేశ్వర్, చిరంజీవి, విద్యార్థి సమన్వయకర్త రష్మిత, సంజతన, అక్షిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ సిటీ కోసం కసరత్తు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యం
- అహర్నిశలు కృషి చేస్తున్న బల్దియా అధికారులు
- గతేడాది రాష్ట్రంలో 5, జాతీయస్థాయిలో 101వ స్థానం
- ఈ సారి స్థాయి పెంచేందుకు కృషి
- ఇందుకు నగర పౌరులు స్పందించాలి
- ఆన్‌లైన్‌లో సానుకూలంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి
- ఈ నెలాఖరు వరకు అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మునిసిపల్ కార్పొరేషన్లు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. యేటా జూన్ నుంచి మే నెల వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో మునిసిపాలిటీలు పోటీ పడతాయి. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కూడా బరిలో ఉంటుంది. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ గతంలో మెరుగైన ర్యాంకు సాధించినప్పటికీ ఈసారి ఇంకా ఫలితాలు సాధించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే అధికారులు, సిబ్బంది, కార్మికులు అహర్నిషలు కృషి చేస్తున్నారు. 2023-24లో బల్దియాకు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు రాగా, జాతీయస్థాయిలో 101వ ర్యాంకు వచ్చిందని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్, సిద్దిపేట, నిజామాబాద్, గుండ్ల పోచంపల్లి మొదటి నాలుగు స్థానాల్లో నిలువగా వరంగల్ ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఈసారి 2024-25 సంవత్సరానికి గాను వరంగల్‌ను చెత్తరహిత నగరంగా మార్చి ఇంకా మెరుగైన ర్యాంకు సాధిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

• ర్యాంకు రావాలంటే ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు రావాలంటే జూన్ నుంచి మే నెల వరకు నగర పౌరులు మూడు విడతలుగా ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం విద్యావంతులు, విద్యార్థులు, మహిళా సంఘాలు సభ్యులు స్పందించి నగర ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాలయాలపై ఆన్‌లైన్‌లో ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ఇలా ప్రతీ నగరం నుంచి 15 శాతం కంటే పై ర్యాంకు వచ్చిన నగరాలను పరిగణలోకి తీసుకుంటారు. అయితే ఇప్పటికే వరంగల్‌కు జాతీయస్థాయిలో ఫీడ్‌బ్యాక్‌లో 4వ స్థానం వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ ఇంకా ఈ నెల 30 వరకు ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈలోపు నగర పౌరులు స్పందించి అనుకూలంగా ఫీడ్‌బ్యాక్ ఇస్తే.. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ ఎస్‌బీఎం (స్వచ్ఛభారత్ మిషన్) ప్రతినిధులు నగరంలో పర్యటించి రహస్యంగా సమాచారం సేకరిస్తారు. అపుడు వరంగల్ బల్దియా 2024-25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



• స్వచ్ఛ అవార్డుకు మార్కులు ఈ విధంగా..

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు కేంద్ర ప్రభుత్వం 12,500 మార్కులను కేటాయించింది. పరిశుభ్రత, వ్యర్థాల విభజన, సేకరణ, రవాణా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య ప్రాధాన్యత, నీటి నిర్వహణ, డెలర్జింగ్ సేవల యాంత్రీకరణ, క్రమశిక్షణతో స్వచ్ఛత కార్యక్రమాలు, పర్యావరణ వ్యవస్థ బలోపేతం, సంస్థాగత పరిమితులు, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలు, ఫిర్యాదుల స్వీకరణ ఇలా మొత్తం కలుపుకుని 10 వేల మార్కులను కేటాయించగా గార్బేజ్ ఫ్రీ సిటీ, వంద శాతం మంచి నీటి నిర్వహణకు 2500 మార్కులు కేటాయించింది. కాగా ఈ విషయంలో ఇప్పటికే బల్దియా అధికారులు ప్రజలకు అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. గూగుల్‌లోకి వెళ్లి స్వచ్ఛతా యాప్ లేదా మై సిటీ యాప్ ద్వారా sbmurban.orgని టైప్ చేసి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇంకా బల్దియాకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను సైతం ఫీడ్ బ్యాక్ కోసం ఆన్‌లైన్‌లో ఉంచారు.

• ఈసారి ర్యాంకు మెరుగుపడాలి..

గతంలో వరంగల్‌కు రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 101వ ర్యాంకు వచ్చింది. అదేవిధంగా చెత్త సేకరణకు 99 శాతం, వ్యర్థాల ఉత్పత్తి, ప్రాసెసింగ్‌కు 51 శాతం, తడి, పొడి చెత్త విభజనకు 97 శాతం, నివాస ప్రాంతాల పరిశుభ్రతకు 100 శాతం, మార్కెట్ల పరిశుభ్రతకు 100 శాతం, నీటి శుద్ధి, సరఫరాకు 100 శాతం, చెత్త సేకరణకు 97 శాతం మార్కులు లభించాయి. కాగా 3 కోట్ల నుంచి 10 కోట్ల జనాభా కలిగిన కార్పొరేషన్ల పరిధిలో ఈ యేడు ప్రథమ ర్యాంకు సాధిస్తే నగర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి సాధారణ నిధులతో పాటు మరో రూ.300 కోట్లు అదనంగా వస్తాయి. వాటితో నగరంలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు చెత్త శుద్ధీకరణ యంత్రాలు, పార్కుల అభివృద్ధి చేయవచ్చని బల్దియా అధికారులు అభిప్రాయపడుతున్నారు. యేటా జాతీయ స్థాయిలో ముందంజలో ఉంటున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్, కలకత్తా, ముంబై నగరాల సరసన వరంగల్ చేరాలంటే సిటిజన్ ఫీడ్ బ్యాక్ తప్పని సరి అని అధికారులు చెబుతున్నారు.

నగర ప్రజలు సహకరిస్తే ర్యాంకు సాధ్యం..

- డాక్టర్ రాజారెడ్డి, బల్దియా చీఫ్ మెడికల్ ఆఫీసర్



గతంలో కంటే ప్రస్తుతం వరంగల్ నగరం హైదరాబాద్‌కు దీటుగా దూసుకుపోతోంది. ఇప్పటికే నగర ప్రజలు ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో జాతీయస్థాయిలో 4వ స్థానంలో ఉన్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నగరం మరింత అభివృద్ధి చెందాలన్నా.. మరిన్ని నిధులు రావాలన్నా..నగర ప్రజలకు విధిగా తమ సేవలపై ఆన్‌లైన్‌లో సానుకూల స్పందన తెలియజేయాలి.

డంపింగ్ యార్డ్‌ను తరలించే వరకు పోరుబాటే

» డంపింగ్ యార్డ్ నిర్మూలన అడ్‌హక్ కమిటీ

మడికొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మడికొండ నుంచి డంపింగ్ యార్డ్‌ను తరలించే వరకు పోరు తప్పదని డంపింగ్ యార్డ్ నిర్మూలన అడ్‌హక్ కమిటీ పేర్కొంది. ఆదివారం మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డంపింగ్ యార్డ్ నిర్మూలన అడ్‌హక్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను కమిటీ సభ్యులు చేశారు. మహిళా సంఘాలను డంపింగ్ యార్డ్ నిర్మూలన ఉద్యమంలో మహిళా సంఘాలతో పాటు ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని తీర్మానించారు. గ్రామంలో వాడవాడల రణభేరి మోగించి ప్రజలను డంపింగ్ యార్డ్ సమస్యలపై ఉత్పన్నమయ్యే విషయాలపై చైతన్యం చేయాలని కమిటీ పేర్కొంది. వాణిజ్య, పాఠశాలలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఒక రోజు బంద్ పాటించి నిరసన తెలపాలని, ఒక రోజు గ్రామంలో వంటా వార్పు చేపట్టాలని, పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో కమిటీ ప్రతినిధి బృందం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

కాలనీల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

బాలసముద్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సీతారాంరెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజా పాలనలో కాలనీల అభివృద్ధికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని బాలసముద్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎన్.సీతారాంరెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలో పలు కాలనీలలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లను కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి సీతారాంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ బాలసముద్రం కాలనీ 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గెలిచిన వెంటనే కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అభివృద్ధి కమిటీ కోరడంతో నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి అభివృద్ధి కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికాంత్, ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నారాయణసింగ్, నందన్‌నాయక్, ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



బాలసముద్రంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న సభ్యులు

దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళి

వరంగల్ క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలను ఆదివారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి సీపీ అంబర్ కిషోర్ ఝా పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు డేవిడ్‌రాజు, జితేందర్‌రెడ్డి, నాగయ్య, సురేంద్ర బాబు, ఆర్ఐలు, ఇన్‌స్పెక్టర్స్, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

• హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై.వీ.గణేష్, ఇతర ప్రభుత్వ అధికారులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

• ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం వరంగల్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఇతర ప్రభుత్వ అధికారులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కమిషనరేట్‌లో శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ

రెంటాల కేశవరెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కేశవరెడ్డి

న్యూశాయంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినందుకు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్‌లో చేసినటువంటి అవగాహన కార్యక్రమాలకు గాను త్రినగరి అపార్ట్ మెంట్స్ వెల్ఫేర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డికి కేంబ్రిడ్జి యూనివర్సిటీ (లండన్) వారు డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఈ మేరకు కేశవరెడ్డి ఢిల్లీలో ఇంటర్నేషనల్ కన్ఫర్మెంట్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ రైట్స్ నేషనల్ ఛైర్మన్ రామానుజస్వామి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా మాజీ ఛైర్మన్ మర్రి యాదవరెడ్డిలు కేవశవరెడ్డికి అభినందనలు తెలిపారు.

అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు



పెంబర్తిలో ముగ్గుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి

హసన్‌పర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సిద్దార్థ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఏఈ నరెందర్, ఏపీఓ విజలయలక్ష్మి, మాజీ సర్పంచ్ జోరుక పూల, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, రమేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ, ఏపీ సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాజీపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం నిర్మాణానికి అనుమతులు ఇచ్చినందుకు గాను ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కాజీపేట టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం అనంతరం ఆయన మాట్లాడారు.

విమానాశ్రయం పనులు వెంటనే చేపట్టి సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసేందుకు ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పూర్తి సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాలమల మహేందర్, సరస్వతి, రాఘవ, సమ్మయ్య, వినయ్, అబ్బా, బీజేపీ నాయకులు మద్దెల కార్తీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వరంగల్ క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు సీఐ వైసతీష్ తెలిపారు. బక్కచిక్కి అచేతన స్థితిలో మృతిచెందాడని, మృతదేహాన్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మడికొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం మడికొండ నుంచి రాంపూర్ వైపు వెళ్తున్న ఆటోను స్థానిక పోలీసుస్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నష్కల్ గ్రామానికి చెందిన కన్నెగంటి అఖిల్, కన్నెగంటి రాజుతోపాటు ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆటో పాక్షికంగా దెబ్బతిన్నది. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.



ఆటోను ఢీకొన్న కారు

మానవ హక్కులకు భంగం కలిగితే అండగా ఉంటాం

» ఎన్‌హెచ్ఆర్‌సీ(ఎన్జీవో) జాతీయ చైర్మన్ శ్రీనువాసరావు

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా లాభాపేక్ష లేకండా అండగా ఉంటామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్జీవో) జాతీయ చైర్మన్ అయిలినేని శ్రీనువాసరావు అన్నారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనువాస్ ఆధ్వర్యంలో హనుమకొండ నయింనగర్‌లోని మోషన్ కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనువాస్‌రావు మాట్లాడుతూ మానవ హక్కులతో పాటు పర్యావరణానికి ఎలాంటి నష్టం జరిగినా నిస్వార్థంగా పని చేయడం జరుగుతుందన్నారు. అన్యాయం జరిగిన చోట తమ సభ్యులు వెళ్లి బాధితులకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా ఉండి సేవలు అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారన్నారు. బురదజల్లే ప్రయత్నం చేస్తోన్న వ్యక్తులను పట్టించుకోకుండా నిస్వార్థంగా ముందుకెళ్తేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని సభ్యులకు పిలుపునిచ్చారు.ప్రభుత్వం వెంటనే మానవ హక్కుల కమిషన్ చైర్మన్లు, లోకాయుక్త చైర్మన్లను నియమించి ప్రజలకు వెంటనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ నక్కా గంగారం, ప్రధాన కార్యదర్శి నాగరాజు చౌహాన్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పరకాల సమ్మయ్య, ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ప్రశాంత్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మటూరి రవీందర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూశంకర్, మహిళా అధ్యక్షురాలు పాత రాణి, వరంగల్ జిల్లా మహిళా కార్యదర్శి బండి విజయ, కోడూరి శ్రీదేవి, తొట్టి మంజుల, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు బేతి విశ్వబంధు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రవి, జిల్లా కార్యదర్శి గాదగొని భిక్షపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయిలినేని శ్రీనువాస్‌రావు

లైబ్రరీ సైన్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

• కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : లైబ్రరీ సైన్స్ కోర్సులతో విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోదించారు. ఆదివారం కేయూ దూరవిద్య కేంద్రంలో బీఎల్ఎస్సీ కోర్సు విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ అధ్యక్షత జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ రంగంలో విశేషమైన ఉద్యోగ అవకాశాలున్నాయని అన్నారు. గ్రంథాలయ కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. లైబ్రరీ సైన్స్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎస్డీఎల్‌సీఈ కోర్సులను మరింత పటిష్ఠ పరుస్తామని పేర్కొన్నారు. ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్‌తో పాటు దూరవిద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు త్వరగ పరీక్షలు నిర్వహించి ఫలితాలు వచ్చేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణి, అధ్యాపకులు డాక్టర్ మోతుకూరి అంజయ్య, వి.కృష్ణమాచార్య, డాక్టర్ కె.ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ ఎం.నిరంజన్, డాక్టర్ వి. రామచంద్రమూర్తిలు మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.జగన్, కోర్స్ ఇన్‌చార్జ్ పబ్బ శ్రీనివాస్, నిర్వహాక విద్యార్థులు ఎ.జగన్‌మోహన్‌రావు, ఎం.డేనియల్, ఇ.రంజిత్, పి.ప్రవీణ్, జి.తిరుపతి, సీహెచ్.రాజేశ్, బి.నర్సింహ, వి.తిరుపతి, వై.నందిని, స్పందన తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

మట్టెవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం వరంగల్‌లోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. చికెన్, మటన్, చేపల వ్యాపారుల బాట్లను పరిశీలించారు. కొన్ని బాట్లకు స్టాంపింగ్, ఎలక్ట్రికల్ కాంటా మిషన్లకు రెన్యూవల్ లేకపోవడంతో ఐదుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.3వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి డి.అశోక్‌బాబు మాట్లాడుతూ.. వ్యాపారులు నిర్ణీత సమయంలో స్టాంపింగ్ చేయించుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ సిబ్బంది ప్రవీణ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



తూకం బాట్లను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి అశోక్‌బాబు

మజ్జిగతో ప్రయోజనాలెన్నో!

వేసవి కాలంలో తరచూ దాహంగా అనిపిస్తూ ఉంటుంది. ఇలాంటప్పుడు చల్లని మజ్జిగ తాగడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- ఒక గ్లాసు పలుచని మజ్జిగలో చిటికెడు ఉప్పు వేసుకుని తాగితే శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. వడదెబ్బ తగలదు. జీర్ణాశయ సమస్యలు రావు.
- ఒక గ్లాసు మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి కలుపుకుని తాగితే జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పొట్టలో గ్యాస్ సమస్యలు రావు.
- ఒక కప్పు పెరుగులో ఒకటిన్నర కప్పుల నీళ్లు, అరచెంచా జీలకర్ర పొడి, అర చెంచా అల్లం తరుగు, చిటికెడు ఉప్పు, ఒక చెంచా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి పావుగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ మసాలా మజ్జిగను మధ్యాహ్న సమయంలో తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎండ వేడి వల్ల వచ్చే తలనొప్పి తగ్గుతుంది. మలబద్ధకం రాదు.



- ఒక గ్లాసు మజ్జిగలో పావు చెంచా మిరియాల పొడి, పావు చెంచా శొంఠి పొడి వేసుకుని తాగితే కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.
- తరచూ మజ్జిగ తాగుతూ ఉంటే చర్మం తేమగా కనిపిస్తుంది. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ చర్మ సంబంధిత సమస్యలు రాకుండా చేస్తాయి.
- మజ్జిగలో పొటాషియం, కాల్షియం, ప్రోటీన్, లాక్టిక్ యాసిడ్, ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు అధికంగా ఉంటాయి. మజ్జిగను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. ఆస్టియోపోరోసిస్ సమస్యలు రావు. తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ భోజనం చేసిన గంట తరవాత ఒక గ్లాసు నీళ్ల మజ్జిగ తాగితే అజీర్ణ సమస్యలు రావు.

మెడ నలుపు వదలాలంటే...

కొంతమందికి ముఖమంతా మంచి ఛాయతో ఉన్నప్పటికీ మెడ భాగం మాత్రం నల్లగా మారి ఇబ్బంది పెడుతూ ఉంటుంది. దీనికి హార్మోన్ల అసమతౌల్యం, పిగ్మెంటేషన్ కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో దొరికే వస్తువులతోనే చిన్న చిట్కాలు పాటించి ఈ సమస్య నుంచి బయటపడవచ్చని సూచిస్తున్నారు.

- ఒక గిన్నెలో అయిదు చెంచాల పెరుగు, రెండు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుంటూ మెడ మీద రాయాలి. పది నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. అయిదు నిమిషాలు ఆరాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే మెడ నలుపు క్రమంగా తగ్గుతుంది.
- రెండు చెంచాల నిమ్మరసంలో ఒక చెంచా గులాబీ నీళ్లు కలిపి ఈ మిశ్రమాన్ని దూది సహాయంతో మెడకి పట్టించాలి. పావుగంటసేపు ఆరనివ్వాలి. ఈ సమయంలో మెడకి ఎండ తగలకుండా చూసుకోవాలి. తరవాత రెండు నిమిషాలు మెడమీద సున్నితంగా రుద్ది నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. నిమ్మరసం... బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి మెడమీద పేరుకున్న మృతకణాలు, మురికిని తొలగించి నలుపుదనాన్ని పోగొడుతుంది.
- బాదం నూనె లేదా కొబ్బరి నూనెను కొద్దిగా వేడిచేసి మెడకి పట్టించాలి. వేళ్లతో పది నిమిషాలు మర్దన చేయాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే మెడ మీద రక్తప్రసరణ జరిగి నలుపుదనం తగ్గిపోతుంది. ఈ విధంగా ఆలివ్ నూనెతో చేసినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది
- ఒక గిన్నెలో ఒక చెంచా శనగపిండి, పావు చెంచా పసుపు, మూడు చెంచాల గులాబీ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ పేస్టుని మెడ మీద రాసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో స్నానం చేస్తే మెడ నలుపుదనం తగ్గుతుంది.
- ఇలా ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించని పక్షంలో డెర్మటాలజిస్టును సంప్రదించాలి.





స్వస్థత అందిస్తూ... సాంత్వన కలిగిస్తూ..!

డాక్టర్ సుజాత గుత్తాల... విశాఖ స్టీల్ ప్లాంటు జనరల్ ఆసుపత్రిలో గైనకాలజీ విభాగం ఇన్‌చార్జ్... చీఫ్ స్పెషలిస్టు డాక్టర్. కానీ ఆమె కేవలం ఒక వైద్యురాలిగా ఆసుపత్రికే పరిమితం కాలేదు. సామాజిక కార్యకర్తగా పరిసర గ్రామాలకు వెళ్లి... వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. యుక్తవయసు పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి... వారిలో మానసిక, భయాందోళనలు పోగొడుతున్నారు. ఉత్తమ వైద్యురాలిగా ఇటీవల 'ప్రభుత్వరంగ సంస్థల మహిళా ఉద్యోగుల వేదిక' (విప్స్) జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ సుజాతను 'నవ్య' పలుకరించింది.

"విశాఖ స్టీల్ జనరల్ ఆస్పత్రిలో రెండు దశాబ్దాలుగా నేను సేవలు అందిస్తున్నాను. ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రికి హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేకమంది వస్తుంటారు. వీరిలో ప్రముఖులూ ఉన్నారు. ముఖ్యంగా కాన్పుల కోసం వచ్చేవారు అధికం. ఆసుపత్రి గైనకాలజీ విభాగం ఇన్‌చార్జిగా, చీఫ్ స్పెషలిస్టు డాక్టర్‌గా నాపై విశ్వాసమే వారిని ఇక్కడవరకు రప్పిస్తోందని అనుకొంటున్నా. ఇక్కడ నామమాత్రపు ఫీజుతో బయటి రోగులకు వైద్య సేవలు అందిస్తాం. ఏడాదికి 350 నుంచి 400 మేజర్ ఆపరేషన్లు, మరో 450 వరకు మైనర్ ఆపరేషన్లు చేస్తున్నా. వీటివల్ల ఆసుపత్రి ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గత ఏడాది ఒక్క గైనకాలజీ విభాగం నుంచే రూ.30 లక్షలు సమకూరింది. కుట్లు లేకుండా హిస్టరెక్టమీ ఆపరేషన్ చేయడం ఇక్కడి ప్రత్యేకత. అలాగే పెద్ద పెద్ద ఫైబ్రాయిడ్లు ఉన్నా కుట్లు వేయకుండా ఆపరేషన్ చేస్తాం. పిల్లలు లేని దంపతులకు కూడా చికిత్స అందిస్తున్నాను. చికిత్స ఫలించి, ఇప్పటికి యాభైకి పైగా జంటలకు సంతాన ప్రాప్తి కలిగింది. ఆసుపత్రిలో ఉన్న పరిమిత వనరులతోనే ఇవన్నీ చేయగలుగుతున్నాం.

సామాజిక సేవ...

ఆసుపత్రిలో వైద్యం ఒక్కటే కాదు... ఖాళీ ఉన్నా లేకపోయినా సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా కొంత సమయం కేటాయిస్తాను. స్టీల్‌ప్లాంటు పరిసర ప్రాంతాల్లో మహిళలు, యువతకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాను. యుక్తవయసు పిల్లల్లో మానసిక ఒత్తిడి, భయాందోళనలు పోగొట్టేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్నాను. వీలు చూసుకొని పరిసర గ్రామాలు, విద్యా సంస్థలకు వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, జీవన విధానం, పౌష్టికాహారం, భద్రత, సామాజిక బాధ్యతల గురించి వివరించి చెబుతున్నాను.

కొవిడ్ పాజిటివ్ గర్భిణికి సర్జరీ...

కరోనా సమయంలో రోగులకు సాధారణ వైద్యం అందించడానికి చాలామంది డాక్టర్లు భయపడేవారు. కాన్పులు చేయడానికి అంగీకరించేవారు కాదు. ఇది నన్ను కలవరపెట్టింది. ఆ సమయంలో నిండు గర్భిణి డెలివరీ కోసం నా వద్దకు వచ్చింది. ఆమెకు కొవిడ్ పాజిటివ్. కానీ నేను వెనకడుగు వేయలేదు. సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశాను. తరువాత తెలిసింది... తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్‌లో సిజేరియన్ చేసిన తొలి వైద్యురాలిని నేనేనని. వైద్య వృత్తితో పాటు పరిశోధనలు కూడా కొనసాగిస్తున్నాను. గైనకాలజీకి సంబంధించి అనేక సమస్యలపై పరిశోధనా పత్రాలు సమర్పించాను. ఈ క్రమంలో పలు అవార్డులు కూడా అందుకున్నాను.

సమస్యను తెలుసుకొని...

నన్ను నమ్మి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే నా లక్ష్యం. బాధతో వచ్చినవారిని తిరిగి చిరునవ్వుతో పంపించడానికి నా శక్తిమేరకు ప్రయత్నిస్తా. ఆస్పత్రికి వచ్చేవారితో నవ్వుతూ మాట్లాడటం, సమస్యను పూర్తిగా తెలుసుకొని సరైన చికిత్స అందించడం... ఇదే నాకు తెలిసిన వైద్యం. అందుకే నన్ను వెతుక్కొంటూ ఇంతమంది పేషెంట్లు వస్తున్నారని అనుకొంటున్నా. అంతేకాదు... సహోద్యోగులతో కలివిడిగా ఉంటూ, ఏ కార్యక్రమం నిర్వహించినా ఉత్సాహంగా పాల్గొంటాను. కార్యక్రమం విజయవంతం చేయడానికి నావంతు కృషి చేస్తాను. బహుశా అందుకేనేమో నన్ను అందరూ అభిమానిస్తారు. నా ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాను. మరింతమందికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి, అందరి ఆదరాభిమానాలకు పాత్రురాలిని కావాలని కోరుకొంటున్నాను."

సేవకు పురస్కారం...

'ప్రభుత్వ రంగ సంస్థల మహిళా ఉద్యోగుల వేదిక' (విప్స్) ఇటీవల న్యూఢిల్లీలో జాతీయ సమ్మేళనం నిర్వహించింది. అందులో నాకు ఉత్తమ వైద్యురాలిగా ఎగ్జిక్యూటివ్ విభాగంలో జాతీయ అవార్డు లభించింది. నా సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.



• యర్రా శ్రీనివాసరావు, విశాఖపట్నం

ప్రకృతి రత్నం!

జలచరాలపై ఉన్న ఇష్టాన్ని వాటిని పరిరక్షించే బాధ్యతగా మార్చుకున్నారు అరుణిమ సింగ్. పద్నాలుగేళ్లలో 35 వేలకు పైగా తాబేళ్లను, ఇతర సముద్ర జీవులను కాపాడారు, అక్రమ తరలింపును అడ్డుకున్నారు. వాటి సంరక్షణ ఆవశ్యకతపై 50 వేల మందికి పైగా పిల్లలకు అవగాహన కల్పించారు. తోటి ప్రాణుల పట్ల క్రూరత్వం, నిర్లక్ష్యం మనకే ముప్పు తెస్తాయంటున్న 39 ఏళ్ల అరుణిమ కృషి గురించి ఆమె మాటల్లోనే...



"మాది ఉత్తరప్రదేశ్‌లోని లఖనవూ. గోమతీ నది మా నగరంలోంచి పారుతూ ఉంటుంది. మా తాతయ్యకు రోజూ సాయంత్రం నదీ తీరానికి వెళ్లడం అలవాటు. నేను బడి నుంచి రాగానే... ఆయనతో కలిసి వెళ్లడానికి సిద్ధమైపోయేదాన్ని. నదుల గురించి, సముద్రాల గురించి, వాటిలో ఉండే వైవిధ్యమైన జీవుల గురించి ఆయన ఎన్నో సంగతులు చెప్పేవారు. జంతువులంటే నాకు చాలా ఇష్టం. జలచరాలంటే ప్రత్యేకమైన ఆసక్తి. అందుకే ఎమ్మెస్సీ లైఫ్ సైన్స్ చేశాను. ఒక ప్రాజెక్ట్‌లో భాగంగా.. 'టర్టిల్ సర్వైవల్ అలయన్స్' (టిఎస్ఎ) ఇండియా విభాగానికి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శైలేంద్ర సింగ్‌ను కలుసుకున్నాను. ప్రపంచవ్యాప్తంగా తాబేళ్లు అంతరించిపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయనీ, వాటిని కాపాడుకోవాలనీ ఆయన చెబుతూ... ఆ దిశగా నన్ను ప్రోత్సహించారు. అంతరించే జీవ జాతుల కోసం పాటుపడుతున్న 'కుక్రైల్ ఘరియల్ పునరావాస కేంద్రా'న్ని సందర్శించాల్సిందిగా సూచించారు. ఆ కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. అక్కడ కొన్నాళ్ళు స్వచ్ఛందంగా పని చేశాను. ఆ తరువాత 'టిఎస్ఎ'లో రిసెర్చ్ అసిస్టెంట్‌గా చేరాను. దాంతో తాబేళ్ల పరిరక్షణే నా జీవితంగా మారిపోయింది. ఆ తరువాత టర్టిల్ ఎకాలజీలో పిహెచ్‌డి కూడా చేశాను.

దాడులు, బెదిరింపులు

తాబేళ్లకు ముప్పులు అనేక రూపాల్లో ఉంటాయి. వాటిలో ప్రధానమైనది అక్రమ రవాణా. సముద్ర, నదీ తీరాల నుంచి వాటిని సేకరించి, అక్రమ రవాణా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ముఠాలకు అడ్డుకట్ట వేయడం కోసం బృందాలుగా ఏర్పడి, నిఘా వేసేవాళ్లం. తాబేళ్లను తరలించే ప్రయత్నాలను నిరోధించే ప్రయత్నంలో మామీద దాడులు కూడా జరిగాయి. కొందరు స్మగ్లర్లు బెదిరించారు కూడా. కానీ వేటికీ భయపడలేదు. 2017లో... అమేథీ నుంచి తరలిస్తున్న 6,400 తాబేళ్లను పోలీసుల సాయంతో పట్టుకోగలిగాం. వాటి సంఖ్య చూసి మాకు మతిపోయినట్టయింది. హింసా ప్రవృత్తితో తాబేళ్లకు హాని చేసేవారు, గాయపడి తీరానికి చేరుకున్న తాబేళ్లను పట్టించుకోకపోగా వాటిని తరిమికొట్టేవారు ఉంటారు. ఇటువంటి సందర్భాల్లో ఆ తాబేళ్లకు ఎలా సాయం చెయ్యాలనే సంగతి చాలామందికి తెలీదు. ఈ పరిస్థితిని మార్చాలనే ఆలోచనతో... ఉత్తరప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అటవీ సిబ్బందికి, పోలీసులకు, స్థానికంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, మత్స్యకారులకు శిక్షణ ఇచ్చాం. దానివల్ల మంచి ఫలితాలు కనిపించాయి.

తాబేళ్ల కోసం కాలనీలు...

జలచరాలు అంతరించిపోవడానికి మరో ముఖ్య కారణం... వాటి ఆవాసాలను కోల్పోవడం. సముద్రాలు, నదుల్లో కాలుష్యం, మితిమీరిన వేట కారణంగా అవి నివసించే ప్రదేశాల పరిధి తగ్గిపోవడం లేదా ప్రమాదకరంగా మారడం జరుగుతోంది. వాటి సంఖ్య పెరగడానికి, ప్రమాదరహితంగా జీవించడానికి సురక్షితమైన ప్రదేశాలు అవసరం. ఈ నేపథ్యంలో అపురూపమైన 13 జాతుల తాబేళ్ల కోసం 'అస్యూరెన్స్ కాలనీ'లను, అంతరించే ముప్పులో ఉన్న ఎనిమిది జాతుల కోసం సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశాం. తద్వారా ముప్పైకి పైగా కుటుంబాలకు ఉపాధి కూడా కల్పించాం. నా కార్యక్రమాలు కేవలం తాబేళ్లకే పరిమితం కాదు. మొసళ్ళు, గంగానదిలోని డాల్ఫిన్ల పరిరక్షణ కోసం కూడా కృషి చేస్తున్నాను. దీనికోసం ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నాను. ఒకసారి లఖనవూలోని భారీ వర్షాలు పడిన సమయంలో... ఒక ఇంట్లోకి మొసలి ప్రవేశించింది. ఈ సమాచారం తెలియగానే నేను అక్కడికి చేరుకున్నాను. దాదాపు ఏడు అడుగులున్న ఆ మొసలిని వరదనీటిలో నియంత్రించడం అంత సులభం కాదు. అయిదుగంటల సేపు ప్రయత్నించిన తరువాత... నేను, నా బృందం దాన్ని పట్టుకొని, అటవీ శాఖవారికి అప్పగించాం. ఈ సంఘటన మా ఇంట్లో చెబితే... "చిన్నప్పుడు బల్లి అంటే ఎంతో భయపడేదానివి. మొసలి కూడా చాలా రెట్లు పెద్దదైన బల్లిలాగానే ఉంటుంది కదా! ఇప్పుడు భయం పోయిందా?" అన్నారు. "నేను పర్యావరణంతో మమేకమై, జంతువులతో పని చేస్తున్నాను. ఇప్పుడు వాటి పట్ల ప్రేమ తప్ప భయం లేదు" అని చెప్పాను. కొన్నిసార్లు జంతువులు దాడి చేయడం, కరవడం కూడా చేశాయి. కానీ బెదిరి పారిపోలేదు. ఎందుకంటే... అవి ఆత్మరక్షణ కోసమే అలా చేస్తాయి.



అది మన కర్తవ్యం

ఇప్పుడు 'టిఎస్ఎ ఇండియా'లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాను. నా నేతృత్వంలో ఇప్పటివరకూ 35 వేలకు పైగా తాబేళ్ళు, మొసళ్ళు, డాల్ఫిన్‌లను స్మగ్లర్ల నుంచి, హానికరమైన పరిస్థితుల నుంచి కాపాడి, చికిత్స, పునరావాసం కల్పించాం. ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు ఎన్ని ప్రయత్నాలు చేసినా... ప్రజల్లో చైతన్యంతోనే గొప్ప ఫలితాలు వస్తాయి. భవిష్యత్ తరాలకు కూడా ఇది తెలియాలి. అందుకే పాఠశాలల్లో, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకూ యాభై వేలమందికి పైగా పిల్లలకు అవగాహన కల్పించాం. అలాగే దేశంలో పలు ప్రాంతాల్లో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. పలు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని చేపట్టిన ఈ కార్యక్రమాలకు గుర్తింపుగా 'నాట్ వెస్ట్‌గ్రూప్' నుంచి 'ఎర్త్ హీరోస్' (సేవ్ ది స్పైసెస్) అవార్డును, 'ప్రకృతి రత్న'తో సహా అనేక పురస్కారాలు, గౌరవాలు లభించాయి. నేను సమాజానికి చెప్పేది ఒక్కటే.. తోటి జీవజాతుల పట్ల నిర్లక్ష్యం, క్రూరత్వం, వాటిని అమ్ముకొని లాభం పొందాలనే స్వార్థం లాంటివి పర్యావరణ వ్యవస్థకు, అంతిమంగా మానవులమైన మనకు చేటు తెస్తాయి. కాబట్టి అటువంటి చర్యలను మానుకోవడం, అరుదైన జీవులు అంతరించిపోకుండా కాపాడుకోవడం మన కర్తవ్యం కావాలి. అందరిలో ఆ కర్తవ్య స్ఫూర్తి నింపడమే నా లక్ష్యం."

ఈ కమ్మలు చిన్నారులకు ప్రత్యేకం!

చిన్నారి పాపల చెవులు చాలా సున్నితంగా ఉంటాయి. కాబట్టి కేవలం ఒకటి లేదా రెండు గ్రాముల బంగారంతో చేసిన కమ్మలను పెట్టడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నారుల కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రెండీ బంగారు కమ్మలు ఇవే...

పూల కమ్మలు



ఇవి రకరకాల పూల ఆకారాల్లో లభ్యమవుతున్నాయి. మూడు, అయిదు, తొమ్మిది రెక్కలతోపాటు చిన్న కాండం ఉండేలా వీటిని రూపొందిస్తున్నారు. ఇవి రెండు జడలు వేసుకునే ఆడ పిల్లలకు ప్రత్యేకమైన శోభనిస్తాయి.



బంతి కమ్మలు

ఇవి గుండ్రంగా ఒక బంతి ఆకారంలో ఉంటాయి. మధ్యలో సీజెడ్, పచ్చ, కెంపు, వజ్రం, నీలం, పగడం, ముత్యంలలో ఒక దాన్ని అమరుస్తారు. పాపకి ఎలాంటి దుస్తులు వేసినా వాటిపై స్టయిలిష్‌గా కనిపిస్తాయి ఈ కమ్మలు.

హార్ట్ కమ్మలు



ఇవి హృదయాకారంలో కనిపిస్తుంటాయి. వీటి మీద సీజెడ్‌లు పొదిగి అందంగా రూపొందిస్తున్నారు. వీటిని చెవులకు పెడితే చిన్నారి సొగసు పెరుగుతుంది. బాబ్ కట్ చేయించుకుని చక్కని టాప్ లేదా అందమైన గౌన్ వేసుకుంటే ఈ కమ్మలు ప్రత్యేకంగా కనిపిస్తాయి.



బటర్‌ఫ్లై కమ్మలు

ఇవి పేరుకు తగ్గట్టు సీతాకోకచిలుక ఆకారంలో ఉంటాయి. వీటికి ముత్యాలు, రంగురంగుల రాళ్లు అమర్చి రకరకాల డిజైన్లలో రూపొందిస్తున్నారు. ఇవి సింపుల్‌గా, గ్రాండ్‌గా కూడా లభ్యమవుతున్నాయి.

గులాబీ కమ్మలు



ఇవి చిన్న సైజ్‌లో ఉండే బంగారు గులాబీల్లా కనిపిస్తాయి. వీటిని చెవులకు పెడితే చిన్నారి ముఖ వర్చస్సు అందంగా ప్రకాశిస్తుంది. ఎటువంటి డ్రెస్ మీదనైనా చక్కగా నప్పుతాయి.



డాల్ఫిన్ కమ్మలు

ఇవి ఒంపు తిరిగిన చిన్న డాల్ఫిన్ ఆకారంలో మెరుస్తూ ఉంటాయి. కన్ను దగ్గర నల్లని రాయిని అమరుస్తారు. వీటిని చిన్నారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

ఇల్లు అందంగా కనిపించాలంటే...



ఇల్లు అందంగా కనిపించాలని అందరూ కోరుకుంటారు. చిన్న చిట్కాలు పాటిస్తూ ఇంటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- ప్రస్తుతం హాల్, డ్రాయింగ్ రూమ్, లివింగ్ రూమ్ గోడల మీద కళాత్మక చిత్రాలను పెయింట్ చేయించుకోవడాన్ని అందరూ ఇష్టపడుతున్నారు. వీటివల్ల గదికి రిచ్ లుక్ వస్తుంది. సరసమైన ధరకే రంగురంగుల చిత్రాలు అందుబాటులో ఉంటున్నాయి. చక్కని ప్రకృతి, జంతువులు, పక్షుల చిత్రాలు ఉన్న ఫొటోఫ్రేమ్‌లను అక్కడక్కడ ఏర్పాటు చేసినా ఇల్లు కళగా కనిపిస్తుంది.
- వ్యక్తిగత ఫొటోలతో గోడలను నింపేయకూడదు. ఇంట్లో ఒక గోడను ఎంపిక చేసుకుని అక్కడ మాత్రమే కుటుంబ సభ్యుల ఫొటోలు పెడితే బాగుంటుంది.
- హాల్‌లో కిటికీలకు కాంట్రాస్ట్ కలర్ కర్టెన్లు వేస్తే క్లాసీ లుక్ వస్తుంది. కట్టుకోని చీరలు ఉంటే వాటితో కూడా అందమైన కర్టెన్లు రూపొందించవచ్చు. ఫ్లోరల్ ప్రింట్స్ ఉన్న చీరలు అయితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- గది మూలల్లో మొక్కల కుండీలు పెడితే చూడడానికి బాగుంటుంది. కృత్రిమ మొక్కలు, తీగలు, పువ్వులతో కూడా ఇంటిని అలంకరించుకోవచ్చు.
- ఇంట్లో సోఫా లేని పక్షంలో నేలపై మందపాటి పరుపు వేసి అందమైన కుషన్లు అమరిస్తే హాల్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.
- డ్రాయింగ్ రూమ్, డైనింగ్ రూమ్‌లలో దీర్ఘచతురస్రాకారపు కార్పెట్ వేస్తే ఇంటికి గ్రాండ్ లుక్ వస్తుంది.
- హాల్‌లో ఉండే సింక్‌కు జతగా అద్దం, హ్యాండ్‌వాష్, చిన్న టవల్ లాంటివి పెట్టుకుంటే ఇంటికి డీసెంట్ లుక్ వస్తుంది.

కారంలో కల్తీని ఇలా గుర్తించండి..!

వంటకాల్లో కల్తీ చేసిన కారం పొడిని ఉపయోగిస్తే జీర్ణాశయ సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. కల్తీని గుర్తించే చిన్న చిట్కాలను ఇలా సూచిస్తున్నారు.



- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా కారం పొడి వేసి బాగా కలపాలి. స్వచ్ఛమైన కారం నీటిలో కరగదు. అది నీటిపై తేలుతూ ఉంటుంది. ఒక నిమిషం తరవాత గ్లాసు అడుగు భాగాన్ని పరిశీలించాలి. అక్కడ ఎర్రని పొడి చేరి ఉంటే దాన్ని వేళ్లతో తీసుకుని అరచేతిలో వేసుకుని గట్టి రుద్దాలి. గరుకుగా తగిలితే ఇటుక పొడి కలిపినట్లు గుర్తించవచ్చు. గ్లాసు అడుగున మెత్తని తెలుపు రంగు పదార్థం చేరితే సోప్ స్టోన్ పొడి కలిపినట్లు చెప్పవచ్చు. గ్లాసులోని నీళ్లు మరీ ఎర్రగా మారితే ఎరుపు రంగు కలిపినట్లు తెలుసుకోవచ్చు.
- వెడల్పాటి పళ్లెంలో ఒక చెంచా కారం పొడి వేయాలి. ఇందులో మూడు చుక్కల టింక్చర్ అయోడిన్ వేసి చెంచాతో కలపాలి. కారం పొడి నీలం రంగులోకి మారితే అందులో గంజి పొడి లేదా ఏదైనా పిండి కలిపినట్లు గుర్తించవచ్చు.

దిక్సూచి DIKSUCHI

గ్రాడ్యుయేషన్ వరకు మన దేశంలో చదివినా, ఉన్నత విద్య మాత్రం విదేశాల్లో చదువుకుని కెరీర్‌లో గొప్పగా స్థిరపడాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. దీని వల్ల చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. కొత్త సంస్కృతులు పరిచయం అవుతాయి, కెరీర్ అవకాశాలు పెరుగుతాయి, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయి. అందుకే మన దేశంలో ప్రతీ సంవత్సరం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవుతోంది. అయితే ఉన్నత విద్యకు ఏయే దేశాలు-యూనివర్సిటీలు మంచివి, ఎంత ఖర్చు అవుతుంది, వీసా కోసం ఏయే పత్రాలు అవసరం అవుతాయి, ప్రాసెసింగ్ ఎలా చేయించుకోవాలి అనే విషయం చాలా మందికి అవగాహన ఉండదు. విదేశీ విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సహకరించడానికి మన దగ్గర ఫారెన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. వీటిని సంప్రదిస్తే సరైన గైడెన్స్ లభిస్తుంది. తరువాత సులువుగా కావాల్సిన డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవచ్చు.

కోవిడ్ ముందుతో పోలిస్తే తరువాత విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుకున్న విద్యార్థుల సంఖ్య 8,94,783. ప్రపంచ వ్యాప్తంగా చైనా తరువాత ఉన్నత విద్య కోసం అత్యధికంగా విదేశాలకు వెళుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మన విద్యార్థుల ప్రాధాన్యంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకేలు వరుసగా ఉన్నాయి. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ నివేదిక ప్రకారం 2023-24 అకడమిక్ ఇయర్‌లో అమెరికాకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 3,37,630. అయితే కెనడా ఇబ్బందుల కారణంగా ఈ విద్యా సంవత్సరం అక్కడికి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు వెళుతున్న విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న కన్సల్టెన్సీల సేవల పొందుతున్నారు. భారతదేశంలో పేరున్న కన్సల్టెన్సీల్లో ఇవికొన్ని...

విదేశీ విద్యకి బెస్ట్ కన్సల్టెన్సీలు

ఐడీపీ ఎడ్యుకేషన్

ఐదు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సర్వీసులో ఉన్న పెద్ద సంస్థ ఇది. ఆస్ట్రేలియన్ ఆసియన్ యూనివర్సిటీస్ కో-ఆపరేషన్‌గా మొదలై కాలక్రమంలో 'ఐడీపీ ఎడ్యుకేషన్' పేరు మార్చుకుంది. విదేశీ విద్యకు సంబంధించి పలు సేవలు అందిస్తుంది. www.idp.com/india/

ఇన్ఫినిటీ గ్రూప్

ఇన్ఫినిటీ గ్రూప్ రెండు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. ఈ సెక్టార్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఇన్ఫినిటీ'కి 300 యూనివర్సిటీ పార్టనర్‌షిప్, 2500 గ్లోబల్ పార్ట్‌నర్స్ ఉన్నారు. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్, ఎండ్ టు ఎండ్ అసిస్టెన్స్‌లో ఉంటుంది. https://infinitegroup.global/



వై యాక్సిస్

భారతదేశంలోని పేరొందిన నమ్మకమైన స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీల్లో 'వై యాక్సిస్' ఒకటి. 25 సంవత్సరాల పైన ఈ సంస్థ కన్సల్టెన్సీ సర్వీసులో ఉంది. స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కౌన్సెలింగ్, వీసా అసిస్టెన్స్, కెరీర్ కౌన్సెలింగ్, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో 'వై యాక్సిస్' సహాయం చేస్తుంది. https://www.yaxis.com/

ఎడ్వైజ్ ఇంటర్నేషనల్

'ఎడ్వైజ్ ఇంటర్నేషనల్' మూడు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. దేశంలోని పాత కన్సల్టెన్సీల్లో ఇది ఒకటి. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. స్కాలర్‌షిప్స్, ఫైనాన్సియల్ ఎయిడ్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇస్తుంది. https://www.edwiseinternational.com/

'మాన్య గ్రూప్'(ద ప్రిన్స్‌టన్ రివ్యూ ఇండియా)

దేశంలోని ఎస్టాబ్లిష్డ్ కన్సల్టెన్సీల్లో 'మాన్య గ్రూప్' ఒకటి. రెండు దశాబ్దాలకు పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో రెప్యూటెడ్ గ్రూప్ ఇది. పలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, శాట్/ఏసీటీ/జీఆర్ఈ/జీమాట్/ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ ప్రిపరేషన్, లాంగ్వేజ్ ట్రైనింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు నిర్వహిస్తుంది. https://www.manyagroup.com/

కెరీర్ మ్యాట్రిక్స్

ఒకటిన్నర దశాబ్దం పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో ఉన్న సంస్థ ఇది. పలు యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ ఉంది స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. https://careermatrix.in/

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోసం 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'



నాలుగు సంవత్సరాల 'ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్'లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025' పేరిట జరిగే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది.. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 64 విద్యా సంస్థల్లోని 6,100 సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. పరీక్షల్లో ర్యాంకు ఆధారంగా ఆయా సంస్థలు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించి బీఏ-బీఈడీ, బీకాం-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తాయి. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను అడుగుతారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు 13 భాషల్లో జరుగుతుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16 **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుల్లో యోగా, వ్యాయమ విద్య, ఆర్ట్స్, సంస్కృతం ప్రవేశపెట్టనున్నారు. ఇవి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఏ కోర్సుల్లోనైనా విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి అన్న నిబంధన ఉండేది. ఇక దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుంచి 80 శాతానికి పెంచనున్నారు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ పూర్తి వివరాలకు exams.nta.ac.in/NCET/ వెబ్‌సైట్ చూడవచ్చు.

1161 కానిస్టేబుల్/ ట్రేడ్స్‌మన్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో వివిధ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న 1161 కానిస్టేబుల్ ట్రేడ్స్‌మన్ పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 3. నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఖాళీల్లో 493 కానిస్టేబుల్/కుక్, కానిస్టేబుల్/వాషర్‌మన్ 262, కానిస్టేబుల్ బార్బర్ 199, కానిస్టేబుల్/స్వీపర్ 152, కానిస్టేబుల్/కార్పెంటర్ 9, కానిస్టేబుల్/టైలర్ 23 మొదలైన 13 రకాల పోస్టులు ఉన్నాయి. ఫిజికల్ స్టాండెడ్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 2025 ఆగస్ట్1వ తేదీ నాటికి 18 నుంచి 23 సంవత్సరాల వయస్సులో ఉండాలి. 2025 మార్చి 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలు

1124 కానిస్టేబుల్/ డ్రైవర్

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులతో నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో 845 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులు, కానిస్టేబుల్/ డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ పోస్టులు 279 ఉన్నాయి. పదో తరగతితోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 4. దరఖాస్తు దాఖలు చివరి తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 21 నుంచి 27 మధ్యలో ఉండాలి. రెండు పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://cisfrectt.cisf.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

J N Tata Endowment Loan Scholarship

Description: The J N Tata Endowment (J N Tata Endowment Loan Scholarship for Fall 2025 to Spring 2026) invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India.

- Candidates must be interested in pursuing Post - graduate/Doctoral/Postdoctoral studies abroad.
- The course for which candidates are admitted must be recognized as a Graduate Program (post-graduate in Indian terminology).
- Candidates who did not get selected in the previous year/earlier for the J N Tata Endowment loan scholarship and candidates who could not avail of the loan scholarship when they were selected, are eligible to apply afresh.
- Candidates who are already pursuing post-graduate studies overseas may apply either at the end of their 1 st of studies or at the commencement of the 2 nd year, provided there is a minimum of one full academic year (12 months) remaining to be completed at the time of the loan scholarship award, typically in July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or post-graduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2025.

Prizes & Rewards: Loan scholarship of upto Rs. 10 lakhs

Last Date: 07-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/JNT9

SCHOLARSHIP ALERT

NIT Rourkela Summer Internship

Description: The NIT Rourkela Summer Internship Programme 2025 is available for students pursuing undergraduation and master's degrees at the National Institute of Technology, Rourkela. It encourages students to undertake innovative research and development projects.

Eligibility: Applicants must be pursuing one of the following: B.E./B.Tech (4th semester exam completed), B.Arch/Integrated M.Sc./M.Tech/Dual degree (6th semester exam completed), or M.Sc./MA/MBA (2nd semester exam completed). A good academic record and marks/grade sheets of previous semesters shall be required. Applicants must remain available for internship from May 16 to July 15, 2025.

Prizes & Rewards: 7,500 per month and other benefits. *Last Date:* 10-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/NRSI1

buddy4study.com

చిత్రజ్యోతి SINCE 1965

సినిమాలు తీయడం కంటే ఐఏఎస్ సాధించడం సులువు

- సందీప్‌రెడ్డి వంగా



ప్రభాస్‌తో తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం 'బాహుబలి' కలెక్షన్లను దాటి రూ.2000 కోట్ల వసూళ్లు సంపాదిస్తుందా లేదా అనేది నేను చెప్పలేను. కానీ ఓ వైవిధ్యమైన చిత్రాన్ని మాత్రం ప్రేక్షకులకు అందిస్తాను అని సందీప్ రెడ్డి వంగా అన్నారు. ఇటీవలె 'గేమ్ ఛేంజర్స్' అనే షోలో ఆయన పాల్గొన్నారు. ఇందులో పలు విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే, తన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాపై గతంలో మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి చేసిన విమర్శలను సందీప్ గుర్తుచేసుకున్నారు. "ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు నాకింకా గుర్తున్నాయి. ఇలాంటి సినిమాలు తెరకెక్కించకూడదన్నది ఆయన ఉద్దేశం. 'యానిమల్' సమాజాన్ని పదేళ్ల వెనక్కితీసుకెళ్తుందని ఆయన విమర్శించారు. అవి నన్ను చాలా బాధించాయి. నేనేదో నేరం చేసినట్లు అనిపించింది. ఆయన అనవసరంగా నా సినిమాపై అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అనిపించింది. ఓ ఐఏఎస్ అధికారి కావాలంటే కోచింగ్ సెంటర్లకు వెళ్లి, కొన్నేళ్లపాటు శిక్షణ తీసుకుంటూ కష్టపడి చదివితే సరిపోతుంది. కానీ ఓ ఫిల్మ్‌మేకర్ లేదా రచయిత కావాలనుకుంటే సరైన మార్గదర్శకాలు ఇచ్చే టీచర్లు, కోర్సులు ఉండవు. ఓ ఫిల్మ్‌మేకర్ తనకు తానుగా అన్నీ నేర్చుకోవాలి. తన తపన, ఆసక్తి, అభిరుచి, కష్టంతోనే ముందుకు సాగాలి. ఈ విషయాన్ని కావాలంటే నేను పేపర్‌పై కూడా రాసి ఇస్తాను" అని పేర్కొన్నారు. కాగా, 'ట్వల్త్ ఫెయిల్' సినిమాలో కీలక పాత్రలో నటించారు మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంలో 'ట్వల్త్ ఫెయిల్' లాంటి సినిమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయనీ, 'యానిమల్' సినిమాలో సామాజిక విలువలు లోపించాయని విమర్శించారు.

కథ చెబితే బహుమానం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ హీరో, హీరోయిన్లుగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ రుబా'. సారెగమ సంస్థ, రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మాతలు. హోలీ పండుగ సందర్భంగా మార్చి 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఓ పోటీని ప్రకటించారు హీరో కిరణ్ అబ్బవరం.' దిల్ రూబా' చిత్రం కథను ముందుగానే ఊహించి చెప్పిన వాళ్లకు ఈ సినిమాలో హీరో నడిపిన ద్విచక్ర వాహనం బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజేతకు ఈ బహుమతిని అందజేస్తారు.



స్మగ్లర్లను హీరోలుగా చూపడం సరికాదు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'పాత సినిమాల్లో చివరకు హీరో చేతిలో విలన్ అంతమయ్యేవాడు. లేదంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లేవాడు. ఇప్పుడు నెగిటివ్ క్యారెక్టర్‌లను సైతం హీరోలుగా చూపిస్తున్నారు. స్మగ్లర్‌లు, దేశ ద్రోహులకు హీరోయిజాన్ని ఆపాదించడం సరికాదు. ఆ పాత్రల్లో హీరోలు గొప్పగా నటించినంత మాత్రాన వాటిని ఆదర్శంగా చూపించడం సమంజసం కాదు. ఈ తరం అర్థవంతమైన సినిమాలు తీయాలి. ప్రమాణాలు పాటించాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సీనియర్ నటి కృష్ణవేణి సంస్మరణ సభను ఫిల్మ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. చలన చిత్ర నటిగా, నిర్మాతగా, నేపథ్య గాయనిగా, శోభనాచల స్టూడియో అధినేతగా కృష్ణవేణి తెలుగు సినిమా రంగంలో ఓ సువర్ణాధ్యాయం లిఖించారని ఆయన కొనియాడారు. 'మనదేశం' చిత్రంలో నందమూరి తారకరామారావును పరిచయం చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అలాగే మీర్జాపురం రాజా, కృష్ణవేణి దంపతుల వల్లనే 'కీలుగుర్రం' చిత్రంతో అక్కినేని నాగేశ్వరరావుకి స్టార్ స్టేటస్ వచ్చిందని వెంకయ్య నాయుడు చెప్పారు. 'మా తండ్రిగారిని సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ సంస్మరణ సభలో మేం కూడా భాగస్వాములైనందుకు గర్విస్తున్నాం' అని నందమూరి మోహన కృష్ణ, రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని రమేశ్ ప్రసాద్, మురళీ మోహన్, డా.పరుచూరి గోపాల కృష్ణ, నిర్మాతలు కె.ఎస్.రామారావు, కైకాల నాగేశ్వరరావు, తుమ్మల ప్రసన్న కుమార్, కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మోగ్లీ పోరాటం



సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో సాగే ఈ అందమైన ప్రేమకథలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. సినిమాకు ఆకర్షణగా నిలిచే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. 'మోగ్లీ 2025' ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాలభైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ మారుతి ఎం.

ఇళయరాజా స్టూడియోలో సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం భేటీ అయ్యారు. స్థానిక కోడంబాక్కంలోని ఇళయరాజా మ్యూజిక్ స్టూడియోకు వెళ్లిన స్టాలిన్.. ఆయనతో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా సింఫనీ అరంగేట్రం జరుగనుండగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించేందుకు స్టాలిన్ వెళ్లినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై సీఎం స్టాలిన్ కూడా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ఆసియా ఖండంలోనే ఎవరూ చేయని ఘనతను ఈ నెల 8వ తేదీన లండన్‌లో సింఫనీ అరంగేంట్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు మన ప్రియమైన రాజా. తమిళనాడు గర్వించదగ్గ సంగీత విద్వాంసుణ్ణి అభినందించేందుకు స్వయంగా ఆయన స్టూడియోకు వెళ్ళాను. ఆయన స్వయంగా చేతితో రాసిన 'వయలెంట్ సింఫనీ' సంగీత నోట్స్‌ను నాకు చూపించారు. ప్రపంచ తమిళ ప్రజల సంగీత శ్వాసగా మారిన ఇళయరాజా తలపెట్టిన ఈ సింఫనీ అరంగేట్రం విజయవంతంగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను' అని స్టాలిన్ ఆకాంక్షించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునే ప్రేమకథ



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జిగేల్'. డాక్టర్ వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ప్రేమకథ ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: వాసు, సంగీతం: ఆనంద్ మంత్ర.

అవి డీప్‌ఫేక్ వీడియోలు

విద్యాబాలన్



నన్ను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన పలు డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఉన్నది నేను కాదు, దయచేసి ఆ వీడియోలను వ్యాప్తి చేయవద్దు అని విద్యాబాలన్ నెటిజన్లను కోరారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. "సోషల్‌మీడియాలో ఈ మధ్య నాకు సంబంధించిన పలు వీడియోలు ఎక్కువగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు నేను చేసినవి కావు. అవి డీప్ ఫేక్ ద్వారా సృష్టించినవి. దయచేసి వాటిలో చెప్పే విషయాలను నమ్మొద్దు. అవి మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశముంది" అని పేర్కొన్నారు.

ముందుగానే మ్యాడ్‌స్క్వేర్



నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. 'మ్యాడ్' కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 29న విడుదల కావాల్సి ఉండగా, డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు ఒకరోజు ముందుగా మార్చి 28న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. 'మార్చి 29న అమావాస్య కావడంతో మా పంపిణీదారులు చిత్రాన్ని ముందు రోజే విడుదల చేయాలని కోరారు. ఈ నిర్ణయం పట్ల మేము కూడా సంతోషంగా ఉన్నాం' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ తెలిపారు.

మాస్‌ను మెప్పించే కథతో



మలయాళ హీరో ఆంటోనీ వర్గీస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కట్టలన్'. 'మార్కో' చిత్రంతో నిర్మాతగా భారీ విజయాన్ని అందుకున్న షరీఫ్ నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌కు పాల్ జార్జ్ దర్శకుడు. ఆదివారం చిత్రబృందం ఆంటోనీ వర్గీస్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గంభీరమైన లుక్‌లో వర్గీస్ కనిపించారు. మాస్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు యాక్షన్ పార్ట్ ఈ సినిమాకు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ తెలిపింది.

విభిన్నతరహా చిత్రం



ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య ద్వయం దర్శకత్వం వహిస్తుండగా, ఆర్.యు. రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్ క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రసన్నకుమార్. టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వీరశంకర్, నిర్మాత నవీన్ యెర్నేని స్క్రిప్టును అందజేశారు. సినిమా విభిన్న తరహాలో ఉండబోతోందని మేకర్స్ తెలిపారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
యూపీ x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



చిలీ ఓపెన్ విజేత రిత్విక్ జోడీ

న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు రిత్విక్ చౌదరి బొల్లిపల్లి మరోసారి అంతర్జాతీయస్థాయిలో అదరగొట్టాడు. ఈ హైదరాబాద్ కుర్రాడు.. కొలంబియాకు చెందిన నికోలస్ బరింటోస్‌తో కలిసి చిలీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో డబుల్స్ విజేతగా నిలిచాడు. చిలీలోని శాంటియాగోలో ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో అన్‌సీడెడ్ ద్వయం రిత్విక్/నికోలస్ 6-3, 6-2తో టాప్‌సీడ్, అర్జెంటీనా జంట మాగ్జిమో గొంజాలెజ్/ఆండ్రెస్ మోల్టెనికి షాకిచ్చింది. రిత్విక్‌కు ఇది కెరీర్‌లో రెండో ఏటీపీ టైటిల్ కావడం విశేషం. ఈ ప్రదర్శనతో రిత్విక్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 66వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు.

యుకీకి దుబాయ్ టైటిల్

దుబాయ్: భారత స్టార్ యుకీ భాంబ్రీ దుబాయ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పురుషుల డబుల్స్ విజేతగా నిలిచాడు. ఇక్కడ జరిగిన ఫైనల్లో యుకీ/అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) జోడీ 3-6, 7-6, 10-8తో ప్రపంచ 14వ ర్యాంకర్ హ్యారీ (ఫిన్లాండ్)/హెన్రీ (బ్రిటన్) జంటను ఓడించి టైటిల్ అందుకుంది. యుకీకిది కెరీర్‌లో తొలి ఏటీపీ 500 టైటిల్. ఈ విజయంతో యుకీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 40వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు.

అగ్రస్థానంలో ప్రజ్ఞానంద, అరవింద్

ప్రేగ్: ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ మాస్టర్స్ విభాగం ఐదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఆర్. ప్రజ్ఞానంద, అరవింద్ చిదంబరం మధ్య జరిగిన గేమ్ డ్రా అయ్యింది. ఆదివారం జరిగిన ఈ గేమ్‌ను 59 ఎత్తుల అనంతరం డ్రాగా ముగించేందుకు ఇరువురు ఆటగాళ్లు అంగీకరించారు. ఐదో రౌండ్ అనంతరం ప్రజ్ఞానంద, అరవింద్ చెరో 3.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

కివీస్‌నూ పడగొట్టి.. అజేయంగా నిలిచి..

ఆసీస్‌తో నాకౌట్‌కు భారత్ సై


వరుణ్ (5/42)

సెమీస్‌లో ఎవరితో ఎవరు?

మార్చి 4	భారత్ x ఆస్ట్రేలియా	దుబాయ్
మార్చి 5	న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	లాహోర్

చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా గ్రూప్ దశను అజేయంగా ముగించింది. స్లో పిచ్‌పై న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైనా.. నలుగురితో కూడిన స్పిన్ దళం జట్టుకు ఆసరాగా నిలిచింది. కెరీర్‌లో రెండో వన్డే ఆడిన వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ బంతులకు కేన్ విలియమ్సన్ మినహా కివీస్ బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది. ఫలితంగా హ్యాట్రిక్ విజయంతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలిచిన భారత్.. ఆస్ట్రేలియాతో సెమీస్ పోరుకు సిద్ధమైంది.

2 చాంపియన్స్ ట్రోఫీలో భారత్ నుంచి ఉత్తమ బౌలింగ్ (5/42) కనబర్చిన రెండో బౌలర్‌గా వరుణ్. జడేజా (5/36) ముందున్నాడు.


శ్రేయాస్ (79)

1 చాంపియన్స్ ట్రోఫీ ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

వన్డేల్లో అత్యధికంగా వరుస (13) టాస్‌లు కోల్పోయిన జట్టుగా భారత్. ఇందులో రోహిత్ కెప్టెన్సీలోనే పదిసార్లు ఈ ఫీట్ నమోదైంది.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో భారత వన్డే జట్టు అదరగొడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణిస్తూ ప్రత్యర్థుల పనిబడుతున్న రోహిత్ సేన ఆదివారం న్యూజిలాండ్‌ను 44 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో గ్రూప్ 'ఏ'లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారత్.. ఈనెల 4న జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 249 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (79), హార్దిక్ పాండ్యా (45), అక్షర్ పటేల్ (42) రాణించారు. హెన్రీ 5 వికెట్లు తీశాడు. ఛేదనలో కివీస్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. కేన్ విలియమ్సన్ (81) ఒంటరి పోరాటం చేయగా, శాంట్నర్ (28) చివర్లో పర్వాలేదనిపించాడు. పేసర్ హర్షిత్ స్థానంలో జట్టులోకి వచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/42) ఐదు వికెట్లతో భేష్ అనిపించాడు. కుల్దీప్ (2/56)కు రెండు వికెట్లు దక్కాయి. వరుణ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.


విలియమ్సన్ (81)

కేన్ మినహా..: మందకొడిగా మారిన పిచ్‌పై 250 పరుగుల ఛేదన కివీస్‌కు సవాల్‌గా మారింది. కేన్ విలియమ్సన్ మాత్రమే భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ రచిన్ (6)ను హార్దిక్ అవుట్ చేశాడు. ఆ తర్వాత కేన్ జాగ్రత్తగా ఆడుతూ ఓపెనర్ యంగ్‌తో రెండో వికెట్‌కు 32, మిచెల్ (17)తో మూడో వికెట్‌కు 44, లాథమ్ (14)తో కలిసి నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించాడు. ఈక్రమంలో తను అర్ధసెంచరీ కూడా పూర్తి చేశాడు. అయితే మధ్య ఓవర్లలో స్పిన్నర్లు ఆధిపత్యం చూపారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ వచ్చింది. దీనికితోడు 36వ ఓవర్‌లో హిట్టర్ ఫిలిప్స్ (12), బ్రేస్‌వెల్ (2)లను వరుణ్ అవుట్ చేయడంతో కివీస్ 159/6తో ఒత్తిడిలో పడింది. ఇక ఓపిగ్గా క్రీజులో నిలిచిన విలియమ్సన్ వికెట్‌ను అక్షర్ తీయడంతో ప్రత్యర్థి ఆశలు వదులుకుంది. వరుణ్ టెయిలెండర్ల పనిబట్టడంతో మరో 4.3 ఓవర్లుండగానే మ్యాచ్ ముగిసింది.

శ్రేయాస్-అక్షర్ జోడీ నిలకడ: టాస్ కోల్పోయిన భారత్ తొలిసారి బ్యాటింగ్‌కు దిగింది. అయితే పవర్‌ప్లేలోనే ఓపెనర్లు గిల్ (2), రోహిత్ (15), విరాట్ (11) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో శ్రేయాస్-అక్షర్ జోడీ ఆదుకోగా.. చివర్లో హార్దిక్ వేగం ఓ మాదిరి స్కోరుకు కారణమైంది. ఫామ్‌లో ఉన్న గిల్‌ను మూడో ఓవర్‌లోనే హెన్రీ ఎల్బీ చేశాడు. రోహిత్, విరాట్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేరడంతో భారత్ 30/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. కానీ శ్రేయాస్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తనకు మరో ఎండ్ నుంచి అక్షర్ అద్భుత సహకారం అందించాడు. పిచ్ నెమ్మదిగా మారడంతో వికెట్‌ను చేజారనీయకుండా ఈ జోడీ 8 ఓవర్లపాటు సింగిల్స్‌కే పరిమితమైంది. 17వ ఓవర్‌లో శ్రేయాస్ షార్ట్ పిచ్ బంతులను హ్యాట్రిక్ ఫోర్లుగా మలిచి స్కోరులో కదలిక తెచ్చాడు. ఆ వెంటనే స్పిన్నర్లు కట్టడి చేయడంతో ఆచితూచి ఆడాల్సి వచ్చింది. దీంతో శ్రేయాస్ 75 బంతుల్లో తన కెరీర్‌లో నెమ్మదైన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. అయితే రచిన్ బౌలింగ్‌లో అక్షర్ అవుట్ కావడంతో నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే ఓరౌర్కీ షార్ట్ పిచ్ బంతికి శ్రేయాస్ క్యాచ్ అవుటయ్యాడు. రాహుల్ (23), జడేజా (16) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగిన వేళ హార్దిక్ డెత్ ఓవర్లలో వేగం చూపాడు. 49వ ఓవర్‌లో వరుసగా 4,4,6తో 15 రన్స్ సమకూరాయి. ఆఖరి ఓవర్‌లో హార్దిక్, షమి (5)లను అవుట్ చేసిన హెన్రీ ఐదు వికెట్లను పూర్తి చేసుకున్నాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) యంగ్ (బి) జేమిసన్ 15; గిల్ (ఎల్బీ) హెన్రీ 2; విరాట్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; శ్రేయాస్ (సి) యంగ్ (బి) ఓరౌర్కీ 79; అక్షర్ (సి) విలియమ్సన్ (బి) రచిన్ 42; రాహుల్ (సి) లాథమ్ (బి) శాంట్నర్ 23; హార్దిక్ (సి) రచిన్ (బి) హెన్రీ 45; జడేజా (సి) విలియమ్సన్ (బి) హెన్రీ 16; షమి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 5; కుల్దీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 50 ఓవర్లలో 249/9. వికెట్ల పతనం:** 1-15, 2-22, 3-30, 4-128, 5-172, 6-182, 7-223, 8-246, 9-249. **బౌలింగ్:** హెన్రీ 8-0-42-5; జేమిసన్ 8-0-31-1; ఓరౌర్కీ 9-0-47-1; శాంట్నర్ 10-1-41-1; బ్రేస్‌వెల్ 9-0-56-0; రచిన్ 6-0-31-1.

న్యూజిలాండ్: యంగ్ (బి) వరుణ్ 22; రచిన్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 6; విలియమ్సన్ (స్టంప్) రాహుల్ (బి) అక్షర్ 81; మిచెల్ (ఎల్బీ) కుల్దీప్ 17; లాథమ్ (ఎల్బీ) జడేజా 14; ఫిలిప్స్ (ఎల్బీ) వరుణ్ 12; బ్రేస్‌వెల్ (ఎల్బీ) వరుణ్ 2; శాంట్నర్ (బి) వరుణ్ 28; హెన్రీ (సి) విరాట్ (బి) వరుణ్ 2; జేమిసన్ (నాటౌట్) 9; ఓరౌర్కీ (బి) కుల్దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 45.3 ఓవర్లలో 205 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-17, 2-49, 3-93, 4-133, 5-151, 6-159, 7-169, 8-195, 9-196, 10-205. **బౌలింగ్:** షమి 4-0-15-0; హార్దిక్ 4-0-22-1; అక్షర్ 10-0-32-1; వరుణ్ 10-0-42-5; కుల్దీప్ 9.3-0-56-2; జడేజా 8-0-36-1.



విదర్భ.. మూడోసారి

రంజీ ట్రోఫీ కైవసం ● కేరళపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్

నాగ్‌పూర్: సీజన్ ఆసాంతం అదరగొట్టిన విదర్భ ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీని దక్కించుకుంది. కేరళతో జరిగిన ఫైనల్ ఆదివారం డ్రాగా ముగియగా..మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విదర్భ జట్టు చాంపియన్‌గా నిలిచింది. మ్యాచ్ మూడోరోజున విదర్భకు 37 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ లభించడం తోనే..టైటిల్ ఎవరిదో దాదాపు ఖరారైంది. మొదటి ఇన్నింగ్స్‌లో 379 రన్స్ చేసిన విదర్భ..కేరళను తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ చేసింది. ఇక..ఓవర్‌నైట్ స్కోరు 249/4తో ఐదో, చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ ఆట నిలిపివేసే సమయానికి 375/9 స్కోరు చేసింది. కిందటి రోజు 132 పరుగులతో ఆడుతున్న కరుణ్ నాయర్ తన స్కోరుకు మరో మూడు పరుగులే జోడించి అవుటయ్యాడు. దర్శన్ నల్‌కండే (51) అజేయ అర్ధ శతకం సాధించాడు. కేరళ స్పిన్నర్ ఆదిత్య సర్వాటే 4 వికెట్లు పడగొట్టాడు. విదర్భ బ్యాటర్ డానిష్ మలేవార్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, విదర్భకే చెందిన లెఫ్టామ్ స్పిన్నర్ హర్ష్ దూబే (69 వికెట్లు, 476 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. కాగా, విదర్భ జట్టు రంజీట్రోఫీని గెలవడం ఇది మూడోసారి. 2017-18, 2018-19లో వరుసగా రెండుసార్లు ఆ జట్టు విజేతగా నిలిచింది. గతేడాది ఫైనల్లో ముంబై చేతిలో ఓడిన విదర్భ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈసారి విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో విదర్భ రన్నరప్‌గా నిలవడం విశేషం.

రూ. 3 కోట్ల రివార్డు

విజేతగా నిలిచిన తమ జట్టుకు విదర్భ క్రికెట్ సంఘం రూ. 3 కోట్లు నజరానాగా ప్రకటించింది. టోర్నీలో 69 వికెట్లతో చరిత్ర సృష్టించిన స్పిన్నర్ హర్ష్ దూబేకు అదనంగా రూ. 25 లక్షలు అందజేయనుంది. అలాగే కరుణ్ నాయర్, యశ్ రాథోడ్‌లకు చెరో రూ. 10 లక్షలు ప్రకటించింది.

నాలాగే.. కోహ్లీ

వివ్ రిచర్డ్స్



ముంబై: విరాట్ కోహ్లీని చూస్తుంటే..తనను తాను చూసుకుంటున్నట్టుగా ఉందని వెస్టిండీస్ గ్రేట్ వివియన్ రిచర్డ్స్ (72) అన్నాడు. కోహ్లీ పోరాటపటిమ, తరగని ఉత్సాహం, ఆటపట్ల అభిరుచే.. అతడిని దిగ్గజాల సరసన నిలబెట్టాయన్నాడు. తన ఫామ్‌పై విమర్శలు వచ్చిన ప్రతీసారి బ్యాట్‌తో వారి నోళ్లు మూయించాడన్నాడు. తనలాగే విరాట్‌ది కూడా ఏ మాత్రం భయపడని, ఢీ అంటే ఢీ అనే మనస్తత్వమని, ఎప్పుడూ 120 శాతం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుంటాడని చెప్పాడు. ఒక నాయకుడికి కావాల్సిన లక్షణాలు కోహ్లీలో పుష్కలంగా ఉన్నాయని రిచర్డ్స్ ప్రశంసించాడు. మైదానంలో అతడి ప్రమేయం లేని సందర్భాలు చాలా తక్కువని, ఫిట్‌నెస్ పరంగా 50 ఏళ్ల వరకు ఆడే సత్తా విరాట్‌లో ఉందని చెప్పాడు. ఇక, కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న రోహిత్ శర్మకు రిచర్డ్స్ మద్దతుగా నిలిచాడు. అతడి విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఓర్పుగా ఉండాలని సూచించాడు. చాంపియన్స్ ట్రోఫీకి వెస్టిండీస్ అర్హత సాధించలేకపోవడంపై రిచర్డ్స్ తీవ్ర అసహనం, బాధను వ్యక్తం చేశాడు. అఫ్ఘానిస్థాన్ స్ఫూర్తితో క్రికెట్‌లో పునర్వైభవం కోసం శ్రమించాలని తమ జట్టుకు హితవు పలికాడు.

2034 నాటికి రూ.190 లక్షల కోట్లకు..

జోరుగా రిటైల్ మార్కెట్ వృద్ధి.. వినియోగదారుల అభిరుచులే కీలకం: బీసీజీ

న్యూఢిల్లీ: మన దేశంలో రిటైల్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2014లో రూ.35 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ గత ఏడాది (2024) రూ.82 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో ఏటా సగటున 8.9 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించింది. వృద్ధి రేటు ఇలానే కొనసాగితే 2034 నాటికి భారత రిటైల్ మార్కెట్ రూ.190 లక్షల కోట్లకు చేరుతుందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ)తో కలిసి రూపొందించిన ఒక నివేదికలో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) తెలిపింది.

పెరుగుతున్న దేశ జీడీపీ, వినియోగదారుల భిన్న అభిరుచులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించబోతున్నట్టు పేర్కొంది. ఒక్క కొవిడ్ సమయంలో తప్ప మిగతా అన్ని సమయాల్లో మన దేశ రిటైల్ మార్కెట్ సుస్థిర అభివృద్ధినే నమోదు చేసినట్టు తెలిపింది.

వ్యూహాలే కీలకం

కాకపోతే రిటైల్ కంపెనీలు ఇందుకోసం ఆయా వర్గాల వినియోగదారుల అభిరుచులు, ఆర్థిక స్థోమతుల ఆధారంగా తమ ఉత్పత్తులు, మార్కెటింగ్ వ్యూహాలు రూపొందించుకోవాలని బీసీజీ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా పట్టణ (ఇండియా), గ్రామీణ (భారత్) ప్రాంత వినియోగదారుల ప్రత్యేక అవసరాలను, ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకోవాలని కోరింది. వినియోగదారుల అభిరుచుల్లో ఉండే వ్యత్యాసాలను ఆకళింపు చేసుకునే రిటైల్ కంపెనీలు మాత్రమే మార్కెట్లో రాణిస్తాయని స్పష్టం చేసింది. ఒకే నగరంలోని వినియోగదారుల అభిరుచులన్నీ ఒకేవిధంగా ఉండవని కూడా తెలిపింది.



నివేదిక ఇతర ప్రధానాంశాలు
- కొనుగోలు నిర్ణయాల్లో 'వాల్యూ ఫర్ మనీ' కీలకం
- వినియోగదారుల అభిరుచులు-వస్తువుల అందుబాటు ధరల మధ్య సమతూకం ఉండాలి
- మన దేశ వినియోగదారుల్లోని భిన్నత్వాన్ని రిటైల్ కంపెనీలు అర్థం చేసుకోవాలి
- కొనుగోలు నిర్ణయాల్లో పెరుగుతున్న మహిళల పాత్ర
- రిటైల్ రంగంలో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి
- ఇంకా ఆఫ్‌లైన్ ద్వారానే 58 శాతం కొనుగోళ్లు
- గ్లోబల్ ట్రెండ్స్ బ్రాండ్లపై వినియోగదారుల ఆసక్తి
- స్థానిక ఉత్పత్తులకీ మంచి డిమాండ్

బిజినెస్

22,400పైన బుల్లిష్

(ఫిబ్రవరి 3-7 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,628-22,105 పాయింట్ల మధ్యన కదలాడి 673 పాయింట్ల నష్టంతో 22,125 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,435, 22,650, 22,859, 23,085 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 22,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,800
నిరోధ స్థాయిలు: 22,325, 22,425, 22,525 (22,225 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,925, 21,825, 21,725 (22,025 దిగువన బేరిష్)

టెక్ వ్యూ

- రియల్టీ సంస్థ ప్రణీత్ గ్రూప్.. హైదరాబాద్ సమీపంలో లగ్జరీ ట్రిప్లెక్స్ విల్లా ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. తుక్కుగూడ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14కు సమీపంలో ప్రణీత్ ప్రణవ్ రెడ్‌ఫెర్న్ స్క్వేర్ పేరుతో ఈ విల్లా ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తోంది. 30 ఎకరాల్లో విస్తరించిన ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో 180 నుంచి 350 చదరపు గజాల్లో మొత్తం 350 విల్లాలను ప్రణీత్ గ్రూప్ నిర్మించనుంది.
- ఇన్సూర్‌టెక్ ప్లాట్‌ఫామ్ ఇన్సూరెన్స్ దేఖో.. తన ఏజెంట్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించింది. కొత్తగా 95 వేల మంది ఏజెంట్లను చేర్చుకోవటం ద్వారా మొత్తం ఏజెంట్ల సంఖ్యను 2.2 లక్షలకు చేర్చింది. దీంతో దేశంలోని 99 శాతం పిన్‌కోడ్స్‌ను తన సేవలను విస్తరించినట్లయిందని ప్రకటించింది.
- కెమిన్ ఆక్వాసైన్స్.. 15న ఏజిస్ గ్రాహమ్ బెల్ అవార్డును గెలుచుకుంది. రొయ్యల సాగును లాభసాటిగా మార్చటంలో కంపెనీ ఉత్పత్తి పాత్రోల్ కీలకంగా వ్యవహరించినందుకు గాను కెమిన్ ఈ అవార్డును దక్కించుకుంది.
- ఆకాశ ఎయిర్.. హైదరాబాద్ నుంచి బిహార్‌లోని దర్భంగాకు కొత్తగా విమాన సర్వీస్‌ను ప్రారంభించింది. ఏప్రిల్ 4 నుంచి ఈ విమాన సర్వీస్ ప్రతి రోజు అందుబాటులో ఉండనుంది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ మీదుగా దర్భంగాకు ఈ సర్వీస్‌ను నడపనుంది.

ఉద్యోగాల వృద్ధి బారెడు.. జీతాల వృద్ధి చారెడు


నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ వీర్‌మణి



న్యూఢిల్లీ: దేశంలో నిజ జీతాల వృద్ధి రేటుపై నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ వీర్‌మణి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడేళ్లలో దేశంలో ఉద్యోగ అవకాశాలు పెరిగినా, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా నిజ జీతాల్లో మాత్రం ఎదుగూ బొదుగూ లేదన్నారు. ఈ కాలంలో ఉద్యోగాల కల్పన జనభా వృద్ధికి మించి జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2023 జూలై నుంచి 2024 జూన్ మధ్య జరిగిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం 2023-24లో అన్ని వయసుల జనాబాలో పని చేసే జనాభా 43.7 శాతం ఉందన్నారు. 2017-18తో పోలిస్తే ఇది 9 శాతం ఎక్కువన్నారు. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే అధిక జనాభా మన దేశానికి ఒక గొప్ప అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలని వీర్‌మణి స్పష్టం చేశారు. ఇందుకోసం మన విద్యా విధానంలో బోధన, శిక్షణను మెరగు పరుచుకోవడం అత్యంత ముఖ్యమన్నారు.

నైపుణ్యాల కొరతే కారణం: రెగ్యులర్ ఉద్యోగులతో పోలిస్తే గత ఏడేళ్లలో తాత్కాలిక ఉద్యోగుల జీతాల పెరుగుదలే బాగుందని వీర్‌మణి స్పష్టం చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో సరైన విద్య, నైపుణ్యాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఇందుకు మన విద్యా వ్యవస్థ కూడా కారణమన్నారు. ప్రత్యేక నైపుణ్యాల అవసరం ఉన్న కొన్ని రెగ్యులర్ ఉద్యోగాలకు ప్రస్తుతం అభ్యర్థులే దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాలూ కలిసి రావాలని ఆయన కోరారు. ఇందుకోసం జిల్లా స్థాయి నుంచే పని ప్రారంభం కావాలన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు పెరిగితే ఉత్పాదకత, ఉత్పాదకత పెరిగితే ఉద్యోగుల నిజ జీతాలూ పెరుగుతాయని వీర్‌మణి అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	450
వరంగల్	412	గోదావరి	450
చిత్తూరు	463	విశాఖపట్నం	482
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	100	అనంతపురం	97
గోదావరి	101		

కీలక మద్దతు 22000 చేరువలో...

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మొత్తం మీద 670 పాయింట్లు, నెల మొత్తం మీద 1,400 పాయింట్లు నష్టంతో 22,125 వద్ద ముగిసింది. గత అక్టోబరు నుంచి వరుసగా ఐదు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లోనే ఉంది. నెల మొత్తం మీద మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 5,800 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 2,200 పాయింట్లు నష్టపోయాయి. గత కొద్ది వారాలుగా నిఫ్టీ నిట్టనిలువుగా దిగజారినందు వల్ల ఈ వారంలో పుల్‌బ్యాక్ రికవరీకి ఆస్కారం ఉంది. అలాగే శుక్రవారం నాటి ప్రపంచ మార్కెట్ ధోరణులను బట్టి చూసినా రికవరీ అవకాశాలున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: ధోరణిలో స్పష్టత రావాలంటే మార్కెట్ మొదట నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం ప్రధాన మద్దతు స్థాయి 22,000 కన్నా స్వల్పంగా పైన ఉంది. సానుకూలత కోసం ఈ స్థాయిలో కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం 22,350. స్వల్పకాలిక అవరోధం 22,500.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. అప్పుడే మరింత డౌన్‌ట్రెండ్ నివారించుకోగలుగుతుంది. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 48,000 కన్నా పైన కన్సాలిడేట్ అవుతున్నట్టు కనిపిస్తోంది. ప్రధాన నిరోధం 49,000. సానుకూలత కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 47,800. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత కొనసాగుతున్నట్టు భావించి అప్రమత్తం కావాలి.

పాటర్న్: సానుకూలత కోసం నిఫ్టీ 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ ప్రస్తుతం ఓవర్‌సోల్డ్ స్థితికి చేరుకున్నందు వల్ల రికవరీకి ఆస్కారం ఉంది. షార్ట్ టర్మ్ ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,280, 22,350
మద్దతు	22,090, 22,000

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. మెక్సికో, కెనడా, చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్స్ మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. మరోవైపు శాంతి చర్చల కోసం వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఏకంగా ట్రంప్‌తో వాగ్వాదానికి దిగటం కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. పరిస్థితులు అనుకూలిస్తే మాత్రం బెంచ్‌మార్క్ సూచీల్లో కౌంటర్ ర్యాలీకి అవకాశం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: డిసెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేర్లలో 15 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.1,660 స్థాయిలో మద్దతు తీసుకుని మళ్లీ పుంజుకున్నాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తుండటం శుభ పరిణామం. చివరి మూడు సెషన్లలో ఈ షేరు 5 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,732 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,825 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్ ఇండియా: ఈ కౌంటర్‌లో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అమ్మకాల ఒత్తిడికి ప్రస్తుతం బ్రేక్ పడినట్లుగా కనిపిస్తోంది. ఓవర్‌సోల్డ్ కండీషన్‌కు రావటం, ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో మళ్లీ పెట్టుబడులు పెరిగాయి. గత వారం మార్కెట్లు నష్టపోయినప్పటికీ ఈ షేరు రాణించింది. గత శుక్రవారం రూ.369 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.350 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.390/425 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.335 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: జనవరి చివరి వారం నుంచి ఈ షేరు మెరుగ్గా రాణిస్తూ వస్తోంది. నష్టాల మార్కెట్లోనూ బలం ప్రదర్శిస్తోంది. ఒడుదొడుకులు తక్కువగా ఉన్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. ప్రైస్ యాక్షన్ కూడా బాగుంది. గత శుక్రవారం రూ.1,015 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,000 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,125/1,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.975 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ట్రెంట్: అక్టోబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. దాదాపు 45 శాతం మేర పతనమైంది. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండటంతో వాల్యూ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.4,851 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,800 వద్ద పొజిషన్ తీసుకుని రూ.5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,750 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ఇతర రంగాలతో పోలిస్తే మెటల్ సూచీ రికవరీ జోన్‌లో కనిపిస్తోంది. ఈ షేరు హయ్యర్ లోస్ నమోదు చేస్తుండటం శుభపరిణామం. ప్రైస్ యాక్షన్ కూడా టైట్‌గా ఉంది. గత శుక్రవారం రూ.634 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.625 వద్ద పొజిషన్ తీసుకుని రూ.690/725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.600 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



సీఎం రేవంత్‌ను కలిసిన ఫౌల్ట్రీ ఉత్పత్తుల ప్రతినిధుల బృందం

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఫౌల్ట్రీ ఉత్పత్తుల ప్రతినిధుల బృందం ఆదివారం కలిసింది. ఫౌల్ట్రీ ఉత్పత్తులైన కోడిగుడ్లు, చికెన్ వినియోగంలో ఎలాంటి భయాలు లేవని, వాటిని ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ బృంద సభ్యులు సీఎంను కోరారు. బృందంలో తెలంగాణ ఫౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ , తెలంగాణ ఫౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు డా.జి.రంజిత్ రెడ్డి, కె.మోహన్ రెడ్డి, వి.భాస్కర్ రావు, జి.చంద్రశేఖర్ రెడ్డి, జి.రమేష్ బాబు, డి.రాంరెడ్డి, కె.జి.ఆనంద్, ఉదయ్ సింగ్ బయాస్, సంజీవ్ చింతవార్‌లు ఉన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

రంగస్థల కళాకారులకూ అవార్డులు

భక్తరామదాసు కీర్తనలు మార్గదర్శకం: మల్లు భట్టివిక్రమార్క

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సినీ కళాకారుల మాదిరిగానే రంగస్థల కళాకారులకూ అవార్డులు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాటక రంగ పోటీలను నిర్వహించి ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. భక్తరామదాసుకు శ్రీరాముడిపై ఉన్న భక్తి, ఆయన పాడిన కీర్తనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. సంగీత కళాకారులు రామదాసును స్ఫూర్తిగా తీసుకుని ప్రముఖ విద్వాంసులుగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఆదివారం ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో భక్తరామదాసు 392వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా భక్తరామదాసు జయంతి వేడుకలను ప్రతియేటా అధికారికంగా నిర్వహించి సంగీత నాట్యకళాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భక్తరామదాసు అలియాస్ కంచర్ల గోపన్న పుట్టి పెరిగిన జిల్లాలోనే తాను జన్మించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భక్తరామదాసు గొప్ప వ్యక్తి అని, ఎన్ని కష్టాలు ఎదురైన శ్రీరాముడిపై తనకు ఉన్న భక్తిని చాటిచెప్పి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఫిబ్రవరిలో 17 అవినీతి కేసులు

» పట్టుబడ్డ వారిలో పోలీసులే ఎక్కువ: ఏసీబీ డీజీ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నెల (ఫిబ్రవరి)లో అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారులు 17 కేసులు నమోదు చేసి, 23 మందిని అరెస్టు చేశారని ఏసీబీ డీజీ విజయకుమార్ తెలిపారు. ఇందులో ట్రాప్ కేసులు 15 కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు రెండు ఉన్నాయని వివరించారు. బీసీ సంక్షేమ, ఇంధన, అటవీ, వ్యవసాయ, విద్య, సాంఘిక సంక్షేమ, రహదారుల భవనాలు శాఖలకు చెందిన ఉద్యోగులు పట్టుబడిన వారిలో ఉన్నారని, అత్యధికంగా ట్రాప్ కేసుల్లో పోలీసులే పట్టుబడ్డారని వివరించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల నుంచి రూ. 4.13 కోట్ల ఆస్తులు గుర్తించామని, వాటి మార్కెట్ విలువ దాదాపు రూ.50 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ట్రాప్ కేసుల్లో రూ.7.60 లక్షలు వివిధ వ్యక్తుల వద్ద లంచం తీసుకుంటుండగా పట్టుకున్నామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

కుంభమేళా ఏర్పాట్లపై అధ్యయనం

» ప్రయాగ్‌రాజ్ వెళ్లిన అధికారుల బృందం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే గోదావరి, కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని అందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర అధికారుల బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లింది. ఆ రాష్ట్రంలోని ప్రయోగరాజ్‌లో జరిగిన కుంభమేళా ఏ విధంగా నిర్వహించారు.. అలాగే భక్తులకు కల్పించిన సౌకర్యాలను రాష్ట్ర అధికారుల బృందం అధ్యయనం చేయనుంది. ఈ బృందంలో దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ ఎండీ న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. మన రాష్ట్రంలో 2027లో గోదావరి, 2028లో కృష్ణ పుష్కరాలు జరగనున్నాయి.

జనాభా దామాషా ప్రకారం వైశ్య సామాజిక వర్గానికి సీట్లు కేటాయించాలి

» వైశ్య వికాస వేదిక వ్యవస్థాపకుడు కాచం సత్యనారాయణ గుప్తా

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైశ్య సామాజిక వర్గానికి ఏ పార్టీ టికెట్లు ఇవ్వడంలేదని, తమ జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీట్లు ఇవ్వకపోతే ఏప్రిల్‌లో వైశ్య రాజకీయ రణభేరి సభతో తమ సత్తా చూపుతామని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపకుడు కాచం సత్యనారాయణ గుప్తా హెచ్చరించారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 5% వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వర్గీకరణకు పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో 'వైశ్యులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ విమలక్క, సీనియర్ జర్నలిస్టు పల్లె రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతగాక రేవంత్ విమర్శలు: రఘునందన్

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పాలన పడకేసిందని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. పాలన చేతగాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలపై చేస్తున్నారని మండిపడ్డారు. తమకు, సీఎంకు మధ్య దూరం పెరిగిందంటూ రాష్ట్ర మంత్రులే చెబుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన రేవంత్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పేరుకు పీసీసీ అధ్యక్ష పదవి బీసీకి ఇచ్చారన్నారు. బీసీలకు సీఎం పదవి ఇవ్వాలని అధిష్ఠానానికి లేఖ రాయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సూచించారు. మామునూరు విమానాశ్రయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. బీఆర్ఎస్ నుంచి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని ఆయన చెప్పారు. వనపర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు ఆయన వ్యక్తిత్వాన్ని తగ్గించుకొని, సీఎం పీఠాన్ని అవమానించేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని వ్యక్తిగతంగా ఏకవచనంతో మాట్లాడటం, దూషించడం సరికాదన్నారు. గతంలో ఇలాంటి భాషను వాడిన కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో గమనించాలన్నారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం ట్రాఫిక్‌పై మళ్లీ సర్వే!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీసర్వే చేపట్టనున్నాయి. వాస్తవానికి ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణం సహా డిజైన్, ఇతర అంశాలకు సంబంధించి ఓ సంస్థ డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి అందజేసింది. అయితే ఈ డీపీఆర్‌లో ట్రాఫిక్‌కు సంబంధించి పొందుపరిచిన వివరాలు సరిగా లేవని, మళ్లీ రీ సర్వే చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఢిల్లీలో జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులతో వార్షిక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంపై చర్చించిన అధికారులు.. రోడ్డు నిర్మాణానికి టెండర్లు జారీ చేసిన విషయంపైనా చర్చించారు. ఆ క్రమంలోనే రహదారిపై ట్రాఫిక్‌కు సంబంధించి కూడా మాట్లాడారు. ఆ సందర్భంగా రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత దానిపై తిరిగే వాహనాల సంఖ్య, ఏడాదికి ఎన్ని వాహనాలు పెరుగుతాయి, వాటి వల్ల వచ్చే ఆదాయం సహా పలు అంశాలపై డీపీఆర్‌లో పేర్కొన్న వివరాలు సమగ్రంగా లేవని కేంద్ర అధికారులు అన్నట్టు తెలిసింది. దీనిపై డీపీఆర్ అందించిన సంస్థ ప్రతినిధులతోనూ మాట్లాడినట్లు సమాచారం. ఏ విధానంలో వాహనాలను లెక్కగట్టారు, ప్రస్తుతం ఉత్తరభాగం మార్గంలో ఉన్న రోడ్డుపై రోజుకు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి, రింగు రోడ్డు నిర్మాణం జరిగాక ఏడాదికి వాహనాల వృద్ధి శాతం ఎంత ఉంటుందనే అంశాలపై ఆరా తీశారు. అయితే దీనిపై ఆ సంస్థ ఇచ్చిన సమాధానంతో కేంద్ర అధికారులు సంతృప్తి చెందలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఉత్తరభాగం రోడ్డుకు సంబంధించి తాము రీసర్వే చేయిస్తామని రాష్ట్ర, ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఆ సంస్థ చెప్పినట్లు సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ రీ సర్వే..

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంలో 161కిమీల మేర నిర్మించే రోడ్డును ఐదు ప్యాకేజీలుగా విభజించి రూ.7,104 కోట్లతో గతేడాది డిసెంబరు 27న ఎన్‌హెచ్ఏఐ టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలుకు మొదట ఈ ఏడాది ఫిబ్రవరి 14 వరకు అవకాశం ఇవ్వగా, తాజాగా దానిని మార్చి12 వరకు పెంచారు. ఈ క్రమంలోనే టెండర్లను త్వరితగతిన ఖరారు చేయాలని, ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులు కేంద్రానికి సూచించారు. ఆ సందర్భంగానే డీపీఆర్‌లో ట్రాఫిక్‌కు సంబంధించిన వివరాలు సరిగా లేవనే అంశం తెరపైకి వచ్చింది. ట్రాఫిక్ రద్దీ, టోల్ వసూలు ఆశాజనకంగా లేకపోతే రోడ్డు నిర్మాణం భారమనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకోసమే ఉత్తరభాగం రోడ్డు మార్గంలో ప్రస్తుతం తిరిగే వాహనాలు, నిర్మాణం తరువాత ఏటా ఎంతమేర వాహనాల వృద్ధి శాతం పెరిగే అవకాశాలున్నాయనే పూర్తి వివరాల కోసం రీ సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రంతోపాటు రాష్ట్ర



ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా ఇదే మార్గంలో ట్రాఫిక్‌పై సర్వే చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ రీసర్వే చేపట్టనుంది. ఇందుకోసం రాష్ట్ర పరిశ్రమల శాఖ, హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటికే ఉన్న ప్రాథమిక నివేదికను ఆర్అండ్‌బీ తెప్పించుకుంది. దానిని పరిశీలించిన తరువాత రీ సర్వే ఎలా నిర్వహించాలి, ఏదైనా సంస్థకు ఈ బాధ్యత అప్పగించాలా అనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. రీ సర్వేను త్వరగా పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రయాణికుల వాహనాలపైనా సర్వే..

ఆర్అండ్‌బీ రీ సర్వేలో వచ్చిన వివరాలు, మరోవైపు కేంద్రం చేపట్టే రీ సర్వేలో వచ్చే వివరాలతో.. ఇప్పటికే ఉన్న డీపీఆర్‌లోని వివరాలను పోల్చి చూడనున్నారు. ఆ తరువాత దీనిపై ఓ నిర్ణయం తీసుకుని, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టేబోయే రీ సర్వేలో రవాణా సరఫరా చేసే వాహనాలతోపాటు ప్రయాణికుల వాహనాలు ఎన్ని తిరుగుతున్నాయి, ఏ ప్రాంతాల నుంచి ఎటువైపునకు ప్రయాణం ఎక్కువగా జరుగుతోందనే వివరాలనూ సేకరించనున్నారు. 'ఆరిజన్-డెస్టినేషన్' విధానంలో ఈ సర్వే చేస్తారు. ఈ విధానంలో ప్రస్తుతం ఉన్న రోడ్లపై ప్రయాణిస్తున్న వారితో మాట్లాడతారు. కొత్తగా నిర్మించే రోడ్డు అందుబాటులోకి వచ్చిన తరువాత కొత్త రోడ్డుపై వెళ్తారా, లేక పాత రోడ్డునే వినియోగిస్తారా అనే దానితోపాటు మరికొన్ని విషయాలను అడిగి తెలుసుకుని ట్రాఫిక్‌ను అంచనా వేస్తారు.

డీపీఆర్‌లో ఏం చెప్పారంటే..

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగానికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐకి ఇచ్చిన డీపీఆర్ ప్రకారం రోడ్డు నిర్మాణాన్ని ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో నిర్మిస్తేనే లాభదాయకమని తెలిపింది. ప్రాజెక్టు కోసం చేసే ఖర్చు, నికర మార్కెట్ విలువలు, రహదారి నిర్మాణం తరువాత వసూలు చేసే టోల్ చార్జీల ద్వారా వచ్చే ఆదాయాన్ని గణించిన తరువాతే ఈపీసీ పద్ధతిలో నిర్మిస్తే లాభదాయకమని వివరించింది. కాగా రోడ్డు నిర్మాణం తరువాత 2027 (అప్పటికి రహదారి అందుబాటులోకి వస్తే) నుంచి 2046 వరకు టోల్ వసూళ్ల ద్వారా దాదాపు రూ.15,768కోట్ల రాబడి ఉంటుందని పేర్కొంది. అయితే ఇది ఏటా 5శాతం చొప్పున వాహనాల పెరుగుదల ఉంటేనే అని నివేదికలో స్పష్టం చేసింది. వాహనాల పెరుగుదల అంశాలపై స్పష్టత లేకే రీ సర్వేకు వెళ్తున్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి.

ట్రాఫిక్ సర్వే చేశారిలా..

రహదారి నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసిన సంస్థ ట్రాఫిక్ రద్దీపై ఔటర్ రింగు రోడ్డుతోపాటు పలు జాతీయ రహదారులపై సర్వే చేపట్టింది. ఆ వివరాలను డీపీఆర్‌లో పొందుపరిచింది. దీని ప్రకారం.. కారు/జీపు/వ్యాను, మినీ బస్, ప్రభుత్వ బస్సు, ప్రైవేటు బస్సు, లైట్ మోటర్ వెహికల్ గూడ్స్, లైట్ కమర్షియల్ వెహికల్స్ (4/6 చక్రాల బండ్లు), టూ యాక్సిల్ ట్రక్స్, త్రీ యాక్సిల్ ట్రక్స్ మల్టీ యాక్సిల్ వెహికల్స్ కలిపి ఇలా 9 రకాలుగా వాహనాలను విభజించి 'ఆరిజన్-డెస్టినేషన్' విధానంలో వాహనాల సర్వే చేపట్టారు. అత్యవసర సమయం (పీక్ అవర్) కింద సాయంత్రం 6-7 గంటల సమయంలోనూ సర్వే చేశారు. కాగా, ఎన్‌హెచ్-65 గిర్మాపూర్ వద్ద చేపట్టిన సర్వేలో సుమారు 15,178 పాసింజర్ కార్ యూనిట్ (పీసీయూ)లు, ఎన్‌హెచ్-161 సంగారెడ్డి-నాందేడ్ వద్ద 9,172, ఎన్‌హెచ్-765డి రోడ్డుపై నర్సాపూర్-మెదక్ వద్ద 13,834 చొప్పున వాహనాలు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇక హైదరాబాద్-నాగ్‌పూర్ (ఎన్‌హెచ్-44) రోడ్డుపై ఉన్న ఒక టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన సర్వేలో 26,161 పీసీయూలు, హైదరాబాద్-వరంగల్ (ఎన్‌హెచ్-163) హైవేపై టోల్‌ప్లాజా వద్ద 31,491, హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65)పై టోల్‌ప్లాజా వద్ద 50,826 చొప్పున వాహనాలు తిరుగుతున్నట్టు డీపీఆర్‌లో పేర్కొన్నారు. వీటితోపాటు మరికొన్ని చోట్ల కూడా సర్వే నిర్వహించారు. కాగా, రోజువారీ సగటు ట్రాఫిక్, వార్షిక సగటు రోజువారీ ట్రాఫిక్ కింద పటాన్‌చెరు, దుండిగల్, మేడ్చల్, షామీర్‌పేట, ఘట్కేసర్ ప్రాంతాల్లో కూడా ఆయా వాహనాల విభాగాల వారీగా ట్రాఫిక్ సర్వే చేసి, ఆయా వాహనాల సంఖ్యను కూడా పొందుపరిచారు.



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

యూపీఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమమే

ఏప్రిల్ 1న బ్లాక్ డే, మే 1న చలో ఢిల్లీ

సెప్టెంబరు 1న సామూహిక సెలవులు

సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

హైదరాబాద్, కవాడిగూడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 1న రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డేగా పాటిస్తామని, ప్రతి జిల్లా నుంచి ప్రధానికి లేఖలు రాస్తామని, మే1న చలో ఢిల్లీ నిర్వహిస్తామని, సెప్టెంబరు 1న సామూహిక సెలవులు పెట్టి లక్ష కలాలతో కవాతు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో యూపీఎస్ వద్దంటూ 'యుద్ధభేరి' పేరుతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశల వారీగా ఉద్యమాన్ని చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. యూపీఎస్‌ను 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 24న విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొన్నదని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లుగానే, తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

కిడ్నీకి సొమ్ము ఘటనపై విచారణ

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర కన్నెర్ర

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతు కిడ్నీ తీసుకుని సొమ్మును ఎగవేశారంటూ వచ్చిన కథనాలపై వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామ శివారు పోలంపల్లి తండాకు చెందిన రైతు ధరావత్ చిట్టిబాబుకు పొలం, డబ్బు ఆశ చూపి కిడ్నీ తీసుకున్న ఘటనపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌తో మాట్లాడి విచారణకు ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను, వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

ఎస్ఎల్‌బీసీని వైఎస్ఆర్ మొదలెడితే రేవంత్, ఉత్తమ్‌లు పూర్తి చేస్తున్నారు

» టన్నెల్‌లో ఇరుక్కుపోయిన 8 మందిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి


» కొండగట్టులో 65 మంది, మాసాయిపేటలో 25 మంది చనిపోతే కేసీఆర్‌పై లేవని గొంతు ఇప్పుడెందుకు లేస్తోంది?

» హరీశ్‌రావుపై తూర్పు జగ్గారెడ్డి ఫైర్

» బీజేపీ నేతలకు శిక్షణా.. క్రమ శిక్షణా లేదు

» వారా మాట్లాడేదంటూ ధ్వజం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): "ఎస్ఎల్‌బీసీలో ప్రమాదం జరిగితే.. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పోలేదంటూ హరీశ్‌రావు మాట్లాడుతున్నడు. కొండగట్టు ప్రమాదంలో 65 మంది, మాసాయిపేట రైలు ప్రమాదంలో 25 మంది చిన్నారులు చనిపోతే.. కనీసం చూసేందుకైనా కేసీఆర్ వెళ్లలేదు. అప్పుడు కేసీఆర్‌పై లేవని గొంతు.. ఇప్పుడు రేవంత్‌రెడ్డిపై ఎందుకు లేస్తోంది?" అంటూ హరీశ్‌రావును టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి నిలదీశారు. మంత్రులు జూపల్లి, ఉత్తమ్‌లు ప్రమాదం జరిగిన టన్నెల్ వద్దే ఉండి ప్రతి రోజూ సమీక్షిస్తున్నది హరీశ్‌రావుకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వారిలాగా తమది అశ్రద్ధ ప్రభుత్వం కాదని, జవాబుదారీ పాలన న్నారు. టన్నెల్‌లో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే.. ప్రతిదాన్నీ తప్పు పట్టాలని, బురద చల్లాలని తపన పడుతున్న హరీశ్‌రావు.. అధికారంలో ఉన్న పదేళ్లలో ఆ ప్రాజెక్టును పూర్తి



చేసేందుకు ఎందుకు తపన పడలేదని నిలదీశారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ ఆదేశాలతో మంత్రి ఉత్తమ్ 8 రోజులుగా ప్రమాదం జరిగిన టన్నెల్ వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తూనే ఉన్నారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును నాడు వైఎస్ఆర్ ప్రారంభిస్తే.. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లు పూర్తి చేస్తున్నారన్నారు.

పదేళ్లలో కేసీఆర్ కొంత పని చేసినా.. పూర్తి చేయలేక పోయారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కిందని, ఈ ప్రాజెక్టును పూర్తి చేయించాలని ఉత్తమ్, కోమటిరెడ్డి సోదరులు, జానారెడ్డి తదితర ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. కార్మికులు చిక్కుకుపోవడంతో పనులకు బ్రేక్ పడిందన్నారు.

కేబుల్ బ్రిడ్జి కూలితే మోదీ ఎందుకు పోలేదు?

గుజరాత్‌లో కేబుల్ బ్రిడ్జి కూలి 134 మంది చనిపోతే ప్రధాని మోదీ అక్కడికి ఎందుకు పోలేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తమని అడిగే ముందు.. కేబుల్ బ్రిడ్జి కూలితే ఎందుకు పోలేదంటూ మోదీని ప్రశ్నించాలని ఎంపీ రఘునందన్‌రావుకు హితవు పలికారు. బీజేపీలో శిక్షణా.. క్రమశిక్షణా లేదని, ఇక వారు కాంగ్రెస్ గురించి ఏం మాట్లాడతారని ఎద్దేవాచేశారు.

రేడియో కాలర్‌తో.. జంతువుల నుంచి భక్తులకు రక్షణ


» యానిమల్ రేడియో కాలర్ సిస్టంపై టీటీడీ దృష్టి

» వైల్డ్‌లైఫ్ అనుమతి కోరిన అధికారులు

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించే దిశగా టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది. కాలినడక మార్గాలు, ఘాట్‌రోడ్లలో ప్రయాణించే వాహనదారులకు చిరుతలు, ఏనుగులు, ఎలుగబంట్ల నుంచి ఇబ్బంది కలగకుండా యానిమల్ రేడియో కాలర్ సిస్టంను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనికోసం వైల్డ్‌లైఫ్ అధికారుల అనుమతి కోరింది. 2023 ఆగస్టు 12న అలిపిరి కాలిబాటలో నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత అనే చిన్నారిపై చిరుత దాడిచేసి చంపిన ఘటన సంచలనం రేపింది. అదే ఏడాది జూన్ 22న ఆదోనికి చెందిన కౌశిక్ అనే నాలుగేళ్ల బాలుడిపైనా చిరుత దాడి చేసింది. ఆ బాలుడు అదృష్టవశాత్తు తప్పించుకున్నాడు. పదిహేనేళ్లుగా అలిపిరి, శ్రీవారిమెట్టు కాలిబాటలతో పాటు తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్, తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్ రోడ్డులో చిరుతలు కనిపిస్తూనే ఉన్నాయి. పైగా, మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద, పార్వేటమండపం, శ్రీవారిపాదాల మార్గంలో ఏనుగుల గుంపు కూడా సంచరిస్తున్న క్రమంలో భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. టీటీడీ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వన్యమృగాల భయం మాత్రం వెంటాడుతూనే ఉంది.

ట్రాకింగ్‌తో అప్రమత్తమయ్యేలా...

అడవి జంతువుల నుంచి భక్తులకు ఎలాంటి రక్షణ కల్పించాలనే అంశంపై ఇప్పటికే టీటీడీ... వైల్డ్ లైఫ్ అధికారులను సంప్రదించింది. రేడియో కాలర్



రేడియో కాలర్‌తో ఉన్న చిరుతలు (ఫైల్)

సిస్టం అనే ఆలోచనను వైల్డ్‌లైఫ్ అధికారుల ముందుంచింది. తిరుమల పరిసర ప్రాంతాల్లో సంచరించే చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లతో పాటు జింకలకు 'రేడియో కాలర్ సిస్టం'ను ఏర్పాటు చేయాలని కోరింది. వీటి ద్వారా ఆయా జంతువులు జన సంచారం సమీపానికి వస్తే వెంటనే అలర్ట్ కావడానికి వీలుంటుందనే అభిప్రాయాన్ని టీటీడీ ఫారెస్ట్ అధికారులు వ్యక్తపరిచారు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఈ విధానాన్ని తిరుమలలోనూ అమలు చేసేందుకు వైల్డ్‌లైఫ్ అధికారులు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

సిమ్‌తో కూడిన రేడియో కాలర్ పరికరం

వైల్డ్‌లైఫ్ అధికారుల నుంచి అనుమతి వస్తే తొలుత జంతువులను ట్రాప్ చేసి పట్టుకుంటారు. ఆ తర్వాత సిమ్‌తో కూడిన రేడియో కాలర్ పరికరాన్ని ఆయా జంతువులకు అమర్చుతారు. తిరుమలలో ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు శాటిలైట్ ద్వారా వచ్చే సిగ్నల్స్ ఆధారంగా జంతువుల కదలికలను పర్యవేక్షిస్తారు. ఒకవేళ అవి భక్తులకు సమీపానికి వస్తే వెంటనే అప్రమత్తం చేయడంతో పాటు వాటిని అడవిలోకి తరిమేలా చర్యలు తీసుకుంటారు.

అభయారణ్యంలో శ్రీశైలానికి సాఫీగా..

» ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం అనుమతి

» రూ.7,700 కోట్ల అంచనా వ్యయం

» బ్రాహ్మణపల్లి-దోమలపెంట వరకు బ్రిడ్జి

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం రహదారికి మహర్దశ పట్టనుంది. 125 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ జాతీయ రహదారిలో.. అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా వెళ్లే 62 కిలోమీటర్ల దూరం(కల్వకుర్తి-శ్రీశైలం) రెండు లేన్ల ఘాట్లతో ఇరుకుగా ఉంటూ.. వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో మలుపుల వల్ల వన్యప్రాణులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ సమస్యకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పరిష్కారం లభించనుంది. ఈ కారిడార్‌కు కేంద్రం అనుమతినిచ్చింది. 62 కిమీల మేర.. అభయారణ్యంలో 30 అడుగుల ఎత్తులో నిర్మితమయ్యే ఈ రహదారి నిర్మాణానికి రూ.7,700 కోట్ల ఖర్చవుతుందని అంచనా.

అనుమతికి భారీ కసరత్తు

ఈ రహదారిలో అభయారణ్యం కారణంగా.. 62 కిమీల మేర రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీల బృందంతో కలిసి.. సీఎం రేవంత్‌రెడ్డి మూణ్నెల్ల క్రితం కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేశారు. "హైదరాబాద్-శ్రీశైలం రహదారి 125 కి.మీ మేర మంచి కండిషన్‌లో ఉంది. అయితే.. అమ్రాబాద్ అభయారణ్యంలో 62 కి.మీ. విస్తరణకు, అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తే వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ట్రాఫిక్ కూడా సాఫీగా సాగిపోతుంది. ఈ కారిడార్ పూర్తయితే.. తెలంగాణ-ఏపీ మధ్య ప్రయాణం 45 నిమిషాలు తగ్గుతుంది" అని గడ్కరీకి వివరించారు. ఆ తర్వాత కేంద్రం ఎలివేటెడ్ కారిడార్ దిశగా అడుగులు వేసింది. రూ.7,700 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ కారిడార్‌కు కావాల్సిన భూసేకరణపై సర్వే చేయాలని తెలంగాణ అటవీ శాఖను కోరింది. దాంతో రాష్ట్ర అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ కూడా శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మితమైతే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటూ గతంలో ప్రధాని మోదీకి ఓ లేఖ రాశారు.

ప్రయాణ ఇక్కట్లు దూరం

- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి మన్ననూరు, కుంచోనిమూల, దుర్వాసుల చెరువు ఫరహాబాద్, వటువర్లపల్లి, దోమలపెంట గిరిజన గ్రామాల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ వెళ్తుంది.
- ప్రాజెక్టులో భాగంగా దోమలపెంట-శ్రీశైలం మధ్య కృష్ణానదిపై సస్పెన్షన్ బ్రిడ్జిని నిర్మించాలి.
- ప్రాజెక్టు నిర్మాణానికి 370 ఎకరాల భూమి అవసరం. ఇందులో అటవీ భూములు కూడా ఉన్నాయి.
- వన్యప్రాణులకు ఇబ్బందులు లేకుండా.. వృక్ష సంపదకు పెద్దగా నష్టం కలుగకుండా భూసేకరణకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.
- నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు మార్గదర్శకాల మేరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తారు.
- ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తయి.. అందుబాటులోకి వస్తే.. ప్రయాణ ఇక్కట్లు దూరమవుతాయని అధికారులు భావిస్తున్నారు.
- ప్రస్తుతం రాత్రి వేళల్లో అభయారణ్యంలో వాహనాలపై నిషేధం ఉంది. 30 అడుగుల ఎత్తులో ఉండే కారిడార్ వల్ల.. ఆ నిషేధాన్ని ఎత్తివేయవచ్చు.
- ఎత్తులో కారిడార్ ఉండడం వల్ల.. వన్యప్రాణులకు రోడ్డు ప్రమాదాల నుంచి భద్రత కలుగుతుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నేడే

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం వెలువడనుంది. అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ ఉపేందర్‌రెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు దాన్ని విడుదల చేయనున్నారు. ఈనెల 29న ఖాళీ కానున్న 5 ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రతి అభ్యర్థి నామినేషన్‌పైనా పది మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. 11న నామినేషన్లను పరిశీలించి, నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ వరకు అవకాశం కల్పిస్తారు. ఈనెల 20న పోలింగ్ నిర్వహిస్తారు. శాసనసభలో పార్టీలకున్న సంఖ్యా బలాన్ని బట్టి అధికార కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీ సీట్లు, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ సీటు దక్కే అవకాశాలున్నాయి.



సిరిసిల్ల జిల్లా దేవునిగుట్ట తండాలో రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్

కేసీఆర్ అంటే కాళేశ్వరం
కాంగ్రెస్ అంటే శనీశ్వరం: కేటీఆర్

సిరిసిల్ల/హైదరాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ మీద ఉన్న కోపం, ద్వేషంతో మేడిగడ్డలో జరిగిన కుట్రపూరిత ప్రమాదాన్ని సాకుగా చూపడంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్‌లో పర్యటించారు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంతంలో చాలామంది రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాళేశ్వరం నీళ్లు రాక తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లోనూ వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. 48 గంటల్లో నీళ్లను వదిలిపెట్టకపోతే మంత్రి చాంబర్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే 450 మంది రైతులను సీఎం రేవంత్‌రెడ్డి పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక నీళ్లేమో పాతాళంలోకి పోయాయని, నిధులేమో ఢిల్లీకి పోతున్నాయని, నియామకాలు గాల్లో కలిసిపోతున్నాయని విమర్శించారు. మిడ్ మానేరులో ప్రస్తుతం 16 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, ఒక టీఎంసీని మల్కపేట రిజర్వాయర్‌కు వదలిపెట్టాలని.. లేదంటే అన్నదాతలతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, పరిపాలన చేతగాక.. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక సీఎం రేవంత్ రెడ్డిలో అసహనం పెరిగిపోతోందని, అందుకే ఆయన నోటికొచ్చినట్లు కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి బీ-టీంగా కాంగ్రెస్ పనిచేస్తోందని, కేవలం బడే భాయ్ మోదీ కళ్లల్లో ఆనందం కోసం చోటే భాయ్ రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఒక ప్రకటనలో ఆరోపించారు.

పార్టీ కార్యకర్తకు కేసీఆర్ ఆర్థిక సాయం

హైదరాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ కార్యకర్త, సోషల్ మీడియా ద్వారా కేసీఆర్ సందేశ్ పేరుతో, పార్టీ కార్యకలాపాలను ప్రజల్లో ప్రచారం చేస్తున్న డోకుపర్తి సుబ్బారావుకు పార్టీ అధినేత కేసీఆర్ ఆర్థికసాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కేసీఆర్ ఆయన్ను ఎర్రవెల్లి నివాసానికి పిలిపించుకుని వైద్యఖర్చుల కోసం రూ.10లక్షలు అందించారు.

రేవంత్ రెడ్డి బెదిరిస్తే.. తిరుపతి రెడ్డి సెటిల్మెంట్ చేస్తారు

సీఎం రేవంత్‌రెడ్డి ముందు బెదిరిస్తే ఆ తర్వాత ఆయన అన్న తిరుపతిరెడ్డి సెటిల్మెంట్లు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్‌ను కూల్చేయాలన్న సీఎం ఆ తర్వాత వాళ్లతోనే చేతులు కలిపారన్నారు. కర్ణాటకలో కాంట్రాక్టు దక్కించుకున్న కేపీసీ అనిల్ కుమార్‌కు తిరుపతిరెడ్డికి మధ్య ఎంత డీల్ కుదిరిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలుగుభాషాభివృద్ధికి నిధులు కేటాయించాలి

» సీఎం రేవంత్‌కు విజయనగరం ఎంపీ అప్పల నాయుడు లేఖ

హైదరాబాద్, మార్చి2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగు భాషాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీలోని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు లేఖ రాశారు. తెలుగు భాషను కాపాడుకోవడం అందరి బాధ్యతన్న ఆయన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఆదివారం ఆయన ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే

మొత్తం మూడు స్థానాలకు ఎన్నికలు.. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

పట్టభద్రుల నియోజకవర్గం ఫలితం వెల్లడికి రెండు రోజులు పట్టే అవకాశం!

కరీంనగర్/నల్లగొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్‌లోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియం ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుంది. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిచేసేందుకు 800 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యక్రమంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడు రోజులు పట్టే అవకాశముంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్ సహా 56 మంది పోటీ చేశారు. తొలి ప్రాధాన్య ఓటుతో అభ్యర్థి విజయం సాధించాలంటే పోలై, చెల్లిన ఓట్లలో 50శాతానికంటే ఒక ఓటు అధికంగా రావాల్సి ఉంటుంది. పోలింగ్ ఏకపక్షంగా జరగకపోవడంతో తొలి ప్రాధాన్య ఓటుతో అభ్యర్థులెవరూ గెలిచే అవకాశం లేదని భావిస్తున్నారు. ఇక, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీపడుతుండటం, 24,968 ఓట్లు లెక్కించాల్సి ఉండడంతో సోమవారం అర్ధరాత్రి వరకు ఈ ఫలితం వెలువడుతుందని భావిస్తున్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ఆర్జాలబావి వద్ద స్టేట్‌వేర్ హౌసింగ్ గోదాముల్లో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలో 19 మంది అభ్యర్థులు పోటీ చేశారు.



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

కేటీఆర్‌కు అహంకారం.. కిషన్‌రెడ్డికి కుళ్లు



వనపర్తిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

(మొదటిపేజీ తరువాయి)

అలవాటుగా మారిందన్నారు. "నేను కష్టపడి మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు తెస్తే.. తానే తెచ్చానని కిషన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. అలా అయితే మూసీ ప్రక్షాళనకు, మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులకు, పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి కేటాయింపులు, సమ్మక్క-సారక్క, సీతారామ సాగర్‌లకు నిధులు రాకుండా అడ్డుపడుతున్నది ఆయనేనని భావించాల్సి వస్తుంది" అని రేవంత్ అన్నారు. తాను కిషన్‌రెడ్డి ఒక సందర్భంలో కలిసి పనిచేశామని, ఆయన కంటే చిన్నవాడిని, జూనియర్‌ను అయిన తాను ఎదగడం ఓర్వలేక అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు.

ఆ ఇద్దరు చిల్లిగవ్వ కూడా తేలేదు..

తాను ఈ 14 నెలల కాలంలో 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కేవలం కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీరిద్దరు కేంద్రం నుంచి చిల్లిగవ్వ తేలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్ష కోసం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాకుండా రెండుసార్లు కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని, ఆయన వస్తే సమీక్షకు రాలేదన్నారు. ఈటల రాజేందర్ వచ్చి మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలని కోరారని తెలిపారు. కేంద్రం దగ్గర ఉన్న సీబీఐ, ఈడీతో ఎంతకాలం బెదిరిస్తారని ప్రశ్నించారు. చావు ఒక్కసారే వస్తుందని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ముందు కిషన్‌రెడ్డి సమీక్ష పెడితే తెలంగాణ ఎంపీలంతా వచ్చి ప్రతిపాదనలు ఇస్తారని, వాటి ప్రకారం నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కృష్ణానదిలో 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీల కేటాయింపును సమర్థిస్తూ కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణకు యమపాశమైందని అన్నారు. ఆనాడు పోతిరెడ్డిపాడు పొక్క పెంచుకోవడానికి తండ్రి వైఎస్ఆర్‌కు, స్వరాష్ట్రం ఏర్పడ్డాక రాయలసీమ లిఫ్టుకు పునాది వేసి కొడుకు జగన్‌కు కేసీఆర్ సాయం చేశారని ఆరోపించారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ హయాంలో 32 కిమీలు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను వదిలేశారని మండిపడ్డారు. రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పి లిఫ్టుకు కర్త, కర్మ, క్రియగా మారారని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేక ఏడాది కాక ముందే దిగిపోవాలంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు.

మనఃసాక్షితో చూడండి...

ప్రభుత్వం చేస్తున్న, చేసిన పనులను బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మనఃసాక్షితో చూడాలని సీఎం రేవంత్ అన్నారు. 25.50 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, కేసీఆర్ ఎగవేసిన రైతుబంధు సాయం రూ.7,627 కోట్లు ఇచ్చామని, కోతలు లేకుండా విద్యుత్తు అందిస్తున్నామని చెప్పారు. అలాగే 50 లక్షల మందికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్, ట్రైబల్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్లను పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి పథకాలకు రూ.6 వేల కోట్లు అందజేస్తామని చెప్పారు.

31లోపు రైతు భరోసా

కేటీఆర్, హరీశ్‌రావు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, గడీని దాటి బయటకు రాలేని కేసీఆర్ వీరి ద్వారా మాట్లాడిస్తున్నారని భట్టివిక్రమార్క మండిపడ్డారు. రెండో విడత రైతు భరోసా మార్చి 31లోపు జమ చేస్తామని అన్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్లు నిర్లక్ష్యం చేసి.. అనుకోని ప్రమాదం జరిగితే బీఆర్ఎస్ నేతలు ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

మహిళా శక్తి, రేవంతన్న భరోసా

వనపర్తి అర్బన్: ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 50మంది ముస్లింమహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రంలో రూ.36.64 కోట్లతో 42 వేల 230 మందికి మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.



చదువుకునే రోజుల్లో అద్దెకున్న ఇంటికి రేవంత్

వనపర్తి పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తాను చదువుకునే రోజుల్లో అద్దెకు ఉన్న ఇంటికి వెళ్లారు. ఆ కుటుంబం ఎంతో ఆప్యాయంగా హారతులిచ్చి రేవంత్‌ను ఆహ్వానించింది. ఈ సందర్భంగా అప్పట్లో ఆ కుటుంబ సభ్యులతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ గుర్తు చేసుకున్నారు. వారు చేసిపెట్టిన పూరీలు తింటూ వారితో సరదాగా గడిపారు. వారితో ఫొటోలు దిగారు. 'ఇది రక్త సంబంధం కాదు.. అంతకంటే ఎక్కువైన అనుబంధం. వనపర్తిలో విద్యాభ్యాసం చేస్తూ ఆనాడు అక్క ఇంట్లో ఆత్మీయతను ఆస్వాదిస్తూ పెరిగా. ఆ జ్ఞాపకాలను మోసుకుని ముఖ్యమంత్రిగా అక్క ఇంటికి వెళ్లా' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో సీఎం రేవంత్ పోస్టు చేశారు. మరోవైపు వనపర్తిలో తనతో కలిసి చదువుకున్న స్నేహితులతోనూ రేవంత్ కొద్దిసేపు గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.



వనపర్తిలోని స్నేహితులతో సీఎం రేవంత్‌రెడ్డి

లభించని ఆచూకీ..!

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

» మెత్తటి అవశేషాలను గుర్తించిన సెన్సర్
» నేడు ఒక కొలిక్కి వచ్చే అవకాశం!

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదం జరిగి తొమ్మిది రోజులైనా.. గల్లంతైన 8 మంది ఆచూకీ ఇంకా లభించలేదు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, నేవీ, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్, సౌత్ సెంట్రల్ రైల్వే, సింగరేణికి సంబంధించి దాదాపు 703 మంది కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఫలితం కానరావడం లేదు. దీంతో గల్లంతైన 8 మంది కార్మికుల బంధువుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంటోంది. ఆదివారం సాయంత్రం వరకు నలుగురి ఆచూకీని కనుగొంటామని.. వారిని బయటకు తీసుకువచ్చే అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేశామని మంత్రి జూపల్లి ఇదివరకే ప్రకటించారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం 6.45 గంటలకు 150 మంది సభ్యులు గల సహాయక బృందాలు టన్నెల్‌లోకి వెళ్లాయి. శాటిలైట్ సిస్టమ్ ద్వారా మెత్తని అవశేషాలు ఉన్నాయని గుర్తించిన ప్రదేశాల్లో పైపులను లోపలికి పంపించారు. అయితే.. అక్కడ కార్మికుల ఆనవాళ్లు దొరకనట్లు రెస్క్యూ టీం వర్గాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి. 7 మీటర్ల వరకు మట్టి, బురదను తొలగించగలిగామని, నీటి ఊట అధికం అవుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకాలేర్పడుతున్నాయని సింగరేణి కార్మికులు ఉన్నతాధికారులకు వివరించినట్లు విశ్వసనీయ సమాచారం. మూడు గ్రేడ్‌లలో కార్మికుల ఆచూకీ కోసం ఆధునిక టెక్నాలజీ ద్వారా మార్కింగ్ చేసినప్పటికీ.. టన్నెల్‌లో బురద కారణంగా సెన్సర్లు పనిచేయడంలేదని సహాయక సిబ్బంది చెబుతున్నారు. ఓ వైపు బురద, నీటిని తొలగిస్తున్న కొద్దీ.. నీటి ఊట వస్తుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. శాటిలైట్ సెన్సర్ ద్వారా 5 చోట్ల మెత్తని అవశేషాలను గుర్తించి, అక్కడ దాదాపు 7 మీటర్ల మేర మట్టిని తొలగించినా.. ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. అవశేషాలకు సంబంధించిన దుర్వాసన కూడా రావడంలేదని కార్మికులు చెబుతున్నారు. దీంతో మరోరోజు నిరీక్షణ తప్పడం లేదని తెలుస్తోంది. నీటి ఊట పెరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పటికే డీవాటరింగ్ కోసం 7 పంపులు పనిచేస్తుండగా.. వాటికి అదనంగా మూడు మోటార్లను ఏర్పాటు చేసి, నీటిని తోడుతున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.



టన్నెల్‌లో గల్లంతైన వారి అవశేషాలను గుర్తించేందుకు పైపులతో రంధ్రాలు చేస్తున్న సిబ్బంది

బీఆర్ఎస్ వల్లే టన్నెల్ ప్రమాదం!

పదేళ్లలో సొరంగం పనులు పట్టించుకోలేదు.. ప్రమాదం జరిగాక అబుదాబిలో హరీశ్ జల్సాలు

» విపక్షాలవి బురద రాజకీయాలు
» బాధితులందరినీ ఆదుకుంటాం
» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
» ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కిలోమీటరు లోపలికెళ్లిన సీఎం

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగం దుర్ఘటనకు కారణం బీఆర్ఎస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో టన్నెల్ గురించి పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడీ ప్రమాదం జరిగిందన్నారు. విపత్తులు జరిగినప్పుడు రాజకీయాలకతీతంగా ఏకం కావాల్సి ఉండగా.. విపక్షాలు మాత్రం బురద రాజకీయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు, కుయుక్తులతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో బాధితుల పరామర్శ కంటే ఎన్నికల ప్రచారానికే ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిన హరీశ్‌రావు.. టన్నెల్ ఘటన జరిగాక రెండు రోజులు అబుదాబిలో జల్సాలు చేసింది వాస్తవం కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పరిశీలించారు. టన్నెల్‌లో కిలోమీటరు దూరం లోపలికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరు, సహాయక చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి ఉంటే నేడు ఈ ప్రమాదం జరిగేదే కాదన్నారు. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో పాటు కరెంటు బిల్లులు కట్టలేదన్న కారణంతో విద్యుత్తు సరఫరాను కూడా నిలిపివేసిన ఘనత అప్పటి సీఎం కేసీఆర్‌ది కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి నల్లగొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో తాగునీరు అందించి తీరతామని స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన ప్రకృతి విపత్తు అన్నారు. దుర్ఘటన గురించి తెలిసిన గంట వ్యవధిలోనే మంత్రులను రంగంలోకి దించి సహాయక చర్యలను ప్రారంభించామని చెప్పారు. టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారన్న దానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదని.. ఇందుకు మరో రెండు మూడు రోజులు పట్టొచ్చని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ప్రమాద ఘటనలో బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

మీలా నిరంకుశ పోకడలు అవలంబించట్లే..

బీఆర్ఎస్‌లా తమ ప్రభుత్వం నిరంకుశ పోకడలను అవలంబించడం లేదని సీఎం రేవంత్ చెప్పారు. అందుకే బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎస్ఎల్‌బీసీని సందర్శించగలిగారన్నారు. దేవాదుల, కాళేశ్వరం, శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రంలో ప్రభుత్వ తప్పిదాల కారణంగా ప్రమాదాలు జరిగినప్పుడు విపక్ష నేతలను గృహనిర్బంధం చేసి, కనీసం బాధితులను పరామర్శించే అవకాశం కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న తనను కూడా అరెస్టు చేశారన్నారు. తాను ఎస్ఎల్‌బీసీని సందర్శించలేదని విమర్శలు చేస్తున్న హరీశ్‌రావు.. ఘటన జరిగిన సమయంలో ఎక్కడున్నారో తెలంగాణ సమాజానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ఆయన పాస్‌పోర్టు ఎంట్రీలను బయట పెట్టాలని సవాలు విసిరారు. ఎస్ఎల్‌బీసీ తవ్వకం పనులు పునఃప్రారంభించే క్రమంలో టన్నెల్ బోరింగ్ మిషన్‌కు సంబంధించిన విడిభాగాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అమెరికాకు పంపించి తెప్పించామని గుర్తుచేశారు. కన్వేయర్ బెల్టును పునరుద్ధరించే ప్రక్రియ సోమవారం రాత్రికి పూర్తవుతుందని.. అది పూర్తయితే మట్టిని బయటకు తరలించే ప్రక్రియ వేగిరం అవుతుందని చెప్పారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని రాడార్ వ్యవస్థ ద్వారా గుర్తించే ప్రక్రియను చేపట్టామని, రెండు రోజుల క్రితం వచ్చిన సమాచారంలో మార్కింగ్ చేసిన చోట మానవ అవశేషాలు కనిపించలేదని తెలిపారు. అవసరమైతే రోబోటిక్ టెక్నాలజీతో కార్మికుల ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ టెక్నాలజీతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

ఎంత ఖర్చయినా భరిస్తాం..

ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా వెనకాడబోమన్నారు. టన్నెల్‌ను పరిశీలించిన తర్వాత ఆయన ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ తదితర ఏజెన్సీల ముఖ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు టన్నెల్లో వాస్తవ పరిస్థితిని సీఎంకు వివరించారు. సొరంగం లోపల టీబీఎం ఇరుక్కొని ఉందని, దాన్ని పూర్తిస్థాయిలో తొలగించనంత వరకు సహాయక చర్యలు ముమ్మరమయ్యే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

అబుదాబికి.. పెళ్లికి వెళ్లాను

» రేవంత్‌కు కనీస మానవ విలువలు లేవు
» వైఫల్యాల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నం
» ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలానికి వెళ్లకుండా ఎన్నికల రాజకీయాల్లో మునిగి తేలారు
» పాలమూరుకు కాంగ్రెస్ చేసిందేంటి?
» సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిపక్షంపై ఆరోపణలు చేయడాన్ని అలవాటుగా చేసుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కర్తవ్యం మరిచి ఎన్నికల రాజకీయాల్లో మునిగితేలిన ముఖ్యమంత్రి.. తాను తన స్నేహితుడి కూతురి పెళ్లికి అబుదాబికి వెళ్లడాన్ని కూడా వివాదం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇది రేవంత్ నీచత్వానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలానికి వెంటనే వెళ్లకుండా బాధ్యత మరిచి ఎన్నికల ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారని, తొమ్మిది రోజుల తరువాత వెళ్లి ఇప్పుడు బీఆర్ఎస్‌పై, తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అబుదాబికి వెళ్లింది క్రికెట్ మ్యాచ్‌లు చూడడానికో, విహారయాత్రలకు, విలాసాలకో కాదని, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బిడ్డ పెళ్లికి హాజరయ్యేందుకు వెళ్లానని తెలిపారు. తాను ఫిబ్రవరి 21న వెళితే.. ప్రమాద ఘటన ఆ నెల 22న జరిగిందన్నారు. ప్రమాద స్థలానికి వెళ్లడానికి హెలికాప్టర్ లేదనే కారణంతో ఇరిగేషన్ మంత్రి అక్కడికి పోకుండా హైదరాబాద్‌లో ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వంలో ఉండి కూడా బాధ్యత మరచి, కనీస మానవ విలువలు పాటించకుండా ప్రవర్తించిన వారు.. తనను ఆడిపోసుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తాను బాధ్యతాయుతంగా వ్యవహరించానని తెలిపారు. ప్రమాదం జరిగి 9 రోజులు గడిచినా కార్మికులను కాపాడకపోగా, కనీసం వారి మృతదేహాలను బయటకు తీయలేని చేతగాని ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే చెల్లదని హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా శాంతిభద్రతలపై దృష్టి సారించకుండా.. ప్రతిపక్ష నాయకుల కదలికలను తెలుసుకోవడానికి ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు.

పాలమూరుకు ఏం ఒరగబెట్టారు?

సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే పాలమూరు బిడ్డనని శుష్క సెంటిమెంట్‌ను వల్లించడం తప్ప పాలమూరుకు ఒరగబెట్టిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. వనపర్తిలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఒక ప్రకటనలో స్పందిస్తూ.. కేసీఆర్‌ను తిట్టడం తప్ప ప్రజలకు పనికొచ్చే విషయం ఒక్కటి కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదన్నారు. "కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను విమర్శించడం కాదు.. కృష్ణాజలాలను అక్రమంగా తరలించుకుపోతున్న ఏపీ చర్యలకు అడ్డుకట్ట వేయి. నీటి కోసం చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. మేం పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక సంబంధాలు నెరిపాం. నీలాగా పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి తరపున సూట్‌కేసులు మోయలేదు. ప్రజాభవన్‌లో కూర్చోబెట్టి పాదసేవ చేయలేదు.. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టలేదు" అని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పాలమూరు జిల్లాను వలసల జిల్లాగా మార్చిన వంచకులు కాంగ్రెస్ ముఖ్యమంత్రులేనని ఆరోపించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు దండుకొని, భూసేకరణ కూడా పూర్తిచేయని దగాకోరు చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. కాంగ్రెస్ హయాంలో నత్తనడక నడిచిన పనులను పరిగెత్తించి పూర్తిచేసింది బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. పదేళ్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికపరమైన విషయాలను పట్టించుకోకుండా ఆదర బాదరగా ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టారని, కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యుకుహరంలోకి నెట్టారని ఆరోపించారు. వారి ప్రాణాలను బలి తీసుకొని ఇప్పుడు కుహనా ఏడ్పులు ఏడుస్తున్నారని మండిపడ్డారు.

సన్‌ఫ్లవర్ రైతుల కష్టాలు పట్టవా?: హరీశ్

హైదరాబాద్/సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలోని పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే రాష్ట్రమంతటా సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ పేరు చెప్పి రైతులను కష్టపెట్టొద్దని అన్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.


ఐఐటీ హైదరాబాద్ అధ్యాపక బృందంతో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తదితరులు

ఐఐటీహెచ్ ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలి

» ప్రతిపల్లెకు సాంకేతికతను విస్తరించాలి

» ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పిలుపు

హైదరాబాద్, కంది, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనలు, విద్యావిధానాలను సతీమణి సుదేశ్ ధన్‌ఖడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ఐఐటీహెచ్ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం ఐఐటీహెచ్‌లోని ఆడిటోరియంలో అధ్యాపకులు, విద్యార్థులతో సంభాషించారు. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలలో కార్పొరేట్ పెట్టుబడి ఆవశ్యకతను గుర్తించామన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఆవిష్కరణలలో పురోగతి కీలకమన్నారు. ప్రతి పల్లెకు సాంకేతికతను విస్తరించాలని సూచించారు. సామాన్యులకు ఉపయోగపడే స్టార్టప్‌లు తీసుకురావాలన్నారు. 2008లో స్థాపించిన అనతి కాలంలోనే ప్రపంచ సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు జరుపుతున్నందుకు ఐఐటీహెచ్ అధ్యాపకులను ఉపరాష్ట్రపతి అభినందించారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకు ముందు ఉపరాష్ట్రపతి దంపతులకు శంషాబాద్ విమానాశ్రయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు స్వాగతం పలికారు.


కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన శ్రీపాదరావు

» రవీంద్రభారతిలో ఘనంగా జయంతి వేడుకలు

హైదరాబాద్, న్యూఢిల్లీ, రవీంద్రభారతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ సభాపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని వక్తలు అభివర్ణించారు. పార్టీలకు అతీతంగా పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొని శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. శ్రీపాదరావు తనలాంటి ఎంతోమందికి ఆదర్శప్రాయులని కొనియాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన శ్రీపాదరావు ఆదర్శప్రాయులని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తన తండ్రి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆయనకు దక్కిన గౌరవంగా భావిస్తానని చెప్పారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి డీజీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి డీజీపీ కార్యాలయ ముఖ్య భద్రతాధికారి యోగేశ్వర్ రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలోనూ శ్రీపాదరావు జయంతిని ఆదివారం నిర్వహించారు.

'వైపీఎస్' సునీల్‌కుమార్‌పై ఏపీ సర్కారు వేటు!

» సీఐడీ మాజీ చీఫ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో సీఐడీ అధిపతిగా, నిఘా విభాగం చీఫ్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాల్లో పర్యటించడం.. ఒక దేశానికి వెళ్తానని చెప్పి.. మరో దేశంలో తిరగడం అఖిల భారత సర్వీసు నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. గీత దాటారని తేలడంతో ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అనధికారికంగా ఆయన చేపట్టిన విదేశీ పర్యటనలు జాతీయ భద్రతకు ముప్పు తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. కీలక స్థానాల్లో పనిచేసే ఐపీఎస్ అధికారుల వద్ద చాలా సున్నితమైన సమాచారం ఉంటుందని, పర్యటనల్లో ఉల్లంఘనలు గమనిస్తే ఆ రహస్య సమాచారం బయటకు పొక్కి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. రూ.వేల కోట్ల ఆర్థికపరమైన కేసుల దర్యాప్తు, విదేశాల్లో దాక్కున్న నిందితులపై విచారణలు సీఐడీ పరిధిలోనే ఉంటాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో గుర్తుచేసింది. తనకన్నా పై స్థాయి అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా వెళ్లడం తీవ్రమైన తప్పుగా పరిగణించింది. 2019-24 నడుమ ఐదేళ్లలో ఆరు సార్లు సునీల్‌కుమార్ జరిపిన విదేశీ రహస్య పర్యటనల లోగుట్టు వెలికి తీయాల్సి ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో విచారణ పూర్తయ్యేవరకు విజయవాడ వదిలివెళ్లొద్దని ఆయన్ను ఆదేశించింది. ఆయన తీరుపై విచారణకు గత నెలలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను ప్రభుత్వం నియమించింది. సునీల్‌కుమార్ ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. ఐపీఎస్ అధికారులు ఎప్పుడు విదేశాలకు వెళ్లినా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలన్న చైన్ ఆఫ్ కమాండ్ ప్రొటోకాల్‌ను ఆయన పాటించలేదని వెల్లడైంది. పదే పదే ఉల్లంఘనలకు పాల్పడడాన్ని క్రమశిక్షణరాహిత్యంగా పరిగణిస్తూ డిసిప్లిన్ అండ్ అప్పీల్ రూల్స్ కింద ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

కృష్ణా జలాల అక్రమ వినియోగం.. ఏపీపై ఫిర్యాదుకు తెలంగాణ సిద్ధం

» నేడు ఢిల్లీకి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: మార్చి 2 (ఆంధ్రజ్యోతి) కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ తీరుపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ సిద్ధమైంది. సోమవారం ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కార్యదర్శి దెబశ్రీ ముఖర్జీతో ఈ మేరకు సమావేశంకానున్నారు. రాష్ట్ర సాగు నీటి రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇవ్వనున్నారు. వాటాకి మించి కృష్ణా జలాలు వాడుకున్న ఏపీ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీళ్లు తీసుకుంటోందని మరోసారి కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేయనున్నారు. నీళ్లు తీసుకోకుండా తక్షణమే ఏపీని కట్టడి చేయాలని కోరనున్నారు. అలాగే, సీతారామ-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. సమ్మక్క సాగర్‌కు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరనున్నారు. కాగా కోటాకి మించి కృష్ణా జలాలు వినియోగించుకుంటున్న ఏపీని కట్టడి చేసేందుకు మంత్రి ఉత్తమ్ తీసుకున్న చర్యలు కొంతమేర ఫలించాయని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటన నేపథ్యంలో జలసౌధలో ఆదివారం నిర్వహించిన సమీక్షలో అధికారులు ఈ విషయాన్ని మంత్రికి తెలియజేశారు.

రెండో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

» 6న క్యాబినెట్ భేటీలో తేదీ ఖరారు

» ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లులకు ఆమోదం తర్వాత వారం పాటు విరామం

» ఏప్రిల్ 3 వరకూ సమావేశాలు!

» అసెంబ్లీని ప్రోరోగ్‌చేస్తూ గవర్నర్ ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 2వ వారంలో ప్రారంభం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రి వర్గ సమావేశంలో తేదీ ఖరారు కానుంది. ఈ నెల 8వ తేదీ నుంచే బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలా.. లేక 10 తర్వాత నిర్వహించాలా అన్నదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మంత్రివర్గ భేటీలో కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణ, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులకు ఆమోద ముద్ర వేయనున్నట్లు సమాచారం. విద్యా, ఉద్యోగాల్లోనూ బీసీలకు రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన బిల్లునూ ప్రవేశపెట్టాలా లేదా అన్నది సమావేశంలో నిర్ణయించనున్నారు. అదే విధంగా బడ్జెట్ సమావేశాలను ఎప్పటి వరకు నిర్వహించాలని క్యాబినెట్ ఓ నిర్ణయానికి రానుంది.

శాసనసభ, మండలి ప్రోరోగ్

శాసనసభ, మండలిని ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శీతాకాల సమావేశాలను ప్రోరోగ్ చేయడంతో ప్రస్తుతం కొత్త సమావేశాలకు లైన్ క్లియరైంది. ఈ నేపథ్యంలో గవర్నర్ ప్రసంగంతోనే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అయితే సభకు ఒక వారం పాటు విరామం ఇచ్చి ఆ తర్వాత బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం తర్వాత కులగణన సర్వే నివేదికను సభలో టేబుల్ చేయనున్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు బిల్లులను సభలో ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాను 42 శాతం మేరకు పెంచేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరుతూ సభలో తీర్మానాన్ని ఆమోదించనున్నారు. అనంతరం సభకు వారం పాటు విరామం ఇచ్చి ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లనున్నట్లు సమాచారం. 10 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లనున్నట్లు చెబుతున్నారు. కాగా, విరామం అనంతరం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఏప్రిల్ 3 వరకూ సభ జరిగే అవకాశం ఉంది.



మదర్ డెయిరీని ముంచిన సంస్థాగత లోపాలు!

మార్కెటింగ్ విభాగం వైఫల్యాల వల్లే భారీగా నష్టాలు



» ఢిల్లీ మదర్ డెయిరీతో ఒప్పందం రద్దు తర్వాత నుంచే..

» బ్యాంకులు, ఎన్‌డీడీపీ నుంచి రూ.30 కోట్ల రుణం

» వడ్డీ కిందే సంవత్సరానికి రూ.5కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి

» పదేళ్లుగా పట్టించుకోని పాలక వర్గం

హయత్‌నగర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): సంస్థాగత లోపాలు, మార్కెటింగ్‌లో వైఫల్యాలు, కొండలా పెరిగిన అప్పులు, పాలకవర్గాల ఇష్టారాజ్యం... ఇలా నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ (నార్ముల్-మదర్ డెయిరీ) నష్టాల్లో కూరుకుపోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. 50వేల మంది పాడి రైతులకు జీవనోపాధి కల్పించిన సంస్థ.. ఇప్పుడు అదే రైతులకు రూ.24 కోట్ల మేర బకాయి పడింది. పోటీ మార్కెట్‌ను తట్టుకుని రెండు దశాబ్దాలపాటు లాభాలు గడించిన మదర్ డెయిరీ... ప్రస్తుతం సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, అప్పులకు వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్మాలని యోచిస్తోంది. తలాపాపం తిలా పిడికెడు అన్నట్లుగా పాలక వర్గం నిర్ణయాలు, అధికారుల అవినీతి కలిసి డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది.

సంస్థాగతంగా ఇవీ ఇబ్బందులు

హయత్‌నగర్‌లో మదర్ డెయిరీని 3 దశాబ్దాల క్రితం ప్రారంభించారు. తొలుత ఢిల్లీకి చెందిన మదర్ డెయిరీతో కలిసి పాలు విక్రయించే వారు. అప్పుడు ప్రతి రోజూ రూ.34 లక్షల మేర వ్యాపారం జరిగేది. నెలకు సుమారు రూ.10.20 కోట్లు వచ్చేవి. దీంతో స్థానికంగా ఉన్న మదర్ డెయిరీ సంస్థ లాభాల్లోకి వెళ్లింది. ఆ సమయంలోనే చిట్యాలలో 30 ఎకరాలు, మరికొన్ని చోట్ల విలువైన స్థిర ఆస్తులు కొన్నారు. సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటే మరిన్ని లాభాలు గడించవచ్చన్న ఆశతో 2015లో ఢిల్లీ మదర్ డెయిరీతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ క్రమంలోనే మార్కెటింగ్ వ్యవస్థనంతటినీ ఇద్దరు డిస్ట్రిబ్యూటర్లకు అప్పగించింది. పాలకవర్గాలు, అధికారులు వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంతో క్రమక్రమంగా నష్టాలు పెరుగుతూ పోయాయి. హయత్‌నగర్ మదర్ డెయిరీతో మార్కెటింగ్ ఒప్పందం రద్దు చేసుకున్నాక ఢిల్లీ మదర్ డెయిరీ హైదరాబాద్‌లో పాల విక్రయాలు ప్రారంభించింది. ఆ సంస్థ లీటరుకు రూ.4 మేర తగ్గించి అమ్మడంతో హయత్‌నగర్ మదర్ డెయిరీపై తీవ్ర ప్రభావం చూపింది. దీన్ని తట్టుకోవడానికి హయత్‌నగర్ మదర్‌డెయిరీ కూడా నార్ముల్ బ్రాండ్ పేరుతో రూ.4 తగ్గించి పాలను అమ్మడం ప్రారంభించింది. దీంతో సంస్థపై తీవ్ర ఆర్థిక భారం పెరిగిపోయింది. రోజుకు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లింది. నిర్వహణ కష్టంగా మారడంతో 2015లోనే మదర్ డెయిరీకి చెందిన స్థిరాస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.28 కోట్లు, ఎన్‌డీడీపీ నుంచి 2.5 కోట్లు అప్పుగా తెచ్చారు. ఈ అప్పుకు సంబంధించి.. ప్రతి నెలా రూ.45 లక్షల చొప్పున ఏటా రూ.5కోట్లు దాకా వడ్డీ చెల్లిస్తున్నారు. దీనికితోడు డెయిరీలో 300 మంది ఉద్యోగుల అవసరం ఉండగా, 570 మందిని నియమించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీని వల్ల డెయిరీపై ప్రతి నెలా రూ.1.80కోట్ల అదనపు ఆర్థిక భారం పడింది. వీరిలో ఒకేసారి 240 మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, పదోన్నతులు కల్పించడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. డెయిరీలో ఉండాల్సిన టెక్నికల్ సిబ్బంది 24 శీతలీకర కేంద్రాల్లో ఉండడం, శీతలీకరణ కేంద్రాల్లో ఉండాల్సిన సిబ్బంది డెయిరీలో పాతుకుపోవడం సమస్యగా మారింది. కాగా ప్రస్తుతం డెయిరీలోని సిబ్బందికి ఫిబ్రవరి నెల వేతనాలూ ఇవ్వలేని పరిస్థితి ఉంది. రూ.30 వేల కన్నా తక్కువ వేతనం ఉన్న వారికి పూర్తిగా ఇచ్చారు. రూ.30వేలు దాటిన వారికి మాత్రం సగం వేతనమే ఇచ్చినట్లు సమాచారం. నెలాఖరులోగా వారికి సర్దుబాటు చేస్తామని డెయిరీ ఎండీ కృష్ణ తెలిపారు.

మార్కెటింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం

నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీని గట్టెక్కించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఆస్తులు అమ్మేందుకు రైతుల ఆమోదం పొందాం. నెల రోజులుగా మార్కెటింగ్‌పైనా ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం స్థానిక రైతుల నుంచి 64వేల లీటర్లు వస్తున్నాయి. అదనంగా కర్ణాటక రైతులు, అమూల్ సంస్థ నుంచి 20వేల లీటర్లను కొనుగోలు చేస్తున్నాం. భవిష్యత్తులో మార్కెటింగ్ బృందాలను పెంచుతాం. కొత్తగా డిస్ట్రిబ్యూటర్లను నియమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఢిల్లీ మదర్ డెయిరీతో కలిసి మార్కెటింగ్ చేసే విషయమై ఆలోచిస్తున్నాం. ఒత్తిళ్లు ఉన్నా డెయిరీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని.. శుక్రవారం ఒకే సారి 92 మంది ఉద్యోగులను బదిలీ చేశాం.

-గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

కార్యక్షేత్రంలోకి మీనాక్షి నటరాజన్

» రేపు హైదరాబాద్‌కు కాంగ్రెస్ ఇన్‌చార్జి

» మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నేతలతో భేటీ

» క్షేత్రస్థాయిలో పార్టీ స్థితిపై సమీక్ష!



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో కార్యక్షేత్రంలోకి దిగుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అవగాహన చేసుకోవడంతో పాటు అధిష్ఠానం తరఫున దిశానిర్దేశం చేసుకునేందుకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ నేతలతో భేటీ కానున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు రానున్న మీనాక్షి నటరాజన్.. మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ నేతలతో సమావేశం అవుతారు. ఆమెతో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ సమావేశంలో పాల్గొంటారు. ఈ భేటీలో ప్రధానంగా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై సమీక్ష చేయనున్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయా..? లేదా..? అన్నదానిపై ఆమె ఆరా తీయనున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. అలాగే సంక్షేమ కార్యక్రమాల ప్రచారాన్ని ప్రజల దాకా తీసుకెళ్లడంలో ఎక్కడ విఫలమవుతున్నదీ సమీక్ష చేయనున్నట్లు వెల్లడించాయి. నాయకుల మధ్య సమన్వయ లోపం, క్షేత్రస్థాయి నాయకుల్లో నెలకొన్న ఆవేదనను అడిగి తెలుసుకోనున్నారు. పార్టీ శ్రేణులను కదిలించేందుకు తగిన కార్యాచరణనూ అధిష్ఠానం తరఫున నిర్దేశించనున్నారు. 'జై బాపూ.. జై భీం' కార్యక్రమంలో భాగంగా పల్లె పల్లెలో పాదయాత్రల నిర్వహణపైనా మార్గనిర్దేశం చేయనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. సాయంత్రం 5 గంటలకు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నాయకులతో మీనాక్షి నటరాజన్ భేటీ అవుతారు. ఈ లోక్‌సభ నియోజకవర్గ భేటీలు వరుసగా కొనసాగనున్నాయి.

సీఎం రేవంత్.. కన్ఫ్యూజన్‌లో!

(మొదటిపేజీ తరువాయి)



విమానాశ్రయాన్ని కొచ్చి విమానాశ్రయం తరహాలో తీర్చిదిద్దాలంటూ సీఎం రేవంత్ అధికారులను ఆదేశించడంపై స్పందిస్తూ రామ్మోహన్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేశాయని ఆరోపించారు. తెలంగాణను ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. ఇక్కడ ఏరో స్పేస్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. విమానాలను మనదేశంలోనే తయారు చేసుకోవాలన్నది ప్రధాని మోదీ సంకల్పమని, అలాంటి పరిశ్రమను హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ చెప్పారు. మామునూరు విమానాశ్రయం రన్‌వేకు అవసరమైన 280 ఎకరాల భూమిని అప్పగిస్తే.. రెండున్నరేళ్లలోనే ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తిచేస్తామన్నారు. విమానాశ్రయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. వరంగల్‌లో ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ అధీనంలో ఉన్న 696 ఎకరాల్లో గతంలో ఆసియా ఖండంలోనే (దేశానికి స్వాతంత్ర్యం రాకముందు) అతిపెద్ద విమానాశ్రయం ఉండేదన్నారు. హైదరాబాద్-శ్రీశైలం సీ ప్లేన్ ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వారధిగా పనిచేస్తున్నారని చెప్పారు. ఉడాన్ యాత్రికన్ కేఫేను హైదరాబాద్ విమానాశ్రయంలోనూ అందుబాటులోకి తెస్తామన్నారు. దీంతో రూ.10కే టీ, కాఫీ, మంచినీటి సీసా, స్వీటు రూ.20కి దొరుకుతాయన్నారు. దేశవ్యాప్తంగా అన్ని మెట్రో నగరాల్లో రెండో విమానాశ్రయం అందుబాటులోకి వస్తోందని.. బేగంపేట విమానాశ్రయం కూడా భవిష్యత్తులో మరింత వినియోగంలోకి వస్తుందని చెప్పారు. గత పదేళ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి ఏకంగా 150కి చేరుకుందన్నారు. భద్రాచలం, జక్రాన్‌పల్లిలో భౌగోళిక సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక రాగానే విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వరంగల్‌లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయ్: కిషన్‌రెడ్డి


ఓరుగల్లుకు విమాన సేవలను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని కిషన్‌రెడ్డి చెప్పారు. విమానాశ్రయంతో వరంగల్‌లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు లభించినప్పుడే ప్రధాని మోదీ వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

అడవి గాయాలకు అద్దంపట్టే కవిత్వం శతర

» సిరికి స్వామినాయుడు కవితా సంపుటి ఆవిష్కరణలో వక్తలు

» ఖనిజాల కోసం అడవుల్లో మారణహోమం బాధాకరం

» సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి వ్యాఖ్య


శతర కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కె. శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో 30ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న సిరికి స్వామినాయుడు రాసిన 'శతర' ఆదివాసీ కవితా సంపుటి అడవి గాయాలకు అద్దపడుతోందని వక్తలు అభిప్రాయపడ్డారు. శతర ఆవిష్కరణ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలుగులో కథ, నవల, కవిత్వం, విమర్శ ఏదైనా ఉత్తరాంధ్ర సాహిత్యం తర్వాతేనన్నారు. శ్రీకాకుళ గిరిజనోద్యమం అనంతరం వెలువడిన కవిత్వంలో 'శతర' సంపుటి ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకు పాలకులు ఆదివాసీలు, గిరిజనుల్లో విద్వేషాన్ని రగిలిస్తున్నారన్నారు. పచ్చని అడవుల్లో మారణహోమాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సైనిక దాడులు, వ్యాపార నాగరికత, ఆధునిక సంస్కృతి, వికృతమైన సాంస్కృతిక లక్షణాలు తదితర ప్రభావాల వల్ల ఆదివాసీల జీవితాల్లో వస్తున్న మార్పులు 'శతర'లో కనిపిస్తున్నాయన్నారు. 'శతర'ను అడవి గాయాలకు అద్దం పట్టిన కవిత్వమని సుప్రసిద్ధ రచయిత అట్టాడ అప్పలనాయుడు పేర్కొన్నారు. అవధానం రఘుకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు, థాతి కవయిత్రి దాసోజు లలిత, మూలధ్వని కన్వీనర్ ఆచార్య గూడూరు మనోజ మాట్లాడారు. శతర అంటే ఆదివాసీ భాషలో ఉత్సవమని తెలిపిన సిరికి స్వామినాయుడు.. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై తీవ్రత వేదన వ్యక్తం చేశారు. పుస్తకావిష్కరణ అనంతరం చాయా పబ్లికేషన్స్ ఎడిటర్ అరుణాంక్ లత అధ్యక్షతన జరిగిన ప్రత్యామ్నాయ సాహిత్య సదస్సులో 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంగీత, నృత్యాల అభ్యున్నతిలో కీలకపాత్ర పోషించిన దేవదాసీ మీద వ్యభిచార ముద్రవేయడం అత్యంత అమానవీయమన్నారు. సదస్సులో ప్రజాగాయని విమలక్క, పలువురు కవులు, రచయిత్రులు పాల్గొన్నారు.


స్టాప్ యాక్సిడెంట్స్ యాప్‌లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసిన విజేతకు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న పీవీ సింధు

రోడ్డు భద్రతపై అవగాహనకు యాప్

» సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'స్టాప్ యాక్సిడెంట్స్'కు రూపకల్పన

» ప్రారంభించిన బ్యాడ్మింటన్ స్టార్ సింధు

రాయదుర్గం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎక్కువగా కాలేజీ విద్యార్థులు, యువత రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారని, వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రుల ఎండీ డాక్టర్ గురవారెడ్డి సారథ్యంలోని సర్వేజన ఫౌండేషన్ రూపొందించిన 'స్టాప్ యాక్సిడెంట్స్ యాప్'ను ఆదివారం విప్రో సర్కిల్ సమీపంలోని ఫీనిక్స్ కార్యాలయంలో పీవీ సింధు ప్రారంభించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విప్రో సర్కిల్‌ను ప్రమాదరహిత జంక్షన్‌గా మార్చేందుకు సోలార్ క్యాట్ ఐస్, జీబ్రా క్రాసింగ్ లైన్లు, సిగ్నేచర్ బోర్డులు, డిలినేటర్స్ ఏర్పాటు చేశారు. డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'స్టాప్ యాక్సిడెంట్స్ యాప్'ను తెచ్చామన్నారు. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అందులోని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చిన వారికి ప్రతి నెలా రూ.లక్ష బహుమతులు అందజేస్తామని చెప్పారు.

మీనాక్షికి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి: టీపీసీసీ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత భావాలు కలిగిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కించపరుస్తూ మాట్లాడిన కేటీఆర్.. వెంటనే ఆమెకు క్షమాపణలు చెప్పాలని రాజీవ్ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్ డిమాండ్ చేశారు. సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే మంత్రి అయిన చరిత్ర కేటీఆర్‌దన్నారు. రెండుసార్లు కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు, ప్రధానంగా హైదరాబాద్ అభివృద్ధికి ఏం సాధించి తెచ్చారో చెప్పాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.